నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

visit us @ http://epaper.suryaa.com

ఆదివారం | 27 అక్టోబర్ 2024 | విజయవాడ

సంపుటి 18 | సంచిక 6
| పేజీలు 10+8 | వెల: రూ. 8.00

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi



సూర్య www.suryaa.com 18వ వసంతంలోకి ...

విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...



☞ APPSC,TSPSC పోటీపరీక్షల గైడెన్స్
☞ నిపుణులైన అధ్యాపకులతో నాణ్యమైన మెటీరియల్
☞ కరెంట్ అఫైర్స్
☞ నమూనా ప్రశ్నాపత్రాలు
☞ విద్యా ఉద్యోగ సమాచారం


'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్ www.suryaepaper.com చూడండి.


అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయణం - వర్ష ఋతువు, ఆశ్వీయుజ మాసం దశమి ఉ.7.20, మఖ మ.2.58 వర్జ్యం రా.11.39 నుంచి 1.23 వరకు
రాహుకాలం సా.4.30 నుంచి 6.00 వరకు దుర్ముహూర్తం సా.4.01 నుంచి 4.47 వరకు

# విషవలయంలో ఏపీ

- రూ.10 లక్షల కోట్లకుపైగా అప్పుల భారం
- ఇసుక, మద్యం అక్రమాలను సహించం
- మంగళగిరిలో టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభించిన చంద్రబాబు
- టీడీపీ రాకముందు తెలుగువారికి సరైన గౌరవం లేదని వ్యాఖ్యలు
- టీడీపీ ఒక పొలిటికల్ యూనివర్సిటీ అని వెల్లడి
- మద్యం, ఇసుక వ్యవహారంలో ఎవరూ జోక్యం చేసుకోవద్దని హెచ్చరిక
- ఎవరైనా ఇసుక దందా చేస్తే తిరుగుబాటు చేయాలని కార్యకర్తలకు సూచన్
- మీడియా సమావేశంలో చంద్రబాబు



2లో

వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి చేసిన విధ్వంసం నుంచి ఏపీని గాడిలో పెడుతున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. రూ.10 లక్షల కోట్లకు పైగా ఏపీపై అప్పు భారం ఉందని.. దానిని కూటమి ప్రభుత్వం మోస్తుందనే విషయాన్ని ప్రజలు గ్రహించాలని అన్నారు. ఏపీ ఓ విషవలయంలో ఉందనే గుర్తించాలని కోరారు.కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకు వచ్చేలా వైసీపీ నేతలు కుట్ర పన్నుతున్నారని సీఎం ఆరోపించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానంలోకి వైసీపీ నేతలు చొరబడ్డారని విమర్శించారు.

## సరస్వతి పవర్ భూములపై
# డిప్యూటీ సీఎం ఆరా

- వివరాలు సేకరించాలని అధికారులకు ఆదేశాలు
- అటవీ భూములు ఏమైనా ఉన్నాయా?
- పర్యావరణ అనుమతులు ఎలా వచ్చాయి?
- పల్నాడు జిల్లా దాచేపల్లి, మాచవరం మండలాల్లో వైఎస్ జగన్‌కు చెందిన సరస్వతి పవర్ సంస్థకు 1515.93 ఎకరాల భూమి

ఏపీలో ప్రస్తుతం వైసీపీ అధినేత మాజీ సీఎం వైఎస్ జగన్, ఆయన సోదరి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు మధ్య ఆస్తుల వివాదం హాట్ టాపిక్‌గా ఉంది. వైఎస్ఆర్ కుటుంబ ఆస్తుల పంపిణీ అంశానికి సంబంధించి విమర్శలు, ప్రతి విమర్శలతో మాటల యుద్ధం జరుగుతుండటం చర్చనీయాంశంగా మారింది.



2లో

## నివాళులు అర్పించిన ప్రధాని మోడీ



6లో

సంస్కృతిని చాటి చెప్పిన గొప్ప కళాకారుడు కనకరాజు

గుస్సాడీ (దండారి)ని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప కళాకారుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత కనకరాజు అని ప్రధాని మోడీ ( ఎక్స్) వేదికగా శనివారం సంతాపాన్ని ప్రకటించారు.

## జార్ఖండ్ ఎన్నికల బ్రాండ్ అంబాసిడర్‌గా ధోనీ



6లో

- 81 అసెంబ్లీ స్థానాలు క్లిగిన్ ఝూర్ఖండ్ లో రెండు విడతల్లో ఎన్నికలు
- నవంబర్ 13న తొలి విడతలో 43 స్థానాలకు ఎన్నికలు
- మిగిలిన 38 స్థానాలకు నవంబర్ 20న ఎన్నికలు.. 23న ఫలితాలు

## ఆర్థిక వ్యవస్థ గాడిలో పడుతోంది



6లో

- గత కొన్నేళ్లుగా తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటున్నాం
- ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్


సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్


## 4 గంటల్లోనే
# హైదరాబాద్ టు విశాఖ!

- శంషాబాద్-విశాఖపట్నం మధ్య సెమీ హైస్పీడ్ రైల్ కారిడార్



6లో

తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల మధ్య ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించే ప్రాజెక్టు ప్రణాళిక కీలక దశకు చేరుకుంది. శంషాబాద్ నుంచి విశాఖపట్నం మధ్య సెమీ హైస్పీడ్ రైల్ కారిడార్ ఎలైన్‌మెంట్ ఖరారైంది. సూర్యాపేట, విజయవాడ మీదుగా ఈ మార్గాన్ని కూటమి ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టో భాగంగా విశాఖ నుంచి విజయవాడ, సూర్యాపేటల మీదుగా కర్నూలుకు మరో కారిడార్ నిర్మించనున్నారు. ఈ కారిడర్ విశాఖ నుంచి మొదలై సూర్యాపేట, నల్గొండ, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ మీదుగా కర్నూలు చేరుతుంది. వీటి ప్రిలిమినరీ ఇంజినీరింగ్, ట్రాఫిక్ సర్వే తుది దశకు చేరుకుంది. ఈ సర్వే నివేదికను నవంబరులో రైల్వేబోర్డుకు రాష్ట్ర ప్రభుత్వం సమర్పించనున్నట్లు సమాచారం.


## కమలా హారిస్ ప్రచారానికి అడ్డు

- ర్యాలీకి ట్రంప్ మద్దతుదారుల అంతరాయం
- నవంబర్ 5న జరగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికలు
- ఇద్దరు అభ్యర్థుల మధ్య గట్టి పోటీ ఉందన్న మీడియా



6లో

## ఇరాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు



6లో

- ఇజ్రాయెల్‌పై బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిన ఇరాన్
- తాజాగా ప్రతీకార దాడులకు దిగిన ఇజ్రాయెల్
- ఇరాన్ రక్షణ వ్యవస్థ, ఆయుధగారాలే లక్ష్యంగా దాడులు
- నష్టం జరగలేదన్న ఇరాన్

## బంగ్లాదేశ్‌లో హిందువుల
# భారీ ర్యాలీ

జనసంద్రమైన రహదారులు




రాజకీయ అనిశ్చితి కొనసాగుతోన్న బంగ్లాదేశ్‌లో హిందువుల భారీ స్థాయిలో ర్యాలీ నిర్వహించారు. మైనార్టీల హక్కుల పరిరక్షణ కోసం వేలాదిమంది వీధుల్లోకి వచ్చారు. చటోగ్రామ్‌లో సనాతన జాగరణ్ మంచ్ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ జరిగింది. అలాగే మహ్మద్ యూనస్ సారథ్యంలోని తాత్కాలిక ప్రభుత్వం పలు డిమాండ్లు ఉంచారు. ఈ మేరకు మీడియా కథనాలు పేర్కొన్నాయి.

## అంతా ఇంతే!




శిష్యుడిని మించిన గురువు అంటున్నారు సార్

## భారత అక్రమ వలసదారులు
# వెనక్కి



6లో

- అమెరికాలో చట్టబద్ధమైన అనుమతి లేకుండా ఉంటున్న భారతీయులు
- నియంత్రణపై దృష్టి సారించిన యూఎస్ డిపార్ట్‌మెంట్ హోంల్యాండ్ సెక్యూరిటీ
- 22న ప్రత్యేక విమానంలో భారత్ కు పంపామని వెల్లడి
- నైరుతి సరిహద్దుల్లో అనధికారిక వలసలు 55 శాతం తగ్గినట్లు డీహెచ్‌ఎస్ గుర్తింపు

# శాన్‌ఫ్రాన్సిస్కోలో మంత్రి లోకేశ్

- ఎయిర్ పోర్టులో స్వాగతం పలికిన ఐటీ సర్వ్, ఎన్ఆర్ఐ టీడీపీ ప్రతినిధులు
- విమానాశ్రయానికి భారీగా తరలివచ్చిన టీడీపీ ఎన్నారై నేతలు, కార్యకర్తలు
- 25 నుంచి నవంబర్ 1 వరకు అమెరికాలో మంత్రి లోకేశ్ పర్యటన



2లో

పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో నగరానికి చేరుకున్న ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్‌కు అక్కడి తెలుగు ప్రముఖులు, తెలుగుదేశం పార్టీ అభిమానులు ఘన స్వాగతం పలికారు. ప్రపంచ ఐటీ రంగంలో తెలుగువారు ఓ వెలుగు వెలుగుతున్నారంటే అందుకు తెదేపా జాతీయాధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబు ముందుచూపు వల్లనే. భారత దేశ ఐటీ రంగంలో హైదరాబాద్ హైటెక్ సిటీ పేరు చెప్పగానే చంద్రబాబు గుర్తుకు రాక మానరు. 2000 సంవత్సరంలోనే విజన్ 2020 అంటూ ఐటీ రంగం సాధించబోయే అభివృద్ధిని అంచనా వేసిన విజనరీ లీడర్ చంద్రబాబు.

## అగ్రరాజ్య ఎన్నికలలో
# మస్క్ మార్క్

- ఓటర్లకు ప్రైజ్ మనీ ఇస్తున్న బిలియనీర్
- న్యాయశాఖ వార్నింగ్ ఇచ్చినా తగ్గేదేలేదనా వెల్లడి మస్క్
- ట్రంప్‌కు మద్దతిచ్చే ఇద్దరు రిజిస్టర్డ్ ఓటర్లకు బంపర్ ఆఫర్
- ఒక మిలియన్ డాలర్లు(రూ.8 కోట్లు) ఇస్తున్న ప్రపంచ కుబేరుడు
- అంతర్జాతీయ మీడియా వర్గాలలో వార్తలు హల్‌చల్

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఎలాగైనా సరే డొనాల్డ్ ట్రంప్ ను గెలిపించేందుకు టెస్లా అధినేత ఎలాన్ మస్క్ విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఓటర్లను ట్రంప్‌నకు అనుకూలంగా మార్చేందుకు మస్క్ తాయిలాలు ఇస్తున్నారు.



6లో

సూర్య
విజయవాడ
ఆదివారం
27 అక్టోబర్ 2024





## జగన్ అతి మంచితనం, అతి నిజాయతీతోనే ఈ సమస్యలు వస్తున్నాయట

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఇవాళ టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు ప్రసంగిస్తూ, మాజీ సీఎం జగన్ పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని జగన్ 43,000 కోట్లు దోచుకున్నారని అన్నారు. వైసీపీ పార్టీని అవినీతి మూలాలపై స్థాపించారని విమర్శించారు. అలాంటి పార్టీలు కచ్చితంగా కూలిపోతాయని స్పష్టం చేశారు. దోపిడీ ఆస్తుల పంపకంలో దుష్ట సంప్రదాయానికి దిగజారిన వ్యక్తి జగన్ మోహన్ రెడ్డి. జగన్ అతి మంచితనం, అతి నిజాయతీ వలనే ఇలాంటి సమస్యలు వస్తున్నాయని సాక్షి పత్రికలో రాశారు. వాస్తవానికి జగన్ కి ధన పిచ్చి ఎక్కువ. నీచ రాజకీయాలు చేయడం జగన్ కు వెన్నతో పెట్టిన విద్య. 2004 నాటికి జగన్ ఆస్తులు కోటి 73 లక్షలు. ఇప్పుడు ఆయన ఆస్తులు సుమారు 8 లక్షల కోట్లు. ఈ ఆస్తులు ఎక్కడ నుంచి వచ్చాయి ? ఇది ప్రజల సొమ్ము కాదా? ఎవరికీ లేని మినహాయింపులు జగన్ కు ఎలా వస్తున్నాయి? ఇన్ని సంవత్సరాలు ఎలా బెయిల్ పై బయట ఉన్నారు? ప్రజల జీవితాలు మార్చడానికి, రాష్ట్రం అభివృద్ధి చేయడానికి ఉన్నతమైన వ్యక్తులు రాజకీయ పార్టీలను నడపాలి. కేవలం డబ్బులు దోచుకోవడానికి... ప్రజలను మభ్యపెట్టి మళ్లీ అధికారంలోకి రావడానికి రాజకీయ పార్టీలను నడపకూడదు. పేదవాడి కళ్లలో సంతోషం చూసేవాడే రాజకీయ నాయకుడు. కోడి కత్తి, వివేకా హత్య, సోషల్ మీడియాను అడ్డుపెట్టుకొని అబద్ధాలను ప్రచారం చేసి జగన్ రెడ్డి గతంలో అధికారంలోకి వచ్చాడు.

# విషవలయంలో ఏపీ

- రూ.10 లక్షల కోట్లకుపైగా అప్పుల భారం
- ఇసుక, మద్యం అక్రమాలను సహించం
- మీడియా సమావేశంలో చంద్రబాబు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి చేసిన విధ్వంసం నుంచి ఏపీని గాడిలో పెడుతున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. రూ.10 లక్షల కోట్లకు పైగా ఏపీపై అప్పు భారం ఉందని.. దానిని కూటమి ప్రభుత్వం మోస్తుందనే విషయాన్ని ప్రజలు గ్రహించాలని అన్నారు. ఏపీ ఓ విషవలయంలో ఉందనే గుర్తించాలని కోరారు. కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకు వచ్చేలా వైసీపీ నేతలు కుట్ర పన్నుతున్నారని సీఎం ఆరోపించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానంలోకి వైసీపీ నేతలు చొరబడ్డారని విమర్శించారు. ఎక్కడ ఇసుక దందా జరుగుతున్నా తిరుగుబాటు చేయండి, తాను అండగా ఉంటానని స్పష్టం చేశారు. మద్యం ఎమ్మార్పీ ధరపై ఒక్క రూపాయి కూడా ఎక్కువ చెల్లించవద్దని మందుబాబులను కోరారు. శనివారం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో సీఎం చంద్రబాబు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ పార్టీపై, మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిపై చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జీఎస్టీతో కలిపి రూ.97 లు అయ్యే సినరేజ్ ఛార్జికి రూ.35లకే టెండర్ వేస్తామంటూ వైసీపీ నేతలు వచ్చారని అన్నారు. ఇసుక కొరత సృష్టించి బ్లాక్‌మార్కెటింగ్ చేసి తమ ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావాలనే అతి తక్కువ ధరకు టెండర్లు వేశారని చెప్పారు. ప్రభుత్వానికి నష్టం వచ్చినా, ఉచిత ఇసుక స్ఫూర్తి దెబ్బతినకూడదనే సినరేజ్ ఛార్జీలు, జీఎస్టీ కూడా ఎత్తి వేశామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

**చాలా వ్యవస్థలను గాడిలో పెట్టాం**

నేను 1995 సీఎంనే.. కానీ 2014 సీఎంను కాదు. ఈసారి ఖచ్చితంగా రాజకీయ పరిపాలనే చేస్తా. విశ్వసనీయతను నిలబెట్టుకుంటూ రాజకీయ ముసుగులో తప్పు చేసిన వారిని ఉపేక్షించేది లేదు. ముఖ్యమంత్రి అయ్యాక పార్టీ వ్యవహారాలు పట్టించుకోవట్లేదని కేడర్ నుంచి వస్తున్న విమర్శలు అర్థం చేసుకోగలను. జగన్ చేసిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గాడిలో పెడుతూ రూ.10లక్షల కోట్లకు పైగా అప్పు భారం మోస్తున్నామనే విషయం గ్రహించాలి. మనం ఓ విషవలయంలో ఉన్నామని గుర్తించాలి. దీనిని పరిష్కరించేందుకు కొంత సమయం అవసరం. ఇప్పటికే చాలా వ్యవస్థలను గాడిలో పెట్టాం.

**వైసీపీ వలన నష్టపోయిన కార్యకర్తలను ఆదుకుంటాం**

మొన్నటి ఎన్నికల్లో రాక్షసుడితో యుద్ధం చేశాం. వైసీపీ నేతల వల్ల నష్టపోయిన కార్యకర్తలను ఆదుకుంటూనే, ప్రజలు మనపై పెట్టుకున్న నమ్మకాన్ని నెరవేర్చాలి. ఏపీలో ఎక్కడ ఇసుక దందా జరుగుతున్నా తిరుగుబాటు చేయండి. నేను అండగా ఉంటా. జగన్ ప్రభుత్వం కక్షపూరితంగా పెట్టిన తప్పుడు కేసులకు చట్ట పద్ధతిలోనే పరిష్కరిస్తా. ఎవ్వరూ తొందరపడొద్దు. ఎక్కువ అంచనాలు పెట్టేసుకుని ఎవ్వరూ నిరుత్సాహపడొద్దు. రాజకీయాల్లో ఎన్ని మార్పులు, సంస్కరణలు వచ్చినా, మూల సిద్ధాంతం ప్రజాసేవని మరవద్దు అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## రూ.100తో టీడీపీ సభ్యత్వం తీసుకోండి



- టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభమైందన్న లోకేశ్
- రూ.5 లక్షల వరకు ప్రమాద బీమా ఉంటుందని వెల్లడి
- సభ్యత్వం తీసుకోవడం ద్వారా టీడీపీ కార్యకర్తనని ఘనంగా చాటాలని పిలుపు

టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ వివరాలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులారా... పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైంది అని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ రూ.100తో టీడీపీ సభ్యత్వం తీసుకోవాలని పిలుపునిచ్చారు. తద్వారా రూ.5 లక్షల వరకు ప్రమాద బీమా, కుటుంబ సభ్యులకు విద్య, ఉద్యోగ, వైద్య సదుపాయం అందుతుందని వివరించారు. దేశంలో మరే ఇతర రాజకీయ పార్టీ చేయని రీతిలో కార్యకర్తల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసిన చరిత్ర మన తెలుగుదేశం పార్టీది అని లోకేశ్ పేర్కొన్నారు. సభ్యత్వం తీసుకోండి... తెలుగుదేశం పార్టీ కార్యకర్తనని ఘనంగా చాటండి అంటూ సోషల్ మీడియా ద్వారా పిలుపునిచ్చారు.

# సరస్వతి పవర్ భూములపై డిప్యూటీ సీఎం ఆరా

- వివరాలు సేకరించాలని అధికారులకు ఆదేశాలు
- అటవీ భూములు ఏమైనా ఉన్నాయా?
- పర్యావరణ అనుమతులు ఎలా వచ్చాయి?
- పల్నాడు జిల్లా దాచేపల్లి, మాచవరం మండలాల్లో వైఎస్ జగన్‌కు చెందిన సరస్వతి పవర్ సంస్థకు 1515.93 ఎకరాల భూమి



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఏపీలో ప్రస్తుతం వైసీపీ అధినేత మాజీ సీఎం వైఎస్ జగన్, ఆయన సోదరి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు మధ్య ఆస్తుల వివాదం హాట్ టాపిక్‌గా ఉంది. వైఎస్ఆర్ కుటుంబ ఆస్తుల పంపిణీ అంశానికి సంబంధించి విమర్శలు, ప్రతి విమర్శలతో మాటల యుద్ధం జరుగుతుండటం చర్చనీయాంశంగా మారింది. ఈ తరుణంలో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. పల్నాడు జిల్లా దాచేపల్లి, మాచవరం మండలాల్లో సరస్వతి పవర్ సంస్థకు చెందిన 1515.93 ఎకరాల్లో ప్రకృతి సంపద, వాగులు, వంకలు, కొండ భూములు ఉన్నాయనే వార్తలు వెలుగులోకి రావడం జరిగింది. దీంతో అటవీ, పర్యావరణ శాఖ మంత్రిగానూ ఉన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దీనిపై స్పందించారు. సరస్వతి పవర్ సంస్థకు చెందిన భూముల్లో ఎంత విస్తీర్ణంలో అటవీ భూములు ఉన్నాయనే దానిపై వివరాలతో నివేదిక ఇవ్వాలని అటవీ శాఖ అధికారులను, పల్నాడు జిల్లా యంత్రాంగాన్ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఈ అంశంపై అధికారులతో పవన్ చర్చించారు. ఆ సంస్థకు చెందిన భూముల్లో ప్రభుత్వ భూములు, జల వనరులు, అటవీ భూములు ఏ మేరకు ఉన్నాయో సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని అధికారులకు పవన్ స్పష్టం చేశారు. ఆ సంస్థ భూముల్లో వాగులు, వంకలు, కొండలు ఉన్నందున పర్యావరణ అనుమతులు ఏ విధంగా పొందారో కూడా తెలియజేయాలని పీసీబీని పవన్ ఆదేశించారు. ఈ అంశంపై అటవీ, రెవెన్యూ, పీసీబీ ఉన్నతాధికారులతో త్వరలో డిప్యూటీ సీఎం సమీక్షించనున్నారు.

## తిరుపతిలో మరోసారి బాంబు

# బెదిరింపుల కలకలం



ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుపతిలోని మరో హోటల్‌కు బాంబు బెదిరింపులు కలకలం రేపాయి. తిరుపతిలోని రాజ్ పార్క్ హోటల్‌కు బాంబు బెదిరింపులు రావడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు హోటల్‌కు చేరుకుని విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మరో వైపు గురువారం లీలామహల్ సమీపంలోని మూడు హోటల్స్, రామానుజ కూడలిలోని మరో హోటల్‌కు మెయిల్ ద్వారా బెదిరింపులు రావడంతో పోలీసులు తనిఖీలు జరిపిన విషయం తెలిసిందే. డీఎస్పీ వెంకట నారాయణ పర్యవేక్షణలో సిబ్బంది ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేశారు. అయితే ఎక్కడా పేలుడు పదార్థాలు లేవని నిర్ధారణ కావడంతో ఊపిరిపీల్చుకున్నారు. బాంబు బెదిరింపు కాల్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# శాన్‌ఫ్రాన్సిస్కోలో మంత్రి లోకేశ్

- పెట్టుబడులు తెచ్చేందుకు అమెరికా వెళ్లిన మంత్రి



శాన్‌ఫ్రాన్సిస్కో: పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో నగరానికి చేరుకున్న ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్‌కు అక్కడి తెలుగు ప్రముఖులు, తెలుగుదేశం పార్టీ అభిమానులు ఘన స్వాగతం పలికారు. ప్రపంచ ఐటీ రంగంలో తెలుగువారు ఓ వెలుగు వెలుగుతున్నారంటే అందుకు తెదేపా జాతీయాధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబు ముందుచూపు వల్లనే. భారత దేశ ఐటీ రంగంలో హైదరాబాద్ హైటెక్ సిటీ పేరు చెప్పగానే చంద్రబాబు గుర్తుకు రాక మానరు. 2000 సంవత్సరంలోనే విజన్ 2020 అంటూ ఐటీ రంగం సాధించబోయే అభివృద్ధిని అంచనా వేసిన విజనరీ లీడర్ చంద్రబాబు. ఆ క్రమంలోనే తండ్రి అడుగుజాడల్లో నడుస్తున్న మంత్రి లోకేశ్ 2047 నాటికి వికసిత్ ఆంధ్ర ప్రదేశ్ సాధనకు అహర్నిశలు శ్రమిస్తున్నారు అని ఎన్నారై ప్రముఖులు కొనియాడుతున్నారు.

తన తండ్రి రాజకీయ వారసత్వంతో పాటు ఐటీ రంగంపై చంద్రబాబుకు ఉన్న ప్రత్యేక శ్రద్ధను కూడా లోకేశ్ పుణికి పుచ్చుకున్నారు. ఈ క్రమంలోనే ఏపీలో పెట్టుబడులే లక్ష్యంగా ఆయన నేటి నుంచి అమెరికాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా శాన్‌ఫ్రాన్సిస్కో విమానాశ్రయంలో లోకేశ్‌కు ఘన స్వాగతం పలికేందుకు తెదేపా ఎన్నారై నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

ఏపీలో ఎన్డీఏ కూటమి అఖండ విజయం సాధించిన తర్వాత తొలిసారిగా లోకేశ్ అమెరికాలో పర్యటిస్తున్నారు. తెదేపా ఘన విజయం సాధించడంతో పార్టీ ఎన్నారై నేతలు, కార్యకర్తలు ఫుల్ జోష్‌లో ఉన్నారు. మంగళగిరి ఎన్నికల్లో ఆల్ టైం రికార్డు బద్దలు కొట్టి తిరుగులేని విజయం సాధించి మంత్రి అయిన లోకేశ్‌కు ఘన స్వాగతం పలికారు. ఆయనకు స్వాగతం పలికిన వారిలో ఎన్నారై తెదేపా యూఎస్ఏ కో ఆర్డినేటర్ జయరాం కోమటి, ఎన్నారై తెదేపా మీడియా కో ఆర్డినేటర్ సాగర్ దొడ్డపనేని, స్థానిక తెదేపా నేతలు శశి దొప్పలపూడి, శ్రీకాంత్ దొడ్డపనేని, తెదేపా జోనల్ ఇన్‌ఛార్జి రవి మందలపు, ఐటి సర్వ్ ప్రతినిధులు వినోద్ ఉప్పు, సతీశ్ మండువ, సురేశ్ మానుకొండ తదితరులు ఉన్నారు.

అక్టోబర్ 25 నుంచి నవంబర్ 1వ తేదీ వరకు మంత్రి లోకేశ్ అమెరికాలో పర్యటిస్తారు. ఈనెల 29న లాస్‌వేగాస్ నగరంలో జరగనున్న ఐటీ సర్వీస్ సినర్జీ 9వ సదస్సుకు హాజరుకానున్నారు. ఏపీలో పెట్టుబడులు పెట్టేలా పలు ప్రముఖ ఐటీ కంపెనీల ప్రతినిధులతో భేటీ కానున్నారు. అట్లాంటాలో ఎన్టీఆర్ ట్రస్ట్ తరఫున ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ సందర్భంగా నిర్వహించే సభకు ఎన్నారై తెదేపా నేతలు, అభిమానులు, ఎన్నారైలు భారీ సంఖ్యలో హాజరుకానున్నారు.

## పట్టణ ప్రణాళిక విభాగం పోర్టల్ సేవలు

# వచ్చే నెల 4 వరకు నిలిపివేత

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : భవనాలు, లే అవుట్లకు ఆన్ లైన్ లో అనుమతి ఇచ్చే పోర్టల్ ల్లో మార్పులు, చేర్పులు చేయనున్నట్టు ష్ట ప్రణ్ణాళికా విభాగం డైరెక్ట్ర్ విద్యుల్ల ఒక తెలిపారు. సర్వర్, డేటా బ్దాయింపులో భాగంగా వ్ల రోజుల పాటు ఈ సేవ్లు నిలిపివేయనున్నామన్నారు. ప్రృుతం అమెజాన్ వెబ్ స్ర్వీసెస్ లోని డేటాను స్టేట్ డేటా సెంట్ర్ కు బ్దాయిస్తున్నామని, వ్చ్చే నెల 4వ తేదీ ప్రృు అందుబాటులో ఈ పోర్ట్ల సేవ్లు అందుబాటులో ఉండవన్నారు.

## మరోసారి హైకోర్టును ఆశ్రయించిన వైసీపీ నేత పిన్నెల్లి



వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. గతంలో తనపై విధించిన బెయిల్ షరతులను సడలించాలని, విదేశాలకు వెళ్లేందుకు పాస్ పోర్టు వెనక్కి ఇప్పించాలని హైకోర్టును పిన్నెల్లి కోరారు. పిన్నెల్లి దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టు విచారణ జరిపింది. పిన్నెల్లి తరఫున న్యాయవాది రామలక్ష్మణరెడ్డి వాదనలు వినిపించారు. పిటిషనర్ కుమారుడు సింగపూర్‌లో ఉన్నత విద్యకు వెళుతున్నారని, తండ్రిగా పిటిషనర్ కూడా వెళ్లాల్సి ఉందని ధర్మాసనం దృష్టికి తీసుకువెళ్లి పాస్‌పోర్టు విడుదలకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ క్రమంలో పోలీసుల తరఫు న్యాయవాది ఎన్ అశ్వనీకుమార్.. కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం కావాలని ధర్మాసనాన్ని కోరారు. అందుకు అంగీకరించిన హైకోర్టు .. విచారణను ఈ నెల 28వ తేదీకి వాయిదా వేసింది. ఇంతకు ముందు పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ధ్వంసంతో పాటు టీడీపీ కార్యకర్తపై హత్యాయత్నం కేసులు నమోదు అయ్యాయి. ఆ కేసుల్లో పిన్నెల్లిని పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు. తర్వాత పిన్నెల్లి హైకోర్టును ఆశ్రయించగా, ఆయనకు షరతులతో బెయిల్ మంజూరయింది. ఈ క్రమంలో బెయిల్ షరతుల సడలింపునకు పిటిషన్ దాఖలు చేశారు.

# జగన్ రెడ్డి చేసిన పాపాలే ప్రజల మెడకు ఉరితాళ్లు

- ఇంధన సర్దుబాటు చార్జీల పాపం జగన్ రెడ్డిదే
- జగన్ హయాంలోనే వసూళ్లకు అనుమతి కోరిన డిస్కంలు
- వాయిదా వేస్తూ... కమిషన్ ముగిసే మూడు రోజుల ముందుగా వసూళ్లకు ఆదేశాలు
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్



అమరావతి: విద్యుత్ రంగంలో జగన్ రెడ్డి చేసిన పాపాలే నేడు రాష్ట్ర ప్రజల పాలిట ఉరితాళ్లు అయ్యాయని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మండిపడ్డారు. గత ఐదేళ్లలో జగన్ రెడ్డి తీసుకున్న అనాలోచిత నిర్ణయాల కారణంగా ప్రస్తుతం ప్రజల మీద విద్యుత్ చార్జీల భారం పడుతోందని అన్నారు. ప్రజల సొమ్మును అప్పనంగా తన అస్మదీయులకు దోచిపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు గానూ గతంలో చేసిన పీపీఏ లను జగన్ రెడ్డి అధికారంలోకి రాగానే రద్దు చేసినట్లు పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పత్తికి మారుపేరు అయిన ఏపీ జెన్కోని నిర్వీర్యం చేసి.. ప్రజావసరాల కోసం అనే పేరుతో యథేచ్ఛగా ప్రైవేటు వ్యక్తుల నుంచి అధిక రేట్లకు విద్యుత్ కొనుగోళ్లు చేసినట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. గడిచిన ఐదేళ్లలో చేసిన విద్యుత్ కొనుగోళ్లలో జగన్ సర్కార్ ఎక్కడా పారదర్శకత ప్రదర్శించలేదని మంత్రి గొట్టిపాటి అన్నారు. విద్యుత్ కొనుగోళ్లను క్విడ్ ప్రో కో విధానం ద్వారా జరిపి, వచ్చిన ప్రజల సొమ్ము అంతా తాడేపల్లి ప్యాలెస్ తరలించారని ఆరోపించారు. కేవలం విద్యుత్ కొనుగోళ్లు మాత్రమే కాకుండా బొగ్గు కొనుగోళ్ల వ్యవహారం అంతా కూడా రహస్యంగానే జగన్ రెడ్డి, పెద్దిరెడ్డిలు నడిపించారని స్పష్టం చేశారు. వీరు అనుసరించిన విద్యుత్ విధానాల పాపమే నేడు ప్రజల మెడలకు సర్దుబాటు చార్జీల ద్వారా చుట్టుకుందని గొట్టిపాటి విమర్శించారు. జగన్ మోహన్ రెడ్డి బరితెగింపు దోపిడి కారణంగా గడిచిన ఐదేళ్లలో 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచినట్లు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆరోపించారు. అంతేగాకుండా జగన్ రెడ్డి చేసిన పాపాల కారణంగా ప్రస్తుతం ఏపీ ప్రజల మీద 2023-24 సంవత్సరానికి గాను మరో రూ.11,826.42 కోట్ల భారం పడుతున్నట్లు పేర్కొన్నారు. రెండేళ్ల క్రితమే ఈ మొత్తాన్ని డిస్కంలు ప్రజల నుంచి వసూళ్లు చేస్తామని ఈఆర్సీని కోరినా సంబంధీకులు వాయిదా వేస్తూ వచ్చారని చెప్పారు. చివరగా 2024 మార్చి నుంచి ఈ మొత్తాన్ని వసూలు చేయాల్సి వస్తే... ఎన్నికల నేపథ్యంలో ప్రజల నుంచి వ్యతిరేకత ఎదుర్కోవాల్సి ఉంటుందని వాయిదా పర్వం కొనసాగినట్లు స్పష్టం చేశారు. జగన్ మోహన్ రెడ్డి గద్దె దిగిపోతూ కూడా తాను చేసిన దోపిడీని ప్రజల నుంచి వసూలు చేయాలని ఈఆర్సీని కోరడం ప్రజలు గమనించాలని కోరారు. గత ప్రభుత్వంలోనే ప్రజల నుంచి వసూలు చేయాల్సిన మొత్తాన్ని కమిషన్ వాయిదా వేస్తూ అక్టోబర్ లో నిర్ణయం తీసుకుందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ఈ కారణంగా జగన్ రెడ్డి చేసిన అక్రమ వసూళ్లు చంద్రబాబు నాయుడు హయాంలో కట్టాల్సి వస్తోందని గుర్తు చేశారు. జగన్ రెడ్డి హయాంలో తీసుకున్న అనాలోచితన నిర్ణయాలతోనే ప్రజలపై విద్యుత్ సర్దుబాటు చార్జీల భారం పడిందని స్పష్టం చేశారు. ఇదెలా ఉంటే కూటమి ప్రభుత్వ సంక్షేమ పాలనను చూసి ఓర్వలేక సాక్షి తప్పుడు కథనాలను ప్రచురిస్తోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మండిపడ్డారు. పాపాలన్ని జగన్ అండ్ కో చేసి చంద్రబాబు, కూటమి ప్రభుత్వంపై విషం కక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## గుంటూరుకు 100 విద్యుత్ బస్‌లు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : దేశమంతా ప్రస్తుతం ఎలక్ట్రిక్ మయం అవుతోంది. ఏ వస్తువు తీసుకున్నా, ఏది పట్టుకున్నా, ఒకవేళ ఎక్కడికైనా ప్రయాణం చేయాలన్నా.. అంతా ఎలక్ట్రిక్ మయం అయిపోయింది. కాలుష్యాన్ని తగ్గించడంతోపాటు రవాణా వ్యయాన్ని కూడా తగ్గిస్తున్న ఎలక్ట్రిక్ వాహనాలకు రోజురోజుకు డిమాండ్ పెరుగుతోంది. దేశమంతటా ఎలక్ట్రిక్ వాహనాలను ప్రవేశపెట్టాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 'పీఎం ఈ-బస్ సేవ' పథకాన్ని ప్రారంభించింది. దీనికింద ఆయా రాష్ట్రాలకు విద్యుత్తు బస్సులను అందజేస్తారు. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని తొలివిడతగా రాష్ట్రానికి 100 బస్సులను తెప్పిస్తున్నారు. రాజధాని అమరావతికి సమీపంలో గుంటూరు, విజయవాడ నగరాలున్నాయి. ప్రస్తుతం గుంటూరు నగరానికి విద్యుత్తు బస్సుల అవసరాన్ని గుర్తించిన చంద్రబాబు వచ్చే 100 బస్సులను గుంటూరు ఆర్టీసీకి కేటాయించనున్నారు. ఇందులో 20 బస్సులు అల్ట్రా డీలక్స్ సర్వీసులుగా నడుస్తాయి. మిగతా బస్సులన్ని పల్లెవెలుగు బస్సులకింద తిప్పుతారు. గుంటూరు నుంచి విజయవాడకు 20, గుంటూరు నుంచి పొన్నూరుకు 15, గుంటూరు నుంచి తెనాలికి 30, గుంటూరు నుంచి హైకోర్టుకు 5, గుంటూరు నుంచి సచివాలయానికి 5, గుంటూరు నుంచి చిలకలూరిపేటకు 10, గుంటూరు నుంచి సత్తెనపల్లికి 15 బస్సులు నడుపుతారు. ఏపీలో చరిత్ర సృష్టించిన గుంటూరు నగరం ఒకసారి ఛార్జింగ్ చేస్తే 150 కిలోమీటర్లు వీటిని ఒకసారి ఛార్జింగ్ చేస్తే 150 కిలోమీటర్లు నడుస్తాయి. ప్రస్తుతానికి 100 కిలోమీటర్ల లోపు దూరం ఉన్న ప్రాంతాలకే వీటిని ఉపయోగిస్తారు. వీటికి ఛార్జింగ్ స్టేషన్ ను పెదకాకాని బస్టాండ్ వెనక ఆర్టీసీకి ఉన్న 3.5 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్నారు. భవిష్యత్తులో ఫాస్ట్ ఛార్జింగ్ కేంద్రాలు అందుబాటులోకి వస్తే పల్నాడు బస్టాండ్ లో కూడా ఏర్పాటు చేస్తారు. గుంటూరులో ప్రధానంగా కాలుష్యం ఎక్కువవుతుండటంతో దీన్ని తగ్గించేందుకు ముఖ్యమంత్రి ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ఆర్టీసీలో ఎక్కువ కిలోమీటర్లు ప్రయాణించిన ఎక్స్ ప్రెస్ బస్సులను పల్లెవెలుగు బస్సుల్లా మార్చి తిప్పుతున్నారు. అయితే వీటి నిర్వహణ వ్యయం బాగా పెరుగుతుండటంతో విద్యుత్తు బస్సులవైపు ప్రభుత్వం మొగ్గుచూపింది.

# చంద్రబాబు డైరెక్షన్‌లో షర్మిల


- కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారు
- ఎన్నికలకు ముందు ఆమెకు ఇవి కనపడలేదా?



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : చంద్రబాబు స్క్రిప్ట్‌నే షర్మిల చదువుతున్నారని.. ఇవన్నీ ఎన్నికల ముందు గుర్తుకు రాలేదా అంటూ వైసీపీ నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి ప్రశ్నించారు. శనివారం మాట్లాడుతూ...ఆమె కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. జగన్‌ను రాజకీయంగా దెబ్బతీసేందుకే ఇలాంటి కుట్రలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు ఆడుతున్న ఆటలో షర్మిల బంతిగా మారారన్నారు. పార్టీ బలోపేతం కన్నా జగన్‌ను రాజకీయంగా దెబ్బ తీయడమే లక్ష్యంగా షర్మిల భావిస్తున్నారని విమర్శించారు. జగన్ విద్యుత్ శాఖతో మీటింగ్ జరిగితే ఛార్జీల పెంపు కోసమే అంటూ లీకులు ఇచ్చేవారన్నారు. కరెంటు ఛార్జీలు పెంచడం కోసమే మీటింగ్ అని చెబుతారంటూ మండిపడ్డారు. జగన్ తప్పిదం వల్లే ఛార్జీలు పెంచాల్సి వచ్చిందని కూడా అంటారన్నారు. విషపూరిత ధోరణిని రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తోందన్నారు. రాష్ట్రంలో ఏం జరిగినా దానికి జగనే కారణమని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో వ్యవసాయం దండగా అన్న చంద్రబాబు.. రైతుల పట్ల సవితి తల్లి ప్రేమ చూపిస్తున్నారంటూ పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి విరుచుకుపడ్డారు.

**మళ్లీ ఆస్తులు కోరడం సరికాదు : సతీష్**

వైఎస్ రాజశేఖరరెడ్డి బ్రతికుండగానే జగన్, షర్మిలకు సమానంగా ఆస్తి పంపకాలు చేశారని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి అన్నారు. జగన్‌కు బెంగుళూరులో ఇళ్ళు ఉందని షర్మిలకు హైదరాబాద్ లోటస్ పాండ్ ఇళ్ళు ఇచ్చారని తెలిపారు. వివాహం అయిన తర్వాత షర్మిల వాటాలు తీసుకొని మళ్ళీ ఆస్తులు కోరడం సమంజసం కాదన్నారు. జగన్ సొంతంగా వ్యాపారాలు చేసుకుంటూ అభివృద్ధి చెందారని తెలిపారు. వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు తండ్రికి దూరంగా ఉంటూ బెంగుళూరులో వ్యాపారం చేసుకున్నారన్నారు. రఘురాం సిమెంట్‌ను కొనుగోలు చేసి భారతి సిమెంట్స్‌ను ఏర్పాటు చేసుకున్నారన్నారు. షర్మిల ఆస్తుల్లో జగన్ వాటా అడగలేదని.. చెల్లి కోసం జగన్ సొంత ఆస్తుల్లో కూడా వాటా ఇచ్చారన్నారు. ఈడీ అటాచ్ చేసిన ఆస్తులు షర్మిల ట్రాన్స్ఫర్ చేసుకున్నా రని సతీష్ రెడ్డి వెల్లడించారు. కాగా.. ఇటీవల వైఎస్ అభిమానులకు షర్మిల బహిరంగ లేఖ రాసిన విషయం తెలిసిందే. కొద్దిరోజులుగా వైఎస్ కుటుంబ ఆస్తుల గొడవల నేపథ్యంలో షర్మిలను నిందిస్తూ సాక్షిలో గత వారం ఓ కథనం ప్రచురితమైంది. ఈ కథనాన్ని ఖండించడంతో పాటు వాస్తవాలు తెలియాలంటూ వైఎస్ అభిమానులకు షర్మిల లేఖ రాశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి స్థాపించిన అన్ని వ్యాపారాలూ కుటుంబ వ్యాపారాలేనని, అందులో తన నలుగురు మనవలు, మనవరాళ్లకు సమానవాటా ఉండాలన్నది ఆయన ఆదేశమని తెలిపారు. అమ్మ కూడా కనీసం వెయ్యిసార్లు ఇదే విషయం చెప్పారని అన్నారు. వ్యాపారాలకు, ఆస్తులకు తన సోదరుడు జగన్ గార్డియన్ మాత్రమే అని తెలిపారు. ఆస్తులు ఎగ్గొట్టడానికి కన్న కొడుకే కేసులు పెట్టి కోర్టుకు లాగడంతో తన తల్లి విజయలక్ష్మి క్షోభకు గురవుతున్నారని షర్మిల లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు.



## పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలపై సీఎం టెలీకాన్ఫరెన్స్

● కూటమి నేతలంతా సమిష్టిగా పని చేయాలని దిశా నిర్దేశం
● ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: ఏపీలో త్వరలో రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగబోతున్నాయి. తాజాగా అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కూటమి పార్టీలకు ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి. దీంతో ఈ రెండు సీట్లను ఎలాగైనా గెలిచేందుకు శ్రమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఇవాళ కూటమి పార్టీలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఇందులో రెండు ఎమ్మెల్సీ సీట్లు ఎలా గెలవాలో మూడు పార్టీలకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అభ్యర్థులను నాలుగు జిల్లాల టీడీపీ నేతలతో మాట్లాడే నిర్ణయించినట్లు చంద్రబాబు తెలిపారు. ఇవాళ అదే నాలుగు జిల్లాల నేతలతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో కూటమి పార్టీల నేతలంతా సమష్టిగా పని చేస్తే రెండు ఎమ్మెల్సీ సీట్లు సునాయాసంగా గెల్చుకుంటామని చంద్రబాబు తెలిపారు.

సార్వత్రిక ఎన్నికల్లో సైతం కూటమి పార్టీలు సమష్టిగా పనిచేస్తే 93 శాతం సీట్లు గెల్చుకున్న విషయాన్ని వారికి గుర్తుచేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్ల నమోదుకు నవంబర్ 6 తుది గడువు కాబట్టి ఆలోపు సాధ్యమైనంత ఎక్కువ మందిని ఓటర్లుగా నమోదు చేయించాలని చంద్రబాబు ఆదేశించారు. అలాగే కూటమి పార్టీల నేతలతో నాలుగు జిల్లాల్లోనూ భేటీలు నిర్వహించాలని చంద్రబాబు సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తే ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు సునాయాసం అవుతుందన్నారు. ప్రతీ పట్టభద్రుడనీ ఓటరుగా చేర్పించాలని, వారి కోసం ప్రభుత్వం చేపడుతున్న ఉద్యోగాల కల్పనను వారికి అర్థమయ్యేలా వివరించాలన్నారు.

# ప్రారంభమైన టెంపుల్ టూరిజం

● శనివారం నుంచి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పుణ్య క్షేత్రాల సందర్శన ● రాజమహేంద్రవరంలో టూరిజం బస్సు ప్రారంభించిన మంత్రి
● కోరుకొండ, అన్నవరం, పిఠాపురం, సామర్లకోట, ద్రాక్షారామం, వాడపల్లి ఆలయాలను కలుపుతూ ప్రతి శనివారం అందుబాటులో బస్సులు..



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: రాష్ట్ర పర్యాటకాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించాలన్న ఉద్దేశంతో ఏపీటీడీసీ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఒకరోజు ఆధ్యాత్మిక పర్యటన ప్యాకేజీకి శ్రీకారం చుట్టామని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. శనివారం ఉదయం రాజమహేంద్రవరం లోని సరస్వతి ఘాటు వద్ద ఇన్ఫర్మేషన్ అండ్ రిజర్వేషన్ కౌంటర్ కార్యాలయం దగ్గర ఆధ్యాత్మిక పర్యటన ప్యాకేజీ బస్సును మంత్రి కందుల దుర్గేష్ జెండా ఊపి ప్రారంభించారు. ఒక రోజు పూర్తి ఆధ్యాత్మిక భావంతో దేవాలయాలను సందర్శించుకుని యాత్రికులు ఇంటికి తిరిగి వెళ్లేలా చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతం కావాలని మంత్రి కందుల దుర్గేష్ ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఇదే తరహా కార్యక్రమాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. 2025 మార్చి నాటికి ప్రస్తుత టూరిజం పాలసీ ముగుస్తుందని ఏప్రిల్ 2025 నుంచి కొత్త టూరిజం పాలసీ అమల్లోకి తీసుకొస్తామని మంత్రి దుర్గేష్ తెలిపారు. ఇప్పటికే కొత్త టూరిజం పాలసీకి సంబంధించిన కార్యాచరణ సిద్ధం చేశామని పేర్కొన్నారు.

**టూరిజం శాఖలో డైరెక్ట్ రిక్రూట్ మెంట్ :** టూరిజం శాఖలో డైరెక్ట్ రిక్రూట్ మెంట్ అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. ఉద్యోగాల నియామకంలో సత్వరం నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉండటంతో ఈ నిర్ణయం తీసుకుంటున్నామని చెప్పారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, టూరిజం బోర్డ్, అధికారులు, అన్ని శాఖల సమన్వయంతో రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధి చేస్తామన్నారు. ఇటీవల జరిగిన శాసనసభలో రాజానగరం, రాజమండ్రి, అనపర్తి ఎమ్మెల్యేల సూచనల మేరకు వారాంతంలో ఉమ్మడి తూర్పుగోదావరిలో ప్రఖ్యాత పుణ్యక్షేత్రాలు, పంచారామ క్షేత్రాలను కలిపేలా ఒక రోజు టూర్ ప్యాకేజీని ప్రవేశపెట్టామని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.

**ప్రతీ శనివారం బస్ :** రాజమండ్రి లోని సరస్వతి ఘాట్ వద్ద ఉన్న ఐ ఆర్ ఓ కార్యాలయం దగ్గర ప్రతి శనివారం బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కోరుకొండ స్వయం భూ శ్రీ లక్ష్మీ నర్సింహాస్వామి దేవస్థానం, రత్నగిరి కొండపై వెలసిన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవాలయ దర్శనం, ఆ తర్వాత పితృముక్తి క్షేత్రంగా, పాదగయ తీర్థంగా పేరొందిన పిఠాపురం శ్రీ కుక్కుటేశ్వర స్వామి ఆలయం దర్శించిన పిమ్మట విశాలమైన ప్రాకారాలతో, చాళక్యుల శిల్పకళా నైపుణ్యంతో అలరారుతూ పంచారామ క్షేత్రాల్లో ఒకటైన సామర్లకోటలోని శ్రీ చాళుక్య కుమారరామ శ్రీ భీమేశ్వరస్వామి ఆలయాన్ని యాత్రికులు దర్శించుకొంటారని తెలిపారు. సామర్లకోట దేవాలయంలో మధ్యాహ్నం అన్న ప్రసాదాలు స్వీకరించిన అనంతరం ద్రాక్షారామంలోని భీమేశ్వరస్వామి ఆలయాన్ని యాత్రికులు సందర్శిస్తారని తెలిపారు. ఆ తర్వాత అనపర్తి లోని లక్ష్మీ గణపతి దేవాలయాన్ని, కోనసీమ తిరుపతిగా పేరుగాంచిన వాడపల్లి వెంకటేశ్వరస్వామి దేవాలయాన్ని యాత్రికులు సందర్శించేలా, తదుపరి పుష్కర్ ఘాట్ లో గోదావరీ హారతి తో ఒక రోజు పుణ్య క్షేత్ర యాత్ర పూర్తి అవుతుందన్నారు. ప్రతి శనివారం ఉదయం 6 గంటలకు బస్సులు ప్రారంభమై రాత్రి 7.00 గంటలకు రాజమహేంద్రవరంలోని హేవలాక్ బ్రిడ్జి దగ్గర పుష్కర్ ఘాట్ కు చేరుకుంటుందన్నారు. అక్కడే పవిత్ర గోదావరి నదికి కన్నుల పండువగా హారతి ఇచ్చే ప్రాంతంలో మంత్ర ముగ్ధ దృశ్యాలను భక్తులు తిలకించేలా ఏర్పాట్లు ఉంటాయన్నారు. భక్తులు అధ్యాత్మిక ప్రపంచంలో మునిగి తేలేలా కార్యక్రమం పూర్తయిన అనంతరం 7.30 గంటలకు తిరిగి రాజమహేంద్రవరంలోని ఏపీటీడీసీకి చెందిన ఇన్ఫర్మేషన్ అండ్ రిజర్వేషన్ కౌంటర్ కార్యాలయం వద్దకు భక్తులను చేరవేస్తామన్నారు. ఇంతటితో యాత్ర సమాప్తమవుతుందన్నారు.

**కేంద్ర ప్రభుత్వ నిధులతో టెంపుల్ టూరిజం :** కేంద్ర ప్రభుత్వ పథకాలైన స్వదేశీ దర్శన్, ప్రసాద్ పథకాలతో రాష్ట్రంలో ఎకో, అడ్వెంచర్, వెల్ నెస్, టెంపుల్ టూరిజం లను అభివృద్ధి చేయాలని నిర్ణయించామని, వీటన్నింటినీ కలిపి టూరిజం సర్క్యూట్లు గా చేసి సత్ఫలితాలు సాధించాలని భావిస్తున్నామన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి గండికోట, అఖండ గోదావరి సూర్యలంక బీచ్ తదితర ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన డీపీఆర్ లను పంపించామని త్వరలోనే సానుకూల నిర్ణయం వస్తుందని భావిస్తున్నా మన్నారు. ఒక పర్యాటకుడు ఏదైనా పర్యాటక ప్రాంతానికి వస్తే రెండు మూడు రోజులు ఉండేలా మౌలిక వసతులు కల్పించాలని నిర్ణయించామన్నారు. ఈ క్రమంలోనే రిసార్ట్ లు ఏర్పాటు, టూరిజం సర్క్యూట్లను అభివృద్ధి చేయాలని నిర్ణయించామన్నారు.

రాష్ట్రంలో పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు అటవీశాఖ, దేవదాయ శాఖ, పర్యాటక శాఖలను సమన్వయం చేసుకునేలా ఇటీవల కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు అయిందని మంత్రి దుర్గేష్ గుర్తు చేశారు. తద్వారా అన్ని శాఖలు ఇంటిగ్రేటెడ్ గా పనిచేస్తే పర్యాటక అభివృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు దిశా నిర్దేశం చేశారన్నారు.. పర్యాటక అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కి సందర్భంగా మంత్రి దుర్గేష్ కృతజ్ఞతలు తెలిపారు.

సెప్టెంబర్ 27న విజయవాడలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన అంతర్జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారని మంత్రి తెలిపారు. పర్యాటక రంగానికి ఇది శుభ పరిణామమని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాబోయే రోజుల్లో ఒకే ఒక ఇజం ఉంటుంది అదే టూరిజం అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలను మంత్రి కందుల దుర్గేష్ గుర్తు చేశారు. ఋషికొండ బీచ్ బ్లూ ఫ్లాగ్ బీచ్ గా సర్టిఫికెట్ పొందిందని దానితోపాటు కాకినాడ బీచ్, సూర్యలంక బీచ్, రామాపురం బీచ్, నెల్లూరు జిల్లాలోని మైపాడు బీచ్ లు బ్లూ ఫ్లాగ్ బీచ్ లుగా రూపాంతరం చెందేందుకు కృషి చేస్తామని రాష్ట్ర పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర టూరిజం బోర్డ్ సభ్యులు గంటా స్వరూప దేవి, వాసిరెడ్డి రాంబాబు, టూరిజం ఆర్డీ వి స్వామి నాయుడు, యాత్రికులు పాల్గొన్నారు.

### నేటి నుంచి సర్వీసులు

## గన్నవరం నుంచి ఇండిగో, ఎయిర్ ఇండియా ఫ్లైట్లు

● ప్రారంభించనున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: విశాఖపట్నం నుంచి విజయవాడకు మరో రెండు విమాన సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి. ఆదివారం నుంచి ఇండిగో, ఎయిర్ ఇండియా సంస్థలు ఈ సర్వీసులను నడపనున్నాయి. వీటిని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రారంభిస్తారు. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఇండిగో విమానం రాత్రి 7.15 గంటలకు బయలుదేరి రాత్రి 8.20 గంటలకు విశాఖ చేరుతుంది. అక్కడ విమానం తిరిగి 8.45 గంటలకు బయలుదేరి రాత్రి 9.50 గంటలకు విజయవాడ వస్తుందని అధికారులు తెలిపారు. ఎయిర్ ఇండియా ఎక్స్ ప్రెస్ సర్వీస్ ఉదయం 9.35 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి 10.35 గంటలకు విజయవాడ చేరుతుంది. . తిరిగి రాత్రి 7.55 గంటలకు బయలుదేరి 9 గంటలకు విశాఖపట్నం వెళ్తుంది. ఈ సర్వీస్ ల రాకతో విజయవాడ– విశాఖ విమాన సర్వీస్ల సంఖ్య మూడుకు చేరనుంది.

## ప్రారంభమైన పాపికొండల విహారయాత్ర

● తొలి ప్రయాణానికి పోటెత్తిన టూరిస్ట్స్ ● ఎపి టూరిజం శాఖ అధ్వర్యంలో నిర్వహణ ● మొత్తం అందుబాటులో 15 బోట్లు
● ఆన్ లైన్ అడ్వాన్స్ టికెట్ బుకింగ్



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: హైదరాబాద్నాలుగు నెలల విరామం అనంతరం మళ్లీ పాపికొండల విహారయాత్ర ప్రారంభమైంది.. దేవీపట్నం మండలం గండి పోశమ్మ ఆలయం వద్ద ఉన్నర బోటింగ్ పాయింట్ నుంచి ఇవాళ ఒక టూరిస్ట్ బోట్ పర్యాటకులను తీసుకుని పాపికొండల పర్యటనకు బయల్దేరింది. గోదావరి వరదలు కారణంగా జులైలో నిలిపివేసిన పాపికొండలు విహారయాత్ర మళ్లీ ప్రారంభం కావడంతో తొలి రోజే టూరిస్ట్ లు పోటెత్తారు. దీంతో . ఏపీ టూరిజం శాఖకు చెందిన ఒక బోటుతో పాటు ప్రైవేట్ ఆపరేటర్లకు సంబంధించిన మరో 14 బోట్లు అందుబాటులోకి తీసుకొచ్చింది ఎపి పర్యాటక శాఖ.

**పాపికొండల పాయలలో విహారం..**

పాపికొండలు విహారయాత్ర టూరిస్టులను ఎంతగానో కట్టిపడేస్తుంది.. ఈ ప్రదేశాన్ని శ్రీరాముడు మరియు సీతాదేవి వనవాస సమయంలో సందర్శించారని నమ్ముతారు. కొండలు, లోయ మరియు జలపాతాల వీక్షణను ఆస్వాదించడమే కాకుండా, పర్యాటకులు క్యాంపింగ్ , ట్రెక్కింగ్ వంటి కార్యక్రమాలతో ఈ టూరు ఎంతో అనుభూతిని కలిగిస్తుంది..

**అందుబాటులోనే టికెట్ ధర...**

ఇక ప్రకృతి సోయగాలు కనువిందు చేసే పాపికొండలు వద్దకు తీసుకు వెళ్లేందుకు రాజమండ్రి నుంచి పెద్దలకు 1250 రూపాయలు పదేళ్లలోపు చిన్నారులకు వెయ్యి రూపాయలు టికెట్ గా ఖరారు చేశారు. రాజమండ్రిలోని పర్యాటకశాఖ కార్యాలయం నుంచి ఉదయం 7:30 కు వాహనంలో గండి పోశమ్మ ఆలయం వద్దకు తీసుకెళ్తారు. ఉదయం 9 గంటలకు గోదావరిలో పర్యాటకుల బోటు ప్రారంభమై సాయంత్రం ఐదున్నరకు తిరిగి చేరుకుంటుంది. సుమారు 75 కిలోమీటర్ల మేర గోదావరిలో ప్రయాణం సాగనుంది. అలాగే బోట్లలో లైఫ్ బోట్లతో పాటు సుశిక్షితులైన ఈత గాళ్లను నియమించారు.

### అట్టహాసంగా

## టీడీపీ సభ్యత్వ నమోదు

● ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
● 175 నియోజకవర్గాల్లో ఒకేసారి సభ్యత్వం



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో ఒకేసారి ఈ కార్యక్రమాన్ని టీడీపీ అధినేత ప్రారంభించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పునః ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో ఒకేసారి ఈ కార్యక్రమాన్ని టీడీపీ అధినేత ప్రారంభించారు.

**తొలిగా సభ్యత్వం తీసుకున్న ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్...**

సభ్యత్వ నమోదులో భాగంగా పార్టీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ రూ.100 కట్టి సీఎం చేతుల మీదుగా మొదటి సభ్యత్వాన్ని తీసుకున్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని, కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉండాలని శుక్రవారం నాడు సీఎం చంద్రబాబు టీడీపీ శ్రేణులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. వందల, వేల మంది కార్యకర్తల కృషి ఫలితంగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి టీడీపీ పార్టీ సేవలు అందించగలుగుతుందని అన్నారు. ఆపద సమయంలో వారిని ఏ విధంగా ఆదుకుంటామో చేసి చూపిస్తామని సీఎం చెప్పారు.

**పార్టీ కోసం పనిచేసిన వారికి న్యాయం...**

పార్టీ కోసం అనేక మంది కార్యకర్తలు, నేతలు వివిధ స్థాయిల్లో కష్టపడి పని చేశారని ఆయన చెప్పుకొచ్చారు. పార్టీ కోసం పోరాడి అనేక కేసులు పెట్టించుకున్నారని, జైలుకు వెళ్లారని, ఆస్తులు పోగొట్టుకున్నారని చంద్రబాబు తెలిపారు. అలాంటి వారికి కచ్చితంగా టీడీపీ పార్టీ అండగా నిలబడుతుందని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా లబ్ధిదారులైన పలువురు కార్యకర్తలతో ఆయన దృశ్య మాధ్యమం ద్వారా మాట్లాడారు.

గతంలో ఇన్సూరెన్స్ రాని 73 మందికి రూ.2లక్షల చొప్పున చంద్రబాబు అందించారు. శనివారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పునఃప్రారంభించారు. రూ.100లు కట్టి సభ్యత్వం తీసుకుంచే రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ ప్రమాద బీమా వర్తిస్తుంది. రూ.లక్ష కడితే పార్టీలో శాశ్వత సభ్యత్వం లభిస్తుంది. ప్రమాదవశాత్తూ చనిపోతే మట్టి ఖర్చుల కింద రూ.10 వేలు తక్షణసాయం అందజేస్తారు. అలాగే బాధిత కుటుంబ సభ్యులకు విద్య, వైద్యం, ఉపాధి కోసం ఆర్థికసాయం అందిస్తారు. మరోవైపు కర్నూలు జిల్లా టీడీపీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఏపీ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో రూ.లక్ష కట్టి మంత్రి భరత్ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. సభ్యత్వ నమోదులో జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచేలా కార్యకర్తలు, నేతలు కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. సభ్యత్వం తీసుకున్న వారికి అనేక ప్రయోజనాలు ఉంటాయని, ఆపద సమయంలో పార్టీ అండగా నిలబడుతుందని ఆయన హామీ ఇచ్చారు. బాపట్ల జిల్లా సంతమాగులూరులో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించారు.

## సరస్వతి భూములపై సర్వే

● ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో హుటాహుటిన రంగంలోకి దిగిన అధికారులు
● డీఆర్వో ఆధ్వర్యంలో అటవి శాఖ అధికారులు, సిబ్బంది



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాలతో సరస్వతి పవర్ సంస్థలో అటవీ శాఖ అధికారులు శనివారం సర్వే చేయడం మొదలుపెట్టారు. జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు శనివారం దాచేపల్లి, మాచవరం మండలంలోని సరస్వతి పవర్ సంస్థకు చెందిన భూములలో దాచేపల్లి డీఆర్వో ఆధ్వర్యంలో అటవి శాఖ అధికారులు, సిబ్బంది సర్వే చేస్తున్నారు.

**పవన్ ఆదేశాల మేరకు:** సరస్వతి పవర్ సంస్థ భూముల వ్యవహారంలో సర్వే చెయ్యాలని ఇటీవల ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యావరణ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సరస్వతి పవర్ సంస్థకు ఉన్న సుమారు 1,515 ఎకరాల భూముల్లో వాగులు, వంకలు, కొండ భూములు, ప్రకృతి సంపద భూములు ఏమైనా ఉన్నాయేమో సర్వే చేసి నివేదిక ఇవ్వాలని పవన్ కల్యాణ్ అటవీశాఖ, పర్యావరణ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సరస్వతి పవర్ సంస్థ భూముల్లో ప్రకృతి సంపద, ప్రభుత్వ భూములు ఉన్నాయా అంటూ అటవీశాఖ అధికారుల క్షుణ్ణంగా సర్వే మొదలుపెట్టారు. సరస్వతి పవర్ సంస్థ భూముల్లో ప్రకృతి సంపద, వాగులు, వంకలు, కొండలు ఉంటే ఆ సంస్థకి పర్యావరణ శాఖ ఎలా అనుమతులు ఇచ్చింది, ఆ శాఖ అధికారుల మీద ఎవరైనా ఒత్తిడి తెచ్చారా ? అంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వివరాలు సేకరిస్తుంది.

**హాట్ టాఫిక్గా మారిన సర్వే :** మొత్తం మీద సరస్వతి పవర్ సంస్థ భూముల్లో అటవీశాఖ అధికారులు సర్వే చేయడం హాట్ టాపిక్ అయింది. సరస్వతి పవర్ సంస్థ భూముల్లో ప్రకృతి సంపద, ప్రభుత్వ భూములు ఉన్నాయని తెలిస్తే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎలా స్పందిస్తారు ? అనే విషయంలో చర్చ మొదలైయ్యింది. అటవి శాఖ అధికారులు నివేదిక ఎప్పుడు ఇస్తారా ? అంటూ తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

### సుబ్బారెడ్డి చెప్పేదంతా నిజమని

## ప్రమాణం చేయగలరా?

● జగన్ సీఎం అయిన తరువాత సుబ్బారెడ్డి బాగా లబ్ధిపొందారు ● రేపు విజయసాయి రెడ్డి కూడా మాట్లాడుతారు ● భారతి కూడా జైలుకు వెళ్లాలి ఫైర్ అయిన షర్మిల



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: ఆస్తుల వివాదంపై వైవీ సుబ్బారెడ్డి చేసిన వ్యాఖ్యలపై వైఎస్ షర్మిల తీవ్రంగా స్పందించారు. వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డిలపై ఓ రేంజ్‌లో ఫైర్ అయ్యారు. ఆస్తుల వివాదంపై తన తల్లి విజయమ్మ స్పందిస్తారని షర్మిల ప్రకటించారు. ఇప్పుడిప్పుడే ప్రజలు.. ఆస్తుల వివాదంపై వైవీ సుబ్బారెడ్డి చేసిన వ్యాఖ్యలపై వైఎస్ షర్మిల తీవ్రంగా స్పందించారు. వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డిలపై ఓ రేంజ్‌లో ఫైర్ అయ్యారు. ఆస్తుల వివాదంపై తన తల్లి విజయమ్మ స్పందిస్తారని షర్మిల ప్రకటించారు. ఇప్పుడిప్పుడే ప్రజలు కల్తీ లడ్డు గురించి మరిచిపోతున్నారని.. వైవీ సుబ్బారెడ్డి ఇప్పుడు తన మీద ఎందుకు మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. అసలు తన మీద ఆయన ఏం మాట్లాడారో తెలుసుకుని తప్పకుండా స్పందిస్తానని అన్నారు.

**జగన్‌మోచేతి నీళ్లు తాగే వ్యక్తి...**

సుబ్బారెడ్డి.. జగన్ మోచేతి నీళ్లు తాగే వ్యక్తి అంటూ ఘాటైన వ్యాఖ్యలతో విరుచుకుపడ్డారు. జగన్ పక్కనే ఉండి.. పదువులు ఇస్తే అనుభవించారని దుమ్మెత్తిపోశారు. అలాంటి సుబ్బారెడ్డి.. ఇలా కాకుంటే ఇంకెలా మాట్లాడుతారని అన్నారు. సుబ్బారెడ్డి, ఆయన కుమారుడు ఆర్థికంగా కూడా గట్టిగానే లాభపడ్డారని షర్మిల వ్యాఖ్యానించారు. జగన్ సీఎం అయ్యాక వారికి మాత్రమే మేలు జరిగిందనేది వాస్తవం అన్నారు. ఒక్క సుబ్బారెడ్డే కాదు.. రేపటి రోజున విజయసాయి రెడ్డి కూడా మాట్లాడతారని షర్మిల చెప్పుకొచ్చారు. వైవిసుబ్బారెడ్డి అయినా, సాయిరెడ్డి అయినా.. జగన్ పక్షాన ఉన్నారని తెలిసి కూడా తాను రాసిన లేఖలో వారి పేర్లు ప్రస్తావించానని షర్మిల చెప్పారు. వాళ్లల్లో నిజాయతీ ఏమైనా ఉంటుందేమో ప్రజలకు అర్థం కావాలనే వారి పేర్లు పెట్టానన్నారు. తమ అమ్మకు కూడా పూర్తిగా వాస్తవాలు తెలుస్తాయనే పెట్టానన్నారు. రాజశేఖరరెడ్డి ఆలోచనలు, ఆశయాలు వారికి అన్నీ తెలుసునని షర్మిల చెప్పారు. అయినా కూడా ఇంత దిగజారి మాట్లాడుతున్నారంటే.. వారి నిజరూపం ప్రజలకు అర్థం కావాలని, ముఖ్యంగా అమ్మ తెలుసుకోవాలని అన్నారు. తన వరకు తాను చెబుతున్నందతా నిజమని ప్రమాణం చేయగలనన్నారు షర్మిల. సుబ్బారెడ్డి చెప్పేదంతా నిజమని ప్రమాణం చేయగలరా? అని ప్రశ్నించారు. రాజశేఖర్ రెడ్డి బిడ్డగా తాను చెప్పేవన్నీ వాస్తవాలు అని ఉద్ఘాటించారు షర్మిల.

నలుగురు బిడ్డలకు సమాన వాటా ఉండాలని వైఎస్ఆర్ ఆలోచన చేశారన్నారు. ఇది నిజమని తన బిడ్డలపై తాను ప్రమాణం చేస్తున్నానని అన్నారు. వైఎస్ఆర్ ఆఖరి రోజుల్లో కూడా ఆస్తులు పాప పేరు మీద బదిలీ అవలేదని కూడా అడిగారని.. ఆ రోజు జగన్ మూడు అడుగుల కన్నా తక్కువ దూరంలో కూర్చుని నాన్నకు మాట ఇచ్చారు. 'నాన్నా... ఈ లోకంలో మీ తర్వాత పాప మేలు కోరే వారిలో నేనే మొదటి వాడిని, డోంట్ వర్రీ డాడ్' అని చెప్పారు. ఇదంతా నిజమని నా బిడ్డలపై నేను ప్రమాణం చేసి చెబుతున్నాను. సుబ్బారెడ్డి కూడా తన బిడ్డలు, తన మనవళ్లపై ప్రమాణం చేసి నిన్న చెప్పినదంతా నిజమని చెప్పగలరా? అని షర్మిల ప్రశ్నించారు. 'భారతి, జగతికి అయితే ఏమీ.. వాళ్ల పేర్లు పెట్టుకున్నామని అంటున్నారు. ఆ రోజు వాళ్లకు కుదిరింది కాబట్టి.. ఆస్తులన్నీ జగన్, భారతీలవేనట. ఆ రోజు మేము అభ్యంతరం చెప్పలేదు కాబట్టే.. వాళ్లు ఆ పేర్లు పెట్టుకున్నారు. వైఎస్ఆర్ కూడా పేర్లు పెట్టుకుంటే నష్టం ఏముందిలే అని ఆరోజు అనుమతించారు. పేర్లు పెట్టుకున్నంత మాత్రాన ఆస్తులు మొత్తం వాళ్లవేనని అంటే ఎలా? ఆస్తులు జగన్‌వి కాబట్టే.. ఆయన జైలుకు వెళ్లాడని సుబ్బారెడ్డి అన్నారు. మరి ఆస్తులు భారతివి అయితే.. ఆమె కూడా జైలుకు వెళ్లాలి కదా? ఆస్తులు ఉన్నంత మాత్రాన జైలుకు వెళ్లాలని రూల్ ఏమీ లేదు. ఎవరు అవినీతి చేశారో చూసి.. వారిపై కేసులు పెడతారు. సుబ్బారెడ్డి మాట్లాడే ముందు ఒకసారి ఆలోచించి ఉంటే బాగుండేది.' అని షర్మిల అన్నారు.

**'ఎవరైనా గిఫ్ట్ ఇస్తే:** ఎక్కడైనా ఎంఓయూ రాసుకుంటారా? ఇవ్వాల్సిన అవసరం, బాధ్యత ఉంది కాబట్టే.. ఆనాడు ఎంఓయూ ఇచ్చారు, సంతకం పెట్టారు. ఆయన ఆస్తి గిఫ్ట్‌గా ఇస్తే.. ఎంఓయూ ఎందుకో సుబ్బారెడ్డి సమాధానం చెప్పాలి. ఎంఓయూలో 4.2 లో ఆనాడు సరస్వతీ షేర్స్ ఎటాచ్ కాలేదు కాబట్టి.. వెంటనే ట్రాన్స్‌ఫర్ చేస్తాం. సైన్ చేస్తున్న ఈ ఎంఓయూ రిజిస్ట్రేషన్ అయిన వెంటనే ట్రాన్స్‌ఫర్ అనే పదాన్ని అండర్ లైన్ చేసి చెబుతున్నాను. అటాచ్ కాలేదు.. ట్రాన్స్‌ఫర్ చేయాలని తెలిసే.. ఈ ఒప్పందాలు చేశారు. అన్ని ఇళ్ళల్లో ఉండే విషయమే అని జగన్ చాలా సింపుల్‌గా చెప్పేశారు. కన్నతల్లిని కోర్టుకు ఈడ్చటం ఘర్ ఘర్‌కా కహానీనా జగన్. కన్న తల్లిని ఆస్తి కోసం కోర్టుకు లాగిన దౌర్భాగ్యులు ఎవరైనా ఉన్నారా? అంత సునాయశంగా, సులభంగా మాట్లాడుతున్నారంటే.. మీకు మానవత్వం ఉందా.. ఎమోషన్స్ లేవా?' అని జగన్ తీరుపై షర్మిల తీవ్రంగా స్పందించారు.

**షర్మిల ఎమోషనల్:** 'సజ్జల మాట్లాడినా, సాక్షి రాసినా తాను పెద్దగా పట్టించుకోను. కానీ చిన్నాన్న సుబ్బారెడ్డి మాట్లాడితే.. నా కళ్ళల్లో నీరు తిరిగా యి. నా బిడ్డలు నీ ముందు పెరగలేదా.. తాత అని పిలవలేదా? ఏది నిజమో, ఏది అబద్దమో మీకు తెలియదా.. ఆత్మ పరిశీలన చేసుకోండి. దేవుడు ఉన్నా డు.. నాన్న పైన ఉన్నాడు.. చూస్తున్నారు..' అని షర్మిల భావోద్వేగానికి గురయ్యారు.

## కారు, లారీ ఢీ

● ఆరుగురు మరణం



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: అనంతపురం జిల్లా సింగనమల ప్రాంతంలో నాయనపల్లె క్రాస్ వద్ద శని వారం జరిగిన రోడ్డు ప్రమా దంలో ఆరుగురు మరణించారు. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఆరుగురు స్పాట్ లోనే మరణిం చారు. మృతులంతా అనంత పురం ఇస్కాన్‌కి చెందిన వారిగా సమాచారం. అనంత పురంకడప హైవేపై లారీ– కారు ఢీ కొన్నాయి. తాడిపత్రి నగరంలో ఇస్కాన్ నగర సంకీర్తనకి వెళ్లి వస్తుండగా ప్రమాదం జరిగింది. తాడిపత్రి నుంచి అనంతపురంకు కారు వస్తోంది. మృతులు సంతోష్, షణ్ముక్, వెంకన్న, శ్రీధర్, ప్రసన్న, వెంకీలుగా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

### డిసెంబరు 1 నుంచి

## కొత్త రిజిస్ట్రేషన్ విలువలు

● 10 నుంచి 20 శాతం వరకు పెరగనున్న ఆస్తుల విలువలు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: వచ్చు డిశంబరు 1 నుంచి రాష్ట్రంలో ఆస్తుల విలువలు పెరగనున్నయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత రాష్ట్రంలో దాదాపు అన్ని నగరాలు, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని ఆస్తుల విలువలు పెరిగాయి. వ్యవసాయ భూములతోపాటు నివేశన స్థలాలు, భవనాల రేట్లు కనీసం 15 నుంచి 20 శాతం పెరిగాయి. అయితే ప్రభుత్వ ఆదాయం ఆ మేరకు పెరగలేదు. పెరుగుతున్న పట్టణీకరణ కారణంగా ప్రభుత్వం కూడా మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన పరిస్థితి నెలకొన్నది. దీనిని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం జిల్లా సంయుక్త కలెక్టర్ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి రిజిస్ట్రేషన్ విలువల తీరుపై రెండున్నర నెలల నుంచి రిజిస్ట్రేషన్, స్టాంపులశాఖ కసరత్తు చేస్తోంది. కనిష్ఠంగా 10% నుంచి గరిష్టంగా 20% వరకు రిజిస్ట్రేషన్ విలువలు పెంచే అవకాశం ఉంది. ఆస్తుల క్రయ, విక్రయాల రిజిస్ట్రేషన్ విలువలను వచ్చే డిసెంబరు 1 నుంచి పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయం గా నిర్ణయించింది. సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆమోదంతో అధికారిక ప్రకటన రానుందని అధికారులు చెప్పారు.

సూర్య
విజయవాడ
ఆదివారం
27 అక్టోబర్ 2024



# సంపాదకీయం

editpage@suryaa.com

## ఢిల్లీ కాలుష్యానికి అంటుకున్న రాజకీయ బురద

కాలుష్యం ఓ ప్రమాదకర భూతం. మానవాళితో పాటు సకల జీవకోటిని ప్రభావితం చేయగల కాలుష్యానికి అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వాలు పథక రచన చేస్తుంటాయి. ఏ రాష్ట్రం కూడా కాలుష్యం పెరగాలని భావించవు, ప్రోత్సహించదు. అయినా నేడు రాజధానిలో కాలుష్య పట్ల రాజకీయ నాయకుల ఆరోపణలు ఘాటుగా వినిపిస్తున్నాయి. ఈ రాజకీయ బురద చల్లు కోవడం ఢిల్లీ సిఎమ్ ప్రారంభించింది.

రాజధాని ఢిల్లీ మహానగరంలో కాలుష్యం విపరీతంగా పెరగడానికి భాజపా పాలిత రాష్ట్రాలే కారణమని ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషీ తెలుపడం కొంత విస్మయాన్ని కలుగజేసేతున్నది. భాజపా పాలిత హర్యానా, యూపీ రాష్ట్రాలకు చెందిన రైతులు తమ వ్యవసాయ వ్యర్థాలను విచక్షణారహితంగా, పెద్ద ఎత్తున కాల్చడంతో రాజధానిలో కాలుష్యం పలు రెట్లు పెరిగిందని ఆమె అన్నారు. అదే విధంగా ఆప్ పార్టీ పాలిత పంజాబ్‌లో వ్యార్థాల కాల్చివేత గణనీయంగా తగ్గిందని కూడా పేర్కొనడం విశేషం. ఢిల్లీ కాలుష్యం విషయంలో అతిషి చేసిన ఆరోపనలు అర్థరహితంగా ఉన్నాయని భాజపా నాయకులు ఖండించడం కూడా జరిగి పోయింది. ఈ విధంగా రెండు పార్టీలు ఒకరి మీద మరొకరు కాలుష్య ఆరోపణల బురద చల్లుకోవడం సమంజసంగా లేదని, కాలుష్యాన్ని తగించడానికి పార్టీలకు అతీతంగా నడుం బిగించాల్సింది పోయి ఇలా ఆరోపణలు చేసుకోవడం శుభ పరిణామం కాదని పౌర సమాజం విస్తు పోతున్నది.

నేడు ఢిల్లీ నేషనల్ క్యాపిటల్ టెర్రిటరీలో కాలుష్యం అనుమతులకు మించి మూడు రెట్లు పెరిగిందనే ప్రమాదకర విషయాలను బయట పెట్టడంతో నగరవాసులు భయంతో కంపించిపోతున్నారు. పిఎం 2.5 కాలుష్య స్థాయి 0 నుంచి 60 ఘనపు మీటరుకు మైక్రోగ్రామ్స్ ఉండాలని, కావి నగరంలోని నోయిడా, గుర్గావ్ లాంటి కొన్ని ప్రాంతాల్లో ప్రమాదకరంగా 125 వరకు నమోదు అవుతున్నదని గమనించారు. ఢిల్లీలో గాలి కాలుష్యం పెరిగినప్పటికీ, వ్యవసాయ వ్యర్థాలను కాల్చివేయడం మాత్రం కొంత తగ్గినట్లు తెలుస్తున్నది. పంజాబ్‌లో వ్యర్థాల కాల్చివేత గణనీయంగా తగ్గినట్లు, యూపీలో మాత్రం గత ఏడాదితో పోల్చితే నేడు కొద్దిగా పెరిగిందని తెలుస్తున్నది. వ్యర్థాల కాల్తివేత కట్టడికి ప్రభుత్వాలు తీసుకుంటున్న పలు చర్యలతో (ఫైన్ విధించడం, తప్పు చేసిన వారిపై కేసులు పెట్టడం లాంటివి) మూడు రాష్ట్రాల్లో పిఎం 2.5 దగ్గడం గమనించారు. 2024లో పంజాబ్, హర్యానాలతో పోల్చితే యూపీలో 1,581 వ్యర్థాల కాల్చివేతలు జరిగాయని తెలుస్తున్నది.

నానున్న చలికాలంలో కాలుష్యం మరింత పెరిగే ప్రమాదం ఉన్నందున నేటి నుంచే కట్టడి చర్యలు తీసుకోవడం ప్రారంభించాలి. వ్యవసాయ వ్యర్థాల కాల్చివేతతో 10 శాతం కాలుష్యం మాత్రమే జరుగుతున్నందున నగరంలో ఇతర కాలుష్య కారణాలను గుర్తించి ప్రణాళికాబద్ధంగా తగు జాగ్రత్తలు/చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలు, పౌర సమాజం గుర్తుంచుకోవాలి.

# సాములోరుది రద్దుచేశారు సరే

### దొంగ రామదూత , కల్కి ఆక్రమణలను కూడా రద్దుచేయ్యండి

జగన్మోహన్రెడ్డికి స్వరూపానంద పెట్టిన ఒక్కముద్దుకు 225 కోట్లభూమిని 15 లక్షలకు చదునుచేసి , రోడ్డువేసి అప్పణంగా ఇచ్చిన భూమిని , నిన్న రాష్ట్రమంత్రివర్గం రద్దుపరచటాన్ని రాష్ట్రప్రజలు అభినందిస్తున్నారు.అయితే నెల్లూరుజిల్లా గుడ్లూరుమండలం చేవూరు సాగుచెరువు సర్వేనంబరు 879 లోని కోట్లాదిరూపాయలవిలువగలిగిన భూమిని , పక్కనేగల సర్వేనంబరు 883 లోని అటవీభూమిని రామదూత అనిదొంగస్వామి ఆక్రమించి 25 సంవత్సరాలుగా ఆశ్రమం పేరుతొ మీసమస్యలు తీరుస్తాను , దీర్ఘరోగాలు నయంచేస్తాను , పిల్లలులేనివారికి పిల్లలుపుట్టిస్తాను , అంటు య్జ్ఞులు , యాగాలు , దీక్షలు చేస్తూ మోసం చేస్తున్నాడు . హేతువాదసంఘ పోరాటపలితంగా, 2021 లో ప్రిన్సిపల్ సెక్రటరి ఉషారాణి గారు , దొంగస్వామి ఆక్రమణభూమిని స్వాధీనం చేసుకొవాలని మెమో నంబరు 15358 క్రింద అదేశం ఇచ్చింది .ఇంతవరకు అతీగతిలేదు. కొత్తప్రభుత్వంలో కూడా మంత్రులకు , అధికారులకు పిర్యాదు చేసినాకూడా పలితంలేదు.స్వరూపానంద విషయంలో అదృష్టశక్తులు చివరివరకు ఆయన్ని కాపాడినట్లుగా , ఈదొంగస్వామి విషయంలోకూడా కొంతమంది అధికారులు భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోకుండా అడ్డుపడుతున్నారు. ఎవరనేది నిగ్గుతేల్చి వారిపై చర్యలుతీసుకుని , భూమిని స్వాధీనంచేసుకోవాలి. అలాగె తిరుపతి జిల్లాలో కల్కి భగవాన్ అనిఒక దొంగస్వామి వరదయ్యపాలెం మండలంలో పేదలభూములు ఆక్రమించి, 500 కోట్లరూపాయలతొ గొల్డెన్ టెంపుల్ నిర్మించాడు . ఈమధ్యనే కల్కివేసిన ఫిర్యాదును హైకోర్టు కొట్టేసినాకూడా , తిరుపతి జిల్లాకలెక్టరు పేదలభూమి పేదలకు స్వాధీనం చెయ్యకుండా , కల్కికి అనుకూలంగా వ్యవహరిస్తున్నాడు అని భూమిని కోల్పోయిన దళిత పేదలు , మాభూమిమాకు స్వాధీనం చేయండి అని ఎన్నోసార్లు కలెక్టరుకు మొరపెట్టుకున్నా స్పందనలేదు . ఇదే కల్కి ట్రస్టు వారు పక్కనేగల బీఎన్ కండ్రిగ మండలం లోని అంజుర్ అటవీప్రాంతంలో 21 ఎకరాల భూమిని ఆక్రమించి పెద్దపెద్ద కట్టడాలు నిర్మించి , యోగ , ద్యానం అంటు విదేశీయులను రప్పించి మోసంచేస్తున్నాడు . అటవీభూమిలొ కట్టెపుల్ల విరిస్తే జైల్లోపెడతామని చెప్పే అటవీశాఖవారు కల్కికి దాసోహం అని ఎందుకు అంటున్నారో చెప్పాలి. అటవి అదికారులు కల్కి ట్రస్టు వారిని తక్షణమె అరెస్టుచేసి , ఆక్రమణభూమిని స్వాదీనం చేసుకోవాలి .కనుక ప్రభుత్వము వెంటనే ఇంతకాలం ఈదొంగస్వాములను రక్షిస్తుంది ఎవడు అని విచారించి వారిపై చర్యలుతీసుకుని , ఆక్రమణ భూములని స్వాదీనం చేసుకోవాలి .

నార్నెవెంకటసుబ్బయ్య, 9290617819

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :

suryaeditpage@gmail.com

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

# బిసిలు రాజకీయపార్టీ పెట్టేది ఎప్పటికి?

- విత్తనం వేస్తేనే కదా మహా వృక్షం అయ్యేది
- నేటికీ నడుం బిగించిన నేతలు దాఖలాలు కనిపించట్లే
- జాతీయ పార్టీలు బీసీలకు అండగా ఉంటామనే హామీలు
- పేరుకు మాత్రమే ప్రకటించిన బిసీ డిక్లరేషన్లు
- నెలలు గడుస్తున్నా అమలకాని ఇచ్చిన హామీలు

కైలసాని శివప్రసాద్
9440203999




తెలుగు రాష్ట్రాలు రెండూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా కలసి ఉన్నప్పటినుంచి అనేక సంవత్సరాలుగా బిసి లు రాజకీయపార్టీ పెడతా రని బలంగా వార్తలు వినిపిస్తున్నాయి. ఇంతవరకు ఆ వార్తలు కార్య రూపం దాల్చకపోవడం గమనార్హం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రెండుగా విడిపోయి తెలంగాణా ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించాక బిసి లు రాజకీయ పార్టీ ప్రారంభిస్తున్నారనే వార్తలు విస్తృతంగా ప్రజలలోకి వెళ్ళాయి. అయినా ఇప్పటి వరకు బిసిల రాజకీయ పార్టీ ఏర్పాటుకు ఏ ఒక్క నాయకుడు నడుం బిగించిన దాఖలాలు లేవు. వాస్తవంగా తెలంగాణా రాష్ట్రంలో బిసిలు చాలా బలీయమైన శక్తిగా ఉన్నారనేది నిర్వివాదాంశం. రాష్ట్ర శాసనసభకు ఇటీవల జరిగిన ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్ధిగా బిసి ని ప్రకటించడం, కాంగ్రెస్ పార్టీ బిసి డిక్లరేషన్ ప్రక టించడం, ఇటీవల కాంగ్రెస్ పార్టీ పిసిసి అధ్యక్షునిగా బిసి అభ్యర్ధిని నియమించడము రాష్ట్రంలో బిసిలు బలంగా ఉన్నారనే దానికి నిద ర్శనం. రాష్ట్రంలోని వెనుకబడిన తరగతులలో 139 కులాలు ఉన్నా యి. అంతకు రెట్టింపు స్థాయిలో ఆ కులాలకు సంఘాలు ఉం డ డం గమనార్హం. ఈ పరిణామం ఆహ్వానించ దగినదే అయినా ఆ కులసంఘ నాయకుల మధ్య ఐకమత్యం లేకపోవడము రాష్ట్రంలో బిసిల పార్టీ ఆవిర్భావానికి అవరోధంగా కనిపిస్తూఉంది. తెలంగాణా రాష్ట్రంలో సుమారు 58 శాతం బిసిలు ఉన్నారు. రాష్ట్రంలోని బిసిలలో ఉన్న పోరాట పటిమ దేశంలోని ఏ ఇతర రాష్ట్రంలో లేదనే చెప్పాలి. తమ హక్కుల సాధన కొరకు తెలంగాణాలోని బిసిలు చేసే ఉద్యమాలు దేశానికి ఆదర్శమనడంలో ఎటువంటి సందేహం లేదు. బిసి కులాల జనగణన చేయడంలో తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుంటే ఈ విషయంపై బిసి సంఘ నాయకులు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి విజయం సాధించారు. మూడు నెలలోపు బిసి ల జనగణన పూర్తి చేయమని రాష్ట్ర హైకోర్ట్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. బిసిల జనాభా అధికారికంగా లెక్కించడం రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానానికి సహేతుకంగా కనిపించింది. కానీ బిసిల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి బిసి జనాభా లెక్కించడం సమంజసంగా కనిపించక పోవడం ఆశ్చర్యకరం. తెలంగాణా రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నికల సమయంలో 2023 నవంబర్ 9 తేదీన కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో బిసి డిక్లరేషన్ ప్రకటించింది. ఆ బిసి డిక్లరేషన్ పట్ల ఆకర్షితులైన అత్యధిక శాతం బిసిలు ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేశారు. పర్యవసానంగా రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. అప్పటి టీపీసీసీ అధ్యక్షులు, ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇంచార్జ్ మాణిక్ రావ్ ఠాకూర్ మరియు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నేతల సమక్షంలో కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధిరామయ్య బిసి డిక్లరేషన్ ను ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఆరునెలలోపు స్థానిక సంస్థలలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం వంటి అనేక హామీలు ఆ బిసి డిక్లరేషన్లో పొందుపరిచారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి పదకొండు నెలలు గడుస్తున్నా బిసి డిక్లరేషన్ ద్వారా ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్న ఆలోచన ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీకి తట్టలేదు. తమ ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ బిసి డిక్లరేషన్ ను ఆటకెక్కిస్తుందని బావించిన బిసి కుల సంఘాలన్నీ రాష్ట్ర వ్యాప్తంగా రోడ్డెక్కాయి. బిసి కులగణన, స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లు, బిసి డిక్లరేషన్ అమలు చేయమని రాష్ట్రం లోని బిసి సంఘాలు అన్నీ ఉద్యమ బాట పట్టాయి. కొందరు బిసి నాయకులు ఏకంగా ఆమరణ నిరాహార దీక్షకు పూనుకోవడం గమనార్హం. రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం ఆదేశాలకు, బిసి సంఘాల ఉద్యమ తీవ్రతకు తలొగ్గిన రాష్ట్ర ప్రభుత్వం రెండు నెలలోపు రాష్ట్రంలో సంపూర్ణ కుల గణన చేయాలని నిర్ణయం తీసుకుంది. అదేసమయంలో కులగణన తర్వాతనే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుపుతామని, బిసి ల రిజర్వేషన్లు సక్రమంగా అమలు చేసేందుకే రాష్ట్రంలో కులగణన చేస్తున్నామని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ఈ పరిణామం కచ్చితంగా రాష్ట్రంలోని బిసి లు సాధించిన విజయ మనడంలో ఎటువంటి సందేహం లేదు. రాష్ట్రంలోని బిసి సంఘ నాయకుల ఉద్యమ స్ఫూర్తిని కూడా ఈ సంధర్భంగా కచ్చి తంగా అభి నందించాలి. ఇదే స్ఫూర్తితో రాష్ట్రంలోని బిసి సంఘాలు, నాయకులు ఒకే వేదికపైకి వస్తే బిసిల రాజకీయ పార్టీ ఆవిర్భావాన్ని మరియు అధికారంలోకి రావడాన్ని ఏ శక్తి అడ్డుకోలేదు. బిసి సంఘాలు విడిగా ఎవరకి తోచిన రీతిలో వారు ఉద్యమాలు చేస్తున్నంత కాలం రాజకీయ పార్టీలకు ఎన్నికల సమయంలో మాత్రమే గుర్తుకు వచ్చే ఓటర్లుగానే బిసిలు మిగిలి పోతారు. బిసిల సమస్యలు ఎప్పటికీ తీరవు. ఎంతోకాలం నుంచి రాజ్యాధికారం కొరకు బిసిలు కంటున్న కలలు కలలు గానే మిగిలి పోతాయని కచ్చితంగా చెప్పవచ్చు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి అత్యధికంగా నష్టపోయింది రెండు తెలుగు రాష్ట్రాలతో పాటూ దేశ వ్యాప్తంగా 56 శాతం పైగా ఉన్న వెనుకబడిన తరగతుల వారే అనడంలో ఎటువంటి సందేహం లేదు. దేశంలోని బిసిల జీవన ప్రమాణాలు నానాటికీ దిగజారిపోయి అన్ని రంగాలలో వెనుక బడిపో తున్నారు. దీనికి ప్రధాన కారణం దేశంలో ఉన్న రాజకీయ పార్టీల కుటిల బుద్దే అని కచ్చితంగా చెప్పవచ్చు. ఉమ్మడి ఆంధ్రప్రదే శ్ రాష్ట్రంలో సుమారు 43 సంవత్సరాలు కాంగ్రెస్స్ పార్టీ అధికా రాన్ని అనుభవించింది. అసమయంలో ఒక్క బిసి వ్యక్తిని కూడా ముఖ్యమంత్రి స్థానంపై కాంగ్రెస్స్ పార్టీ కూర్చోబెట్టలేదు. ప్రస్తుతం కూడా తెలంగాణా రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికే ముఖ్యమంత్రి పీఠం కట్టబె ట్టింది. అదేవిధంగా కేంద్రంలో కాగ్రెస్ పార్టీ దేశాన్ని అత్యధిక కాలం పరిపాలించింది. ఆసమ యంలో బిసిలు, బిసిల సమస్యలు కాంగ్రెస్ పార్టీకి గుర్తుకు రాక పోవడం శోచనీయం. అదేవిధంగా ఇటీవల తెలం గాణా రాష్ట్రంలో జరి గిన శాసనసభ ఎన్నికల్లో తమ పార్టీ తరపున బిసిని ముఖ్యమంత్రి చేస్తామని భారతీయ జనతా పార్టీ ప్రకటించింది. అదే బిజెపి కేంద్ర పరిదిలోని బిసి కులగణన, బిసి లకు చట్టసభల్లో రిజర్వేషన్లు కేటాయించడం వంటి అనేక బిసిలకు సంబందించిన విషయాలను గాలికి వదిలేసింది. బిసిల సమస్యలు పరిష్కరించకుండా బిసిలు ఈ పార్టీలను ఎందుకు నమ్ముతారు? వ్యక్తి గత పార్టీలైన ప్రాంతీయ పార్టీలకు బిసిల అభివృద్ధి పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉంటుందో ప్రతి ఒక్కరూ అర్ధం చేసుకోవచ్చు. దేశంలో సగానికి పైగా ఉన్న బిసిల కులగణన చేయాలంటే దేశంలోని ప్రాంతీయ, రాజకీయ పార్టీలకు భయం. చిత్తశుద్దీతో శాశ్వత పథకాలు అమలు చేసి బిసి లను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తే దేశం యావత్తు పాలనా పగ్గాలు వారి చేతులలోకి పోతాయని రాజకీయ పార్టీలు బావిస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఈ విషయాన్ని స్పష్టంగా గ్రహించి రాజకీయ పార్టీలు గత ఏడు దశాబ్ధా లుగా తమకు న్యాయం చేయడం లేదని భావించి రాజ్యాధికారంలో తమ జనాభాకు తగిన ప్రాతినిద్యాన్ని సంపాదించుకొని తమ జాతుల జీవితాలు బాగు చేసుకోవాలనే ఉద్దేశ్యంతో బిసి లు రాజ్యాధికారం వైపు అడుగులు వేస్తున్నారు. కానీ బిసిలను రాజ్యా ధికారం వైపు నడిపించే నాయకత్వం మాత్రం కనిపించడం లేదు. దీనికి దశాబ్ధాల తరబడి తమ జాతుల హక్కుల కొరకు ఉద్యమాలు చేస్తున్న నాయకులు, ఉన్నత స్థానాలలో రిటైర్ అయిన ఇండియన్ సివిల్ సర్వీస్ ఉద్యోగులు, విద్యాధికులు, మేధావులు ఎటువంటి భేషిజాలకు పోకుండా పంతాలు, పట్టింపులు పోకుండా ఒకే వేదిక పైకి వచ్చి మొత్తం సంఘాలను, నాయకులను, ప్రజలను ఒకే తాటిపై నడిచేటట్లు చర్యలు తీసుకుని రాజకీయ పార్టీ స్థాపించి బిసి జనానికి రాజ్యాధికార బాట చూపించవలసిన ఆవశ్యకత ప్రస్తుతం అధికంగా ఉంది. ప్రలోభాలకు లొంగి యాదవ,గౌడ్,పద్మశాలి,వడ్డెర అని చీలిపోకుండా తామంతా ఒకే జాతి అనే విషయం గ్రహించి యావత్తు బిసి సమాజం ఒకటిగా నడచి యువతను ఎక్కువగా భాగస్వామయులు చేస్తే తాము అనుకున్న రాజ్యాధికారం అనే లక్ష్యం సాధించేందుకు బిసిలకు సులభమౌతుంది. పార్టీ పెట్టిన వెంటనే సత్పలితాలు రాకపోవచ్చు. అనేక ఒడిదుకుల అనంతరం కచ్చితంగా బిసిలు రాజ్యాధికారం సంపాదించే అవకాశం అత్యధికంగా ఉంది. తెలంగాణా రాష్ట్రంలో రాజ్యాధికారం వైపు బిసిలు వేసే అడుగులు దేశం లోని బిసిలకు కూడా మార్గదర్శంగా నిలుస్తాయని కచ్చితంగా చెప్పవచ్చు. విత్తనం వేస్తేనే కదా మహావృక్షమై పదిమందికి నీడనిచ్చేది.

# రెడ్ కారిడార్ లో పట్టు కోల్పోయిన మావోయిస్టు పార్టీ

- ఆపరేషన్ గ్రీన్ హంట్, ఆపరేషన్ కగార్ లతో నిర్వీర్యం
- అబూజ్ మాడ్ లో దాదాపు 37 మంది మావోయిస్టులు ఎన్ కౌంటర్
- 2014 నాటికే 200 జిల్లాల్లో ప్రభావాన్ని చూపిస్తున్న నక్సలిజం
- శాంతి భద్రత సమస్యగా భావించిన కేంద్ర ప్రభుత్వాలు
- 2024 సెప్టెంబర్ నాటికి 43 జిల్లాలకు పరిమితం చేశామన్న అమిత్ షా

బి.వెంకటరమణ
94407 40015



మావోయిస్టు పార్టీ వార్షికోత్సవ వేళ అన్నలకు భారీ ఎదురు దెబ్బ తగిలింది. అబూజ్ మాడ్ లో దాదాపు 37 మంది మావోయిస్టులు ఎన్ కౌంటర్ లో చనిపోయారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం చేస్తోన్న దాడుల్లో మావోయిస్టులు మరో దఫా తమ క్యాడర్ ను కోల్పోయారు. అయితే సంబాల కేశవరావు, తక్కెళ్ల పల్లి వాసుదేవరావు వంటి కీలక మావోయిస్టు నేతలు ఈ ఎన్కౌంటర్ లో చనిపోయినట్లు వార్తలు వస్తున్నాయి. దీని మీద ఇప్పటి దాకా చత్తీస్ ఘడ్ పోలీసుల నుండి ఎలాంటి ప్రకటన రాలేదు. అదే జరిగితే మావోయస్టులకు పెద్ద దెబ్బగానే చెప్పవచ్చు.

రెడ్ కారిడార్ పేరుతో మావోయిస్టులు గత కొన్నేళ్లుగా తమ బలాన్ని ప్రదర్శించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ రెడ్ కారిడార్ నే కాంపాక్ట్ జోన్ రివెల్యూషనరీ జోన్ గా మావోలు పిలుచుకుంటారు. అంటే 10 రాష్ట్రాల్లో దాదాపు 70కి పైగా జిల్లాల్లో విస్తరించి ఉంది

రెడ్ కారిడార్ రాష్ట్రాలు – ఆ జిల్లాల సంఖ్య

1. ఛత్తీస్‌గఢ్ – 13 జిల్లాలు
2. ఒడిషా – 10 జిల్లాలు
3. మహారాష్ట్ర – 02 జిల్లాలు
4. జార ఒడ్ – 16 జిల్లాలు
5. బీహార్ – 10 జిల్లాలు
6. పశ్చిమ బెంగాల్ – 01 జిల్లా
7 ఆంధ్రప్రదేశ్ – 05 జిల్లాలు
8. తెలంగాణ – 06 జిల్లాలు
9. కేరళ – 03 జిల్లాలు
10. మధ్యప్రదేశ్ – 03 జిల్లాలు

ఏపీ, తెలంగాణలో అక్కడ ప్రభావం తెలంగాణలో రెడ్ కారిడార్ గా మావోయిస్టులు చెప్పుకుంటున్న ఆరు జిల్లాలు భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, కొమరం భీం ఆసీఫాబాద్, ఆదిలాబాద్ లు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలు ఉన్నాయి. అయితే ఈ రెడ్ కారిడార్ 70 జిల్లాల్లో ఉన్నట్లు చెప్పుకున్నా వాస్తవ పరిస్థితి చూస్తే, మావోయిస్టు పార్టీ 2014 నాటికే 200 జిల్లాల్లో తన ప్రభావాన్ని చూపుతున్నట్లు కేంద్ర ప్రభుత్వ లెక్కల్లో తెలింది. ఇంతలా తన ప్రాబల్యాన్ని చాటుకునేందుకు గత కొద్ది కాలంగా మావోయిస్టు పార్టీ ప్రయత్నం చేస్తోంటే మరో వైపు కేంద్ర ప్రభుత్వం ఎక్కడిక్కడ మావోలకు చెక్ పెట్టుకుంటూ వస్తోంది.

ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రీన్ హంట్, ఆపరేషన్ కగార్ పేరుతో పెద్ద ఎత్తున మావోయిస్టులను ఎన్ కౌంటర్లు లేదా లొంగిపోయేలా చేయడం ద్వారా కేంద్రం తన బలాన్ని చాటుతోంది. అయితే పెద్ద సంఖ్యలో మావోయిస్టులు ఎన్ కౌంటర్లలో ప్రాణాలు కోల్పోతున్నారు. 2026 నాటికి దేశంలో తుపాకి పట్టుకుని ఎర్రజెండా మోసే మావోయిస్టు పార్టీని లేకుండా చేస్తామని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా పదే పదే ప్రకటనలు చేస్తున్నారు. అందుకు అనుగుణంగా మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో ఆపరేష్ కగార్ ను చేపట్టారు.

తాము తొలి సారి అధికారంలోకి వచ్చిన 2014 లో నక్సల్ ప్రభావిత జిల్లాల సంఖ్య 200 ఉంటే దాన్ని 2024 సెప్టెంబర్ నెల నాటికి 43 జిల్లాలకు పరిమితం చేశామని అమిత్ షా ప్రకటన చేయడం మావోలకు ఎలాంటి ఎదురు దెబ్బలు తగిలాయో అర్థం చేసుకోవచ్చు. కేంద్రం లెక్కల ప్రకారం 2024 జనవరి నాటికి 700 మావోయస్టులను ఎన్ కౌంటర్లో నిర్మాలిచండమో, లేదా వారిని ఆయుధాలు వదిలి జన జీవన స్రవంతిలో కలిసేలా లొంగదీయడమో జరిగిందని తెలుస్తోంది. ఆపరేషన్ కగార్ చేపట్టిన నాటి నుండి మావోయిస్టు పార్టీ కొంత ఆత్మరక్షణ దోరణితో ఉన్నా, కేంద్ర బలగాలు వారిని వెంటాడుతూనే ఉన్నాయి.

రెడ్ కారిడార్ లో మావోయిస్టు పార్టీల ప్రాబల్యం క్రమంగా తగ్గుతూ ఇప్పుడు వారి సేఫ్ జోన్ గా ఉన్న అబుజ్ మాడ్, దండకారణ్యంలోను తూపాకుల మోత మోగుతోంది. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర బలగాలు ఏకంగా వారి సేఫ్ జోన్లలోకి ప్రవేశించింది. గతంలో మావోయిస్టుల సమస్యను అప్పటి కేంద్ర ప్రభుత్వాలు ఓ శాంతి భద్రత సమస్యగా భావించేవి. స్టేట్ లా అండ్ ఆర్డర్ రాష్ట్ర ప్రభుత్వాల పనిగా కేంద్రం వదిలేసేది. కాని మావోయిస్టుల ప్రభా వం పెరగడం ఒక రాష్ట్రంలో మావోలు తమ కార్యకలాపాలు సాగించి పక్క రాష్ట్రంలో తలదాచుకోవడం వంటి సంఘటనలతో వారిని అదుపు చేయాలంటే సమన్వయం అవసరం అని అన్ని రాష్ట్రాలు భావించాయి.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మావోయిస్టుల కార్యకలాపాలను ఇక్కడి పోలీసులు నిర్ధాక్షిణ్యంగా అణిచివేయడం, నిరంతర నిఘాను పెంచడం, నక్సల్స్ ను అణిచివేసేందుకు గ్రేహౌండ్స్ వంటి ప్రత్యేక శిక్షణ పొందిన దళాలను ఏర్పాటు యడం, ఏ ప్రభుత్వం వచ్చినా పోలీసులు మావోయిస్టులపైన, వారి సానుభూతి పరులపైన ఉక్కుపాదం మోపడం వంటి చర్యలతో మావోయిస్టులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తమ కార్యకలపాలు తగ్గించి ఛత్తీస్ ఘడ్, ఒడిశా, మహారాష్ట్రకు సరిహద్దులు దాటి వెళ్లిపోవడం జరిగింది. అప్పడప్పుడు తెలంగాణలో మావోయిస్టులు ప్రవేశించినా ఒకప్పటితో పోల్చితే వారి కార్యక్రమాలు చాలా తగ్గిపోయాయి. అదే రీతిలో తెలంగాణ ,ఏపీ సరిహద్దు రాష్ట్రాల్లో వారి కదలికలు పెరిగాయి.

రెండు రాష్ట్రాల మధ్య సమన్వయ లోపంతో మావోయిస్టు పార్టీ యధేచ్ఛగా తన టార్గెట్స్ ను పూర్తి చేసే పరిస్థితులు ఉన్నయి. దీంతో ఆయా రాష్ట్రాల ఇంటలిజెన్స్, ప్రభుత్వాల నివేదికతో లెఫ్ట్ వింగ్ ఎక్ట్రీమిజం ను అంతం చేయాలంటే కేంద్రమే రంగంలోకి దిగాలని, మావోయిస్టు పార్టీపై ఓ విధాన నిర్ణయం తీసుకోవాలన్న ఆలోచనకు వచ్చింది. దీంతో కేంద్ర ప్రభుత్వమే మావోల అణివేతకు కార్యాచరణ ప్రారంభించింది. అందులో భాగంగానే ఆపరేషన్ గ్రీన్ హంట్, ఆపరేషన్ కగార్ పుట్టుకొచ్చాయి. అప్పటి నుండి మావోయిస్టు పార్టీకి పుట్టెడు కష్టాలు ప్రారంభమయ్యాయి. ఒక్కో జిల్లా నుండి మావోలను దూరం చేస్తూ వారి ప్రభావాన్ని కేంద్ర బలగాలు తగ్గిస్తూ వచ్చాయి. దండకారణ్యం అనే పదం సంస్కృతం నుండి ఉద్భవించింది. దండ అంటే శిక్ష అని, కారణ్యం అంటే అరణ్యం, అటవీ ప్రాంతమని అర్థం వస్తుంది. ఈ దండ కారణ్యం దాదాపు 60 వేల చదరపు కిలోమీటర్లు విస్తరించి ఉంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్ ఘడ్, ఒడిస్సా రాష్ట్రాల మధ్య విస్తరించి ఉన్న దట్టమైన అటవీ ప్రాంతం. ఈ ప్రాంతం అంతా దట్టమైన అడవులు, పర్వతాలు, సెలయేర్లతో నిండిన ప్రాంతం. ఆదివాసీ గిరిజనులు నివసించే ప్రాంతం. ఈ దండకారణ్యాన్ని తమ బేస్ గా చేసుకుని మావోయిస్టు పార్టీ పని చేస్తోంది. ప్రభుత్వంపై అసంతృప్తి ఉన్న గిరిజనులే వీరికి ప్రధాన మద్దతు దారులు. ఓ రకంగా చెప్పాలంటే జన చేతన సర్కార్ పేరుతో సమాతంర ప్రభుత్వాన్ని ఈ దండకారణ్యంలో మావోయిస్టులు నడిపారు. విద్య, వైద్యం, గిరిజనులకు అవసరమైన ఆహార పంపిణీ వంటి పనులను చేపట్టారు. అంటే మావోయిస్టులు ఈ దండకారణ్యంలో ఏ రకమైన సాధికారిత కలిగి ఉన్నారో మనం అర్థం చేసుకోవచ్చు. మావో దళాలు మిలటరీ శిక్షణ కోసం, ఆయా ప్రాంతాల్లో చ్ఛేపట్టే కార్యక్రమాల ప్రణాళిక రచన, ఆయుధ సామగ్రి డంపుల ఏర్పాటు వంటి వాటికి దండకారణ్యాన్ని వాడుకుంటోంది. ఓ రకంగా చెప్పాలంటే మావోలకు దండకారణ్యం ఓ అతి పెద్ద సేఫ్ జోన్. అబుజ్ మాడ్ అనేది గొండు భాషకు చెందిన పదం. ఆ భాషలో అబూజ్ చెట్టు లేదా దట్టమైన అరణ్యం అని అర్థం. మాడ్ అంటే పర్వతం అని అర్థం వస్తుంది. ఈ ప్రాంతం అంతా చెట్లు, పర్వతాలు, జలపాతాలు, సెలయేర్లతో నిండిన ప్రాంతం. ఓ రకంగా చెప్పుకోవాలంటే కాకులు దూరని కీకారణ్యం. ఈ అబుజ్ మాడ్ 5200 కిలీమీటర్ల పరిధిలో వ్యాపించిన దట్టమైన అటవీ ప్రాంతం. ఇది ఛత్తీస్ ఘడ్ లో ఎక్కువగా వ్యాపించి ఉంది. ఆ రాష్ట్రంలోని నారాయణ పూర్ జిల్లాలోనే దాదాపు 4000 కిలోమీటర్లు వ్యాపించి ఉంది. దంతెవాడ, బీజాపూర్, కొండెగావ్, సుక్మా జిల్లాల్లో కొంత విస్తరించి ఉంది. ఇది మావోయిస్టులకు అతి పెద్ద స్థావరంగా చెప్పుకోవాలి. ఈ ప్రాంతంలోనే ఐరన్ ఓర్ సహా విలువైన ఖనిజ సంపద ఉంది. అయితే ఇక్కడ కూడా ఆదివాసీలను ఆకట్టుకున్న మావోయిస్టు పార్టీ సమాంతర ప్రభుత్వం నడుపుతోంది. అయితే గత కొన్నేళ్లుగా మావోయిస్టుల ఆసుపాసులు కనిపెట్టిన కేంద్ర బలగాలు పెద్ద ఎత్తున దెబ్బతీస్తున్నాయి.

ఆపరేషన్ కగార్ 2017లో మావోయిస్టులను నిర్మూలించేందుకు ఛత్తీస్ ఘడ్ లో ప్రారంభమైన పోలీస్ ఆపరేషన్. దేశంలో మావోయిస్టుల ఏరివేతనే ఈ ఆపరేషన్ ముఖ్య లక్ష్యం. ఇందులో భాగంగా మావోలకు స్థావరాలైన దండకారణ్యం, అబుజ్ మాడ్ లను జల్లెడ పట్టి మావోలను నిర్మూలిస్తే ఆ పార్టీ అంతర్ధానమవుతుందన్నది కేంద్ర ప్రభుత్వం పెద్దల ఆలోచన. అందులో భాగంగా సుశిక్షితులైన సీఆర్పీఎఫ్ కోబ్రా, ఇండో టిబెటియన్ బోర్డర్ పోలీస్, డిస్ట్రిక్ రిజర్వ్ గార్డ్స్ ( డీఆర్జీ), ఎస్టీఏఫ్ దళాలు, బీఎస్ఎఫ్, బస్తర్ ఫైటర్ దళాలు రంగంలోకి దిగి మావోలను భౌతికంగా నిర్మూలిస్తున్నాయి. అత్యాధునిక ఆయుధాలు, డ్రోన్లు, మానవ రహిత విమానాలను సైతం రంగంలోకి దింపి మావోయిస్టులను ఈ దళాలు మట్టుబెడుతున్నాయి. మావోయిస్టుల కంచు కోటలైన దండకారణ్యం, అబుజ్ మాడ్ లలో చొచ్చుకుని వెళ్లి మావోయిస్టు పార్టీ ని రూపు మాపడమే లక్ష్యంగా ఆపరేషన్ కగార్ సాగుతోంది. 2026 కల్లా ఆ పార్టీని రూపు మాపడం కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా చెబుతున్నారు.

అయితే 2009లోనే గ్రీన్ హంట్ పేరుతో కమాండో బెటాలియన్స్ ఫర్ రెస్పాన్స్ అండ్ యాక్షన్ ( కోబ్రా) పేరుతో మావోలను ఏరివేసినా, ఆపరేషన్ కగార్ మాత్రం నక్సల్స్ కు భారీ ఎత్తున నష్టాన్ని చేకూర్చుతోంది. అందులో భాగంగానే శుక్రవారం జరిగిన ఎన్ కౌంటర్‌లో 36 మంది మావోయిస్టులు భద్రతా బలగాల చేతుల్లో మృత్యువాత పడ్డారు. అయితే రానున్న రోజుల్లో ఈ రెండు స్థావరాలయిన అబుజ్ మాడ్, దండకారణ్యం నుంచి మావోల ఉనికి లేకుండా చేస్తే దేశంలో ఆ పార్టీ ఉనికి కోల్పోయినట్లేనని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందు కోసం ఈ కీకారణ్యంలోనే మిలట్రీ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని భావిస్తోంది. మావోలపై ఆర్మీని రంగంలోకి దించకపోయినా, ఆ అటవీ ప్రాంతం తమ పరిధిలో ఉంచు కోవడం, అక్కడి అటవీ ఉత్పత్తులు, ఖనిజ సంపదను ఆధీనం లో ఉంచుకోవడం కూడా కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా కనబడుతోంది. ఇందు కోసం ఆర్మీ మకాం అక్కడ వేయాలన్న వ్యూహంలో ఎన్డీఏ ప్రభుత్వం ఉంది. అంతే కాకుండా ప్రతీ ఐదు కిలోమీటర్లకు భద్రతా బలగాల బేస్ క్యాంపు ఏర్పాటు చేయడం, కమ్యూనికేషన్ సదుపాయాలు కల్పించడం, ఆత్యాధునిక ఆయుధాలు, టెక్నాలజీని వాడటం, డ్రోన్లు, మానవరహిత విమానాలు అందుబాటులో ఉంచి మావోలను అణచివేయడం ఇప్పటికే జరుగుతోంది. రానున్న రోజుల్లో ఈ రెండు స్థావరాలు కేంద్ర బలగాల ఆధీనంలో ఉండటమే ఆపరేషన్ కగార్ లక్ష్యంగా కనిపిస్తోంది. అయితే ఇంత పెద్ద ఎత్తున అబుజ్ మాడ్, దండకారణ్యంలో మావోయిస్టులు, కేంద్ర బలగాల మధ్య పోరు జరుతోందో ప్రస్తుత ఎన్ కౌంటరే అందుకు నిదర్శనం. దీనికి ప్రతీకారంగా మావోయిస్టులు కూడా ఎలాంటి హింసాత్మక ఘటనలకు దిగుతారో అన్నది చెప్పలేం. రానున్న రోజుల్లో అబుజ్ మాడ్, దండకారణ్యం అడవుల్లో ఎలాంటి యుద్ధవాతావరణం నెలకొంటుందో అన్న ఆందోళన సర్వత్రా వ్యక్తం అవుతోంది.

సూర్య
విజయవాడ
ఆదివారం
27 అక్టోబర్ 2024


# సంస్కృతిని చాటి చెప్పిన గొప్ప కళాకారుడు కనకరాజు



**నివాళులు అర్పించిన ప్రధాని మోడీ**

ఉట్నూర్ : గుస్సాడీ (దండారి)ని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప కళాకారుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత కనకరాజు అని ప్రధాని మోడీ ( ఎక్స్ వేదికగా శనివారం సంతాపాన్ని ప్రకటించారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత కనకరాజు అనారోగ్య కారణంగా శుక్రవారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం మార్లవాయి గ్రామం లో తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే కాగా, దేశ ప్రధాని మోడీ, సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు సంతాపాన్ని ప్రకటించారు. అద్భుతమైన నృత్యకారుడు, సాంస్కృతిక దిగ్గజం కనకరాజు అని కొనియాడారు. గుస్సాడీ నృత్యాన్ని పరిరక్షించడంలో ఆయన అందించిన సహకారం మరువలేనిదన్నారు. ఆయన అంకితభావం, అభిరుచి, సాంస్కృతిక వారసత్వం అభినందనీయమన్నారు. కనకరాజు మృతిపై ఆయన కుటుంబ సభ్యులకు మోడీ సానుభూతి తెలిపారు.

# 4 గంటల్లోనే హైదరాబాద్ టు విశాఖ!



● శంషాబాద్-విశాఖపట్నం మధ్య సెమీ హైస్పీడ్ రైల్ కారిడార్

హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల మధ్య ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించే ప్రాజెక్టు ప్రణాళిక కీలక దశకు చేరుకుంది. శంషాబాద్ నుంచి విశాఖపట్నం మధ్య సెమీ హైస్పీడ్ రైల్ కారిడార్ ఎలైన్‌మెంట్ ఖరారైంది. సూర్యాపేట, విజయవాడ మీదుగా ఈ మార్గాన్ని కూటమి ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టో భాగంగా విశాఖ నుంచి విజయవాడ, సూర్యాపేటల మీదుగా కర్నూలుకు మరో కారిడార్ నిర్మించనున్నారు. ఈ కారిడర్ విశాఖ నుంచి మొదలై సూర్యాపేట, నల్గొండ, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ మీదుగా కర్నూలు చేరుతుంది. వీటి ప్రిలిమినరీ ఇంజినీరింగ్, ట్రాఫిక్ సర్వే తుది దశకు చేరుకుంది. ఈ సర్వే నివేదికను నవంబరులో రైల్వేబోర్డుకు రాష్ట్ర ప్రభుత్వం సమర్పించనున్నట్లు సమాచారం.

4 గంటల్లోపే శంషాబాద్ - విశాఖపట్నం! : ఈ ప్రాజెక్ట్ తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటి సెమీ హైస్పీడ్ కారిడార్ కానుంది. ఈ మార్గంలో శంషాబాద్, రాజమహేంద్రవరం విమానాశ్రయాలను అనుసంధానించేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. విమాన ప్రయాణికులు సెమీ హైస్పీడ్ రైళ్లలో స్వ స్థలాలకు వేగంగా చేరుకునేలా రైల్వే శాఖ ప్రణాళిక రూపొందించింది. గంటకు 220 కిలోమీటర్ల వేగంతో రైళ్లు ప్రయాణించేలా సెమీ హై స్పీడ్ కారిడార్‌ను డిజైన్ చేస్తున్నారు. ఈ సెమీ హైస్పీడ్ కారిడార్ పూర్తయితే శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి విశాఖపట్నానికి 4 గంటల్లోపే చేరుకోవచ్చు. ప్రస్తుతం ఈ 2 నగరాల మధ్య రైలు ప్రయాణానికి 12 గంటల సమయం పడుతోంది. వందే భారత్‌లో ప్రయాణిస్తే 8.30 గంటల్లో చేరుకున్నారు. రెట్టింపు వేగం తగ్గనున్న సమయం : సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నానికి ప్రస్తుతం 2 మార్గాల్లో రైళ్లు ప్రయాణిస్తున్నాయి. మొదటిది వరంగల్, ఖమ్మం, విజయవాడ మార్గం కాగా రెండోది నల్గొండ, గుంటూరు, విజయవాడ మీదుగా విశాఖ పట్టణానికి ప్రయాణం చేస్తున్నారు. రైళ్ల గరిష్ఠ వేగం గంటకు 110-130 కిలోమీటర్లు మాత్రమే. ఈ రెండు మార్గాలతో పోలిస్తే కొత్తగా రానున్న శంషాబాద్-విశాఖపట్నం మార్గం మరింత దగ్గర అవుతుంది. వేగం దాదాపు రెట్టింపై ప్రయాణ సమయం సగాని కంటే ఎక్కువ తగ్గిపోతుంది. కర్నూలు మార్గం ఇలా : శంషాబాద్ ఎయిర్పోర్టు నుంచి విశాఖపట్టణానికి సెమీ హైస్పీడ్ కారిడార్ ప్రతిపాదిత మార్గంలో మరో కీలక అంశం కూడా ఉంది. విశాఖపట్నం-కర్నూలు వరకు అనుసంధానం మార్గాన్ని సూర్యాపేట మీదుగా ప్రతిపాదించగా ఈ మార్గంలో మొత్తం 8 రైల్వే స్టేషన్లను అదనంగా వచ్చి చేరుతున్నాయి. ఈ మార్గంలో మొత్తం 12 స్టేషన్లు : శంషాబాద్-విశాఖపట్నం సెమీ హైస్పీడ్ కారిడార్‌ని పరిశీలిస్తే హైదరాబాద్-విజయవాడ 65వ జాతీయ రహదారి ) మార్గానికి కాస్త అటూ ఇటూ గానే కనిపిస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటి వరకు రైలు మార్గం సదుపాయం లేని అనేక పట్టణాలు, జిల్లాలు కొత్త కారిడార్‌తో రైల్వే నెట్‌వర్క్‌లో చేరే అవకాశం ఉంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో కోదాడ, సూర్యాపేట, నకిరేకల్, నార్కట్పల్లి వంటి పట్టణాలకు నేటి వరకు రైలు మార్గం లేదు. అదే విధంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నాగర్కర్నూల్, వనపర్తి, కల్వకుర్తి పట్టణాలు కొత్త కారిడార్తో రైల్వే నెట్వర్క్లో చేరే అవకాశం ఉంది. నాగర్‌కర్నూల్ జిల్లా మొత్తంలో ఎక్కడా రైల్వే లైనే జాడ కనిపించదు. ఇలాంటి ప్రాంతాల మీదుగా ఇప్పుడు ఏకంగా గంటకు 220 కిలోమీటర్ల వేగంతో రైళ్లు దూసుకెళ్లే సెమీ హైస్పీడ్ కారిడార్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం అవుతున్నాయి.

# ఇరాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు

● ఇజ్రాయెల్‌పై బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిన ఇరాన్
● తాజాగా ప్రతీకార దాడులకు దిగిన ఇజ్రాయెల్
● ఇరాన్ రక్షణ వ్యవస్థ, ఆయుధగారాలే లక్ష్యంగా దాడులు
● నష్టం జరగలేదన్న ఇరాన్



టెహ్రాన్‌: ఇరాన్ రాజధాని టెహ్రాన్‌ను లక్ష్యంగా చేసుకున్న ఇజ్రాయెల్ వందలాది విమానాలతో ఈ తెల్లవారుజామున భీకర దాడులు జరిపింది. ఈ దాడుల నేపథ్యంలో జరిగిన పేలుళ్లతో టెహ్రాన్ చిగురుటాకులా కంపించింది. ఇజ్రాయెల్ విమానాలు వేసిన బాంబులు దీపావళి రోజున ఆకాశంలో పేలిన టపాసులను తలపించాయి. అయితే, ఇజ్రాయెల్ దాడుల వల్ల తమకు పరిమితంగానే నష్టం వాటిల్లినట్టు ఇరాన్ స్పష్టం చేసింది. పశ్చిమాసియాలో నెలకొన్నఉద్రిక్తతలకు తోడు తాజా దాడుల నేపథ్యంలో యుద్ధ భయాలు నెలకొన్నాయి. ఇప్పటికే గాజాలో హమాస్, లెబనాన్‌లో హిజ్బుల్లాతో ఇజ్రాయెల్ పోరాడుతోంది. 1980లో ఇరాక్‌తో యుద్ధం తర్వాత ఇరాన్‌పై ఇజ్రాయెల్ బహిరంగంగా దాడులకు దిగడం ఇదే తొలిసారి. ఈ నెల మొదట్లో ఇజ్రాయెల్‌పై ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులతో దాడిచేసింది. ప్రతిగా ఇజ్రాయెల్ ఇప్పుడు వందకుపైగా యుద్ధ విమానాలతో ఇరాన్‌పై విరుచుకుపడింది. మూడు దఫాలుగా ఇజ్రాయెల్ దాడికి దిగింది. తొలిసారి ఇరాన్ రక్షణ వ్యవస్థపై, రెండు, మూడోసారి ఇరాన్ ఆయుధగారాలపై దాడులు చేసింది. ఇవి ప్రతీకార దాడులేనని ఇజ్రాయెల్ పేర్కొంది.

# మా ఎమ్మెల్యేలకు కోట్లలో ఆఫర్

**భాజపా ఎన్సీపీ లపై కాంగ్రెస్ ఆరోపణలు**



ముంబయి: అజిత్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ )లో చేరాలని తమ ఎమ్మెల్యేలకు రూ.కోట్లలో డబ్బు ఆఫర్ చేశారని కాంగ్రెస్ ఆరోపించింది. అజిత్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ)లో చేరేందుకు ఇద్దరు ఎమ్మెల్యేలకు కోట్లాది రూపాయలు ఆఫర్ చేశారని కాంగ్రెస్ శనివారం ఆరోపించింది. "ఎన్సీపీలో చేరాలని మా పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలకు ఆ పార్టీ కోట్ల రూపాయలు ఆఫర్ చేస్తోంది. ఇది నేరపూరిత చర్య.. ఫిరాయింపుల నిరోధక చట్టం కిందకు వస్తుంది. హోంశాఖ బాధ్యతలు చూస్తున్న సీఎం ఎందుకు మౌనంగా ఉన్నారు. ఈ విషయంపై ఆయన స్పందించాలి. అసలు ఏమి జరిగిందో చెప్పాల్సిన బాధ్యత ఆయనపైన ఉంది" అని కాంగ్రెస్ మహారాష్ట్ర ఇన్‌ఛార్జ్ రమేష్ చెన్నితాల అన్నారు. కాగా కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలపై ఎన్సీపీ ఇంకా స్పందించలేదు మహారాష్ట్ర ఎన్నికలకు 48 మంది అభ్యర్థులతో తొలి జాబితా విడుదల చేసిన కాంగ్రెస్ గురువారం 23 మంది అభ్యర్థులతో రెండో జాబితా ప్రకటించింది. 2019 ఎన్నికల్లో ఓడిపోయిన వసంత్ పుర్కే రాలేగావ్, శివాజీరావ్ మోఘే కుమారుడు జితేంద్ర పేర్లు ఆ జాబితాలో ఉన్నాయి. మహా వికాస్ అఘాడీ సీటు షేరింగ్ ఒప్పందం మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు విపక్ష 'మహా వికాస్ అఘాడీ' కూటమిలో సీట్ల సర్దుబాటు వ్యవహారంలో ఏకాభిప్రాయం కుదిరింది. ఈ కూటమిలోని ప్రధాన పక్షాలైన శివసేన (యూబీటీ), కాంగ్రెస్, ఎన్సీపీ (ఎస్‌పీ) పార్టీలు 85 స్థానాల చొప్పున పోటీచేయాలని నిర్ణయించాయి. మరోవైపు, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు శివసేన (యూబీటీ) 65మంది అభ్యర్థులతో జాబితాను విడుదల చేసింది. మరోవైపు శివసేన (యూబీటీ) 65మంది అభ్యర్థులతో తొలి జాబితా విడుదలైంది. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే కోప్రి-పచ్‌పఖాడి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగుతుండగా.. ముంబయిలోని వర్లి నుంచి మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే తనయుడు ఆదిత్య ఠాక్రే పోటీ చేయనున్నారు. మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ శిందే నియోజకవర్గమైన కోప్రి పాచ్‌పఖడి సీటులో ఆయన రాజకీయ గురువు ఆనంద్ దిఘే సోదరుడి కుమారుడైన కేదార్ దిఘేను ఉద్ధవ్ ఠాక్రే బరిలో దించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు నవంబర్ 20న ఒకే దశలో పోలింగ్ జరగనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. నవంబర్ 23న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు వెల్లడించింది.

# మస్క్‌పై ఇస్రో ఛైర్మన్ ప్రశంసలు



న్యూఢిల్లీ : స్పేస్‌ఎక్స్‌సం స్థ ద్వారా అంతరిక్షరంగంలో దూసుకెళు న్నారు ఎలాన్‌మస్క్ . ఆయన వినూత్న ఆలోచనలను ఇస్రో ఛైర్మన్ ఎస్ సోమనాథ్ కొనియాడారు. ఐఐటీ ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. ఆయన చేస్తోన్న కృషి వల్లే అంతరిక్ష రంగం ఇప్పుడు ప్రతిఒక్కరినీ ఆకర్షిస్తోందన్నారు. "స్పేస్‌ఎక్స్ ఇటీవల చాప్‌స్టిక్స్ తరహాలోని మెకానికల్ ఆర్మ్స్‌తో స్టార్‌షిప్ రాకెట్ బూస్టర్‌ను పట్టుకోగలిగింది. ఇస్రో ఎప్పుడు అలా చేస్తుందని అంతా అడుగుతున్నారు. మనలోని ఒక వ్యక్తి అయిన ఎలాన్‌మస్క్ ఈ సరికొత్త ఐడియాతో అందరినీ అబ్బురపరిచారు. ఆయన ఏం చేస్తున్నారని, ఆయన్ను మించి ఎలాంటి విభిన్న ఆలోచనలతో ముందుకు రాగలమని ప్రతి ఒక్కరు ఆలోచిస్తున్నారు. అద్భుతమైన పనితీరు చూపుతోన్న గొప్పవ్యక్తి ఆయన అని నేను భావిస్తున్నారు. మస్క్ పనితీరు నుంచి మనమంతా ప్రేరణపొందాం. దానివల్లే అంతరిక్ష రంగం ఇప్పుడు ప్రతి ఒక్కరినీ ఆకర్షిస్తోంది. ఈ రంగం ప్రభావం దేశ ఆర్థిక, ఉపాధి కల్పనపై ఉండటంతో ప్రైవేటు భాగస్వామ్యం కోసం కేంద్రం చొరవ తీసుకుంది" అని సోమనాథ్ మాట్లాడారు. స్పేస్‌ఎక్స్ సంస్థ అంతరిక్ష ప్రయోగ రంగంలో ఇటీవల సరికొత్త రికార్డ్ సృష్టించింది. ఆ సంస్థ తాజాగా ప్రయోగించిన భారీ స్టార్‌షిప్ రాకెట్ బూస్టర్ నింగిలోకి దూసుకెళ్లి, ఆ తర్వాత లాంచ్‌ప్యాడ్ (లాంచ్‌టవర్) వద్దకు సురక్షితంగా చేరుకుంది. ఇటీవల రెండు దశల (బూస్టర్, వ్యోమనౌక) స్టార్‌షిప్ రాకెట్ను నింగిలోకి ప్రయోగించారు. నింగిలోకి ఎగిరిన 7 నిమిషాల తర్వాత బూస్టర్ క్రమంగా కిందకు దిగుతూ లాంచ్‌టవర్‌కు సురక్షితంగా తిరిగొచ్చింది. చాప్‌స్టిక్స్‌లా పనిచేసే మెకానికల్ ఆర్మ్స్‌తో లాంచ్‌టవర్ దాన్ని పదిలంగా ఒడిసిపట్టుకుని చరిత్ర సృష్టించింది. తొలిసారే విజయవంతంగా ఈ ప్రక్రియను పూర్తిచేయడంతో ప్రశంసలు వెల్లువెత్తాయి

# అగ్రరాజ్య ఎన్నికలలో మస్క్ మార్క్

● ఓటర్లకు ప్రైజ్ మనీ ఇస్తున్న బిలియనీర్ ● న్యాయశాఖ వార్నింగ్ ఇచ్చినా తగ్గేదేలేదనా వెల్లడి మస్క్..
● ట్రంప్‌కు మద్దతిచ్చే ఇద్దరు రిజిస్టర్డ్ ఓటర్లకు బంపర్ ఆఫర్ ● ఒక మిలియన్ డాలర్లు(రూ.8 కోట్లు) ఇస్తున్న ప్రపంచ కుబేరుడు
● అంతర్జాతీయ మీడియా వర్గాలలో వార్తలు హల్‌చల్



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఎలాగైనా సరే డొనాల్డ్ ట్రంప్ ను గెలిపించేందుకు టెస్లా అధినేత ఎలాన్ మస్క్ విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఓటర్లను ట్రంప్‌నకు అనుకూలంగా మార్చేందుకు మస్క్ తాయిలాలు ఇస్తున్నారు. ట్రంప్‌నకు మద్దతిచ్చే వారికి రోజుకు ఒకరికి లాటరీ పద్ధతిలో 1 మిలియన్ డాలర్లు (రూ.8 కోట్లు) పంచుతానని మస్క్ ఇటీవల ప్రకటించిన విషయంపై అమెరికా న్యాయశాఖ దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించినా.. ఇవి ఫెడరల్ ఎన్నికల చట్టాల ఉల్లంఘనల కిందకు వస్తాయని హెచ్చరించినా మస్క్ వాటిని పెడచెవిన పెడుతున్నారు. ట్రంప్‌కు మద్దతిచ్చే ఇద్దరు రిజిస్టర్డ్ ఓటర్లకు, మస్క్‌కు సంబంధించిన సూపర్ ప్యాక్ సంస్థ నుంచి తాజాగా ఒక మిలియన్ డాలర్లు(రూ.8 కోట్లు) చొప్పున డబ్బు చెల్లించినట్లుగా అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొంటున్నాయి. ట్రంప్ తరఫున ప్రచార కార్యక్రమాల నిర్వహణ కోసం మస్క్ ఇటీవల మరో రూ.470 కోట్లు అందజేసినట్లుగా ఫెడరల్ ఎలక్షన్ కమిషన్ వెల్లడించింది. అంతేగాకుండా.. ట్రంప్‌నకు మద్దతిచ్చే వారికి రోజుకు 1 మిలియన్ డాలర్లు (రూ.8 కోట్లు) పంచేస్తానని మస్క్ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. ఇది చట్టవిరుద్ధమని తేలితే.. మస్క్‌కు ఐదు సంవత్సరాల జైలు శిక్ష పడొచ్చని న్యాయ నిపుణులు అంచనా వేస్తున్నారు. కాగా అమెరికా ఎన్నికల నేపథ్యంలో ముందునుంచి రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి ఆ దేశ మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రచారానికి టెస్లా అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మద్దతివ్వడమే కాకుండా పెద్ద మొత్తంలో విరాళాలు అందజేస్తున్నారు. ట్రంప్ తరఫున ప్రచార కార్యక్రమాల నిర్వహణ కోసం తాజాగా మస్క్ మరో రూ.470 కోట్లు అందజేసినట్లుగా ఫెడరల్ ఎలక్షన్ కమిషన్ వెల్లడించినట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంది. ట్రంప్ కోసం ఇప్పటివరకు ఆయన రూ.1,109 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపింది. అంతేకాకుండా ట్రంప్ తరఫున ముమ్మర ప్రచారాలు నిర్వహిస్తున్నారు. తాను అధ్యక్షుడిగా ఎన్నికైతే కేబినెట్‌లో మస్క్‌కు చోటిస్తానని ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే.

# కమలా హారిస్ ప్రచారానికి అడ్డు

● ర్యాలీకి ట్రంప్ మద్దతుదారుల అంతరాయం
● నవంబర్ 5న జరగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికలు
● ఇద్దరు అభ్యర్థుల మధ్య గట్టి పోటీ ఉందన్న మీడియా వర్గాలు
● కమలాహారిస్‌కు విజయావకాశాలు మెరుగ్గా ఉందంటురన్న సర్వేలు



వాషింగ్టన్: త్వరలో అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. దీంతో డెమోక్రాటిక్ అభ్యర్థి కమలాహారిస్ రిపబ్లికన్ అభ్యర్థి, అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పోటాపోటీగా ప్రచారాల్లో పాల్గొంటున్నారు. ప్రజల మద్దతు కూడగట్టుకోవడానికి ముమ్మరంగా పావులు కదుపుతున్నారు. కాగా తాజాగా టెక్సాస్‌లోని హ్యూస్టన్‌లో నిర్వహించిన ప్రచార ర్యాలీలో హారిస్ పాల్గొన్నారు. అయితే హ్యూస్టన్‌లో రిపబ్లికన్లు అధికంగా ఉండటంతో ఈమె ర్యాలీకి పలు ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రజలనుద్దేశించి హారిస్ ప్రసంగిస్తున్న సమయంలో ట్రంప్ మద్దతుదారులు ఆమెకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళనలు సృష్టించారు. వారి చర్యలతో ర్యాలీకి అంతరాయం కలిగించడంతో ఆమె ఆగ్రహానికి గురయ్యారు. "వీరందరినీ వీధుల్లో నిర్వహించే చిన్న చిన్న ర్యాలీలకు పంపండి. అది వారికి సరదాగా ఉంటుంది. కొందరికి పెద్దగా దిశానిర్దేశాలు ఏమీ ఉండవు" అంటూ కౌంటర్ ఇచ్చారు. దీంతో డెమోక్రాట్లు హారిస్‌కు మద్దతుగా నినాదాలు చేస్తూ ఆందోళనకారులను అక్కడినుంచి పంపేశారు. అమెరికా అధ్యక్ష ఎన్నికలు నవంబర్ 5న జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో కమలాహారిస్‌కు విజయావకాశాలు మెరుగ్గా ఉన్నట్లు వివిధ సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఎన్నికల నేపథ్యంలో ముమ్మరంగా ప్రచారాల్లో పాల్గొంటున్న అభ్యర్థులు కమలాహారిస్, ట్రంప్ తమ ప్రసంగాల్లో అమెరికాలోని.. పలు కీలక అంశాలపై భిన్న స్వరాలు వినిపిస్తున్నారు. అబార్షన్ హక్కుల నుంచి నానాటికీ పెరిగిపోతున్న తుపాకీ సంస్కృతి నిర్మూలన వరకు.. తమ ప్రసంగాల్లో పలు హామీలను ఇస్తున్నారు. కాగా ఇద్దరు అభ్యర్థుల మధ్య గట్టి పోటీ నెలకొంటున్నట్లుగా అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడిస్తున్నాయి. కాగా అమెరికాలో తాజాగా నిర్వహించిన ముందస్తు ఎన్నికల్లో దాదాపు 2.1 కోట్ల మంది ప్రజలు ఓటుహక్కును వినియోగించుకున్నట్లుగా యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడాలోని ఎలక్షన్ ల్యాబ్ వెల్లడించింది. నవంబర్ 5న దేశవ్యాప్తంగా పోలింగ్ ప్రక్రియ జరగనున్న నేపథ్యంలో ఏర్పాటుచేసిన ముందస్తు పోలింగ్ సౌకర్యాన్ని 78 లక్షల మంది వినియోగించుకోగా.. మెయిల్ బ్యాలెట్ ద్వారా మరో 1.33 కోట్ల మంది ఓటేసినట్లు ఎలక్షన్ ల్యాబ్ పేర్కొంది.

# భారత అక్రమ వలసదారులు వెనక్కి

● అమెరికాలో చట్టబద్ధమైన అనుమతి లేకుండా ఉంటున్న భారతీయులు
● నియంత్రణపై దృష్టి సారించిన యూఎస్ డిపార్ట్‌మెంట్ హోంల్యాండ్ సెక్యూరిటీ
● 22న ప్రత్యేక విమానంలో భారత్ కు పంపామని వెల్లడి ● స్మగ్లర్ల చేతిలో బందీలు కాకుండా ఉండేందుకే చర్యలు
● నైరుతి సరిహద్దుల్లో అనధికారిక వలసలు 55 శాతం తగ్గినట్లు డీహెచ్ఎస్ గుర్తింపు



వాషింగ్టన్ : అమెరికాలో అక్రమ వలసదారులను నియంత్రించాలని యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ (డీహెచ్ఎస్) ప్రయత్నిస్తుంది. ఇందులోభాగంగా తమ దేశంలో అక్రమంగా ఉంటున్న భారతీయులను వెనక్కి పంపించినట్లు డీహెచ్ఎస్ పేర్కొంది. అక్టోబరు 22న ప్రత్యేక విమానంలో వీరిని భారత్‌కు పంపినట్లు తెలిపింది. భారత ప్రభుత్వ సహకారంతోనే ఈ చర్యలు చేపట్టినట్లు అమెరికా వెల్లడించింది. 'చట్టబద్ధత లేకుండా అమెరికాలో ఉంటున్న భారతీయ పౌరులను వెనక్కి పంపాలని నిర్ణయించుకున్నాం. వలస వచ్చిన ప్రజలు స్మగ్లర్ల చేతిలో బందీలు కాకుండా ఉండేందుకే ఈ చర్యలు తీసుకుంటున్నాం' అని డీహెచ్ఎస్ సీనియర్ అధికారి క్రిస్టీ ఎ.కనెగాల్లో పేర్కొన్నారు. గత జూన్ నెలలో ది బోర్డర్ ప్రెసిడెన్షియల్ విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. అమెరికా నైరుతి సరిహద్దుల్లో అనధికారిక వలసలు 55 శాతం తగ్గినట్లు డీహెచ్ఎస్ గుర్తించింది. ఈ క్రమంలోనే 2024 ఆర్థిక సంవత్సరంలో దాదాపు 1,60,000 మంది అక్రమ వలసదారులను వెనక్కి పంపినట్లు తెలిపింది. 495కు పైగా ప్రత్యేక విమానాల్లో 145 దేశాలకు చెందిన వలసదారులను వెనక్కి పంపింది. వీరిలో భారత్‌తో పాటు కొలంబియా, ఈక్వెడార్, పెరూ, ఈజిప్ట్, మారిటానియా, సెనెగల్, ఉజ్బెకిస్థాన్, చైనా దేశాల పౌరులు ఉన్నారు. ఈ చర్యలు కఠినమైన సరిహద్దు సమస్యలను పరిష్కరించడం, అక్రమ వలసలను నియంత్రించడంతో పాటు చట్టబద్ధమైన వలసల మార్గాలను ప్రోత్సహించేందుకేనని అమెరికా వెల్లడించింది.

# ప్రపంచ ఆర్థిక వ్యవస్థ గాడిలో పడుతోంది

● గత కొన్నేళ్లుగా తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటున్నాం ● ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ : గత కొన్నేళ్లుగా తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటున్న ప్రపంచ ఆర్థికవ్యవస్థ త్వరలోనే గాడిలో పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌అన్నారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ఆర్థికశాఖ మంత్రి మీడియానుద్దేశించి ప్రసంగించారు. ప్రపంచ దేశాలు, బహుపాక్షిక ఆర్థికసంస్థల మధ్య ఆర్థిక సమన్వయం పెరుగుతున్న నేపథ్యంలో ప్రపంచ ఆర్థికవ్యవస్థకు మంచి రోజులు రానున్నాయని ఆమె పేర్కొన్నారు. "ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్, ప్రపంచబ్యాంకు సంయుక్తంగా నిర్వహించిన చర్చలతో ప్రపంచ ఆర్థికవ్యవస్థ గాడిలో పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు ప్రపంచదేశాలు భావిస్తున్నాయి. ఫండ్, కేంద్ర బ్యాంకులు, వివిధ సంస్థలు, ప్రభుత్వాలు చేసిన ప్రయత్నాల వల్ల ద్రవ్యోల్బణం కొంతమేర తగ్గింది. దీనివల్ల ప్రపంచ ఆర్థికవ్యవస్థ తిరిగి పుంజుకుంటుంది. అభివృద్ధి చెందిన దేశాల ఆర్థికవ్యవస్థల్లోనూ వృద్ధి శాతం పెరుగుతోంది. అయితే ఈ విషయంలో దేశాలన్నీ మరింత జాగ్రత్త వహించాలి. ఎందుకంటే ఆర్థికవ్యవస్థలు స్థిరంగా ఉన్నాయి కానీ, వెంటనే పుంజుకునేలా లేవు" అని నిర్మలా సీతారామన్ అన్నారు. కొవిడ్ మహమ్మారి, పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణ ప్రభావం ప్రపంచదేశాల ఆర్థిక వ్యవస్థలపై ఎక్కువగా ఉందని ఆమె పేర్కొన్నారు. కొవిడ్ సమయంలో ప్రపంచదేశాలు అధికంగా రుణాలు తీసుకోవడం వల్ల ద్రవ్యలోటుపై నియంత్రణ కోల్పోయాయని.. దానిని సహేతుకమైన సంఖ్యకు తీసుకురావడానికి సరైన చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. భారత్ ప్రపంచదేశాల నుంచి పెద్దమొత్తంలో దిగుమతులు చేసుకోవడం వల్ల దేశ ఆర్థికవ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. దేశంలో సంప్రదాయ ఉత్పత్తులు పెద్ద మొత్తంలో ఉత్పత్తి కాకపోవడం వల్ల ఎగుమతుల్లో పెరుగుదల కనిపించట్లేదని తెలిపారు. భారత్ అంతర్గత సవాళ్ల కంటే బాహ్య సవాళ్లను అధికంగా ఎదుర్కొంటోందని.. అయినా సాధ్యమైనంత వేగంగా వృద్ధి చెందడానికి ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. పెట్టుబడిదారులు భారత్‌లో పెట్టుబడులు పెట్టడానికి ముందుకువస్తే వాణిజ్య నిబంధనలను మరింత సరళీకరించడానికి ప్రయత్నిస్తామన్నారు. ప్రస్తుతం దేశంలో ఆర్థిక సంస్కరణలు జరుగుతున్నాయని, పరిస్థితులకు అనుగుణంగా ఇవి కొనసాగుతూనే ఉంటాయని వెల్లడించారు. పెట్టుబడిదారులకు మరింత ఆకర్షణీయంగా ఉండడానికి మరిన్ని చర్యలు తీసుకుంటామని నిర్మలా సీతారామన్ తెలిపారు.

# బంగ్లాదేశ్‌లో హిందువుల భారీ ర్యాలీ

**జనసంద్రమైన రహదారులు**



ఢాకా: రాజకీయ అనిశ్చితి కొనసాగుతోన్న బంగ్లాదేశ్ లో హిందువుల భారీ స్థాయిలో ర్యాలీ నిర్వహించారు. మైనార్టీల హక్కుల పరిరక్షణ కోసం వేలాదిమంది వీధుల్లోకి వచ్చారు. చటోగ్రామ్‌లో సనాతన జాగరణ్ మంచ్ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ జరిగింది. అలాగే మహ్మద్ యూనస్ సారథ్యంలోని తాత్కాలిక ప్రభుత్వం పలు డిమాండ్లు ఉంచారు. ఈ మేరకు మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ క్రమంలో తాత్కాలిక ప్రభుత్వం ముందు ఎనిమిది డిమాండ్లు ఉంచారు. వాటిని నెరవేర్చేవరకు వీధుల్లో తమ నిరసన కొనసాగుతుందని కొందరు హిందూ ఉద్యమకారులు పేర్కొన్నారు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కొద్దినెలల క్రితం బంగ్లాలో హింసాత్మక ఘర్షణలు జరిగాయి. దాంతో అప్పుడు షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ అధికారాన్ని కోల్పోయింది. హసీనా రాజీనామా చేసి, దేశాన్ని భారత్‌ను ఆశ్రయించాల్సి వచ్చింది. ఎన్నికల జరిగే వరకు యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం పాలన కొనసాగిస్తోంది. ప్రజల తరఫున పోరాటం కొత్త కాదు..

# వయనాడ్ ప్రజలకు ప్రియాంక లేఖ



వాయనాడ్ : వయనాడ్‌ఉ ప ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకా గాంధీ ఆ నియోజకవర్గ ప్రజలకు శనివారం బహిరంగ లేఖ రాశారు. ఎన్నికల్లో పోటీ చేయడం మాత్రమే తనకు కొత్త అని కానీ ప్రజల తరఫున పోరాడటం మాత్రం కొత్తేమీ కాదని తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌లో లేఖను పోస్ట్ చేశారు. 'వయనాడ్‌కు గొప్ప ప్రకృతి సౌందర్యం ఉంది. అనేక సహజ వనరులు ఇక్కడ ఉన్నాయి. వాటిని రక్షించడం, పర్యావరణాన్ని గౌరవించే మీ సంస్కృతి ఇక్కడి అభివృద్ధికి ప్రధానమైందని నమ్ముతున్నా. మీలో చాలా మందిని కలవడానికి, అందరితో మాట్లాడటానికి ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్నా' అని తెలిపారు. 'ప్రజాస్వామ్యం న్యాయం, భారత రాజ్యాంగం లో పొందుపరచబడిన విలువల కోసం పోరాటం నా జీవితంలో ముఖ్యమైంది. వయనాడ్ ప్రజల మద్దతుతో భవిష్యత్ కోసం ఈ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లడానికి నేను ఎదురు చూస్తున్నా. నవంబర్ 13న జరిగే ఉప ఎన్నికలో ఎంపీగా ఎన్నుకుంటే బంధాన్ని మరింత బలోపేతం చేసేందుకు దోహదం చేస్తుంది. ప్రజాప్రతినిధిగా తన తొలి ప్రయాణంలో వయనాడ్ ప్రజలు నా మార్గదర్శకులు, ఉపాధ్యాయులు' అని తెలిపారు. కొన్ని నెలల క్రితం రాహుల్(%=ఖుష్బ్రశ్రీ%)తో కలిసి చురమల, ముండక్కై వెళ్లిన విషయాన్ని ప్రియాంక గుర్తు చేశారు. అక్కడ కొండచరియలు విరిగిపడటంతో ప్రజలు అనుభవించిన నష్టాన్ని దగ్గరగా చూశానని తెలిపారు. అయినప్పటికీ ఆ టైంలో ప్రజలు చూపించిన ధైర్య సాహసాలు చూసి చలించి పోయానని పేర్కొన్నారు.

# ఏపీలో ఇంధన సర్దుబాటు ఛార్జీల పాపం జగన్‌దే

- గత ఐదేళ్లలో తీసుకున్న అనాలోచిత నిర్ణయాలే కారణం
- విద్యుత్ కొనుగోళ్లలో క్విడ్ ప్రోకో విధానం
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

విజయవాడ: ఏపీలో ఇంధన సర్దుబాటు ఛార్జీ (ఎఫ్‌పీపీసీఏ)ల పాపం వైకాపా అధినేత జగన్ రెడ్డిదేనని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆరోపించారు. జగన్ హయాంలోనే డిస్కంలు వసూళ్లకు అనుమతి కోరాయని తెలిపారు. వాయిదా వేస్తూ, కమిషన్ ముగిసే మూడు రోజుల ముందుగా వసూళ్లకు ఆదేశాలు ఇచ్చారన్నారు. జగన్ చేసిన పాపాలే ప్రజల మెడకు ఉరితాళ్లని దుయ్యబట్టారు. గత ఐదేళ్లలో జగన్ తీసుకున్న అనాలోచిత నిర్ణయాల కారణంగా ప్రస్తుతం ప్రజల మీద విద్యుత్ ఛార్జీల భారం పడుతోందని వెల్లడించారు.
లవిద్యుత్ ఉత్పత్తికి మారుపేరైన ఏపీ జెన్‌కోను నిర్వీర్యం చేసి.. ప్రజావసరాల కోసం అనే పేరుతో యథేచ్ఛగా ప్రైవేటు వ్యక్తుల నుంచి అధిక రేట్లకు విద్యుత్ కొనుగోళ్లు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్లలో జరిపిన విద్యుత్ కొనుగోళ్లలో జగన్ సర్కారు ఎక్కడా పారదర్శకత పాటించలేదని మంత్రి గొట్టిపాటి విమర్శించారు. విద్యుత్ కొనుగోళ్లలో క్విడ్ ప్రోకో విధానం ద్వారా వచ్చిన సొమ్మును తాడేపల్లి ప్యాలెస్‌కు తరలించారని ఆరోపించారు.
జగన్, పెద్దిరెడ్డి బొగ్గు కొనుగోళ్ల వ్యవహారం అంతా రహస్యంగానే నడిపించారన్నారు. జగన్ బరితెగింపు దోపిడీ కారణంగా గత పాలనలో 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారని మండిపడ్డారు. జగన్ చేసిన పాపాల కారణంగా ప్రస్తుతం ఏపీ ప్రజల మీద 2023-24 సంవత్సరానికి మరో రూ.11,826.42 కోట్ల భారం పడుతోందన్నారు. కూటమి ప్రభుత్వ సంక్షేమ పాలన చూసి ఓర్వలేక సాక్షి పత్రికలో తప్పుడు కథనాలను ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.







# అవినీతి చేసిన వారిపై చర్యలు

- సోషల్ మీడియాలో కాంగ్రెస్ ప్రభుత్వంపై విష ప్రచారం
- కెసిఆర్ ఎక్కడికి వెళ్లారు
- బిఆర్ఎస్‌లో ఎందుకు చేరుతారు
- కాంగ్రెస్‌లో చేరికలు ఆగలేదు
- కొండా సురేఖ అలా మాట్లాడాల్సింది కాదు
- టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ హాట్ కామెంట్స్

తెలంగాణ బ్యూరో ప్రతినిధి: సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అవినీతిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారని తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ షాకింగ్ కామెంట్స్ చేశారు. వారు చేసిన తప్పులకు కేసీఆర్, కేటీఆర్‌లను రెండు, మూడేళ్లకాదని.. పదేళ్ల జైలు శిక్ష కూడా తక్కువేనని సంచలన వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం మతలబు ఏంటి? అని ప్రశ్నించారు. అంత వ్యయం ఖర్చు చేసి ఆ ప్రాజెక్ట్ కట్టాల్సిన అవసరం ఏముచ్చిందని ప్రశ్నించారు. విద్యుత్ కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఇప్పుడు చాలా తక్కువధరకే కరెంట్ దొరుకుతుందని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. విద్యుత్ చార్జీల పెంపు ఆలోచన తమ ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. కేసీఆర్‌కు ఉన్న ఆర్థిక వెసులుబాటు తమ ప్రభుత్వానికి లేదని చెప్పారు. తెలంగాణ ఏర్పడ్డప్పుడు మిగులు బడ్జెట్‌తో ఉంది, కానీ తెలంగాణపై పదేళ్లలో రూ.8లక్షల కోట్లు కేసీఆర్ అప్పు చేశారని విమర్శించారు. ఏ పథకాన్ని తమ ప్రభుత్వం ఆపలేదు. త్వరలోనే పథకాలను గ్రౌండ్ చేస్తామని హామీ ఇచ్చారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం విడతాల వారిగా చేసిన దానికంటే.. తమ ప్రభుత్వం రుణమాఫీ ఎక్కువ చేసిందని తేల్చిచెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, కేసీఆర్ చేసిన అప్పులను ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుతాం, పథకాలను ఎగ్గొట్టాలనే ఆలోచన తమ ప్రభుత్వానికి అసలు లేదని స్పష్టం చేశారు. హైడ్రాలో ఒక్కటే పేదల ఇల్లు కూలిందని మహేష్ కుమార్ గౌడ్ తేల్చిచెప్పారు. సోషల్ మీడియాలో అనైతికంగా మా ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నారు. విచ్చలవిడిగా డబ్బు ఖర్చు పెడుతున్నారు. వారిని పట్టుకుందామంటే.. పట్టుకునే వీలు లేకుండా విదేశాల్లో ఉంటూ అకౌంట్లు నడుపుతున్నారు. బీఆర్ఎస్ పదేళ్లలో యథేచ్ఛగా చెరువుల కబ్జా జరిగింది. వయనాడులో జరిగిన విధ్వంసం తెలంగాణలో జరగకూడదనే యుద్ధప్రాతిపదికన మూసీ ప్రక్షాళన చేపట్టాం. విడతల వారిగానే మూసీ ప్రక్షాళన చేస్తున్నాం. హైడ్రాతో పేదవారికి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటాం. హైడ్రా, మూసీపై రివ్యూ చేస్తున్నాం. పేద, మధ్యతరగతి వారికి అన్యాయం కలగకుండా చర్యలు ఉంటాయి. అనుమతులు ఉన్నవాటిని వదిలేయాలి. మూసీలో మాత్రం స్వచ్ఛందంగానే కొందరు ముందుకు వచ్చారు. వారికి ఉపాధి కల్పన, మిగతా అంశాలపై మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. జీవో నెంబర్ 29పై ఎవరికి నష్టం జరగదని అధికారులు చెప్పారు. మెరిట్ లిస్ట్‌లో ఎవరికి అన్యాయం జరగడం లేదు.
జీవో నెంబర్ 29పై ఎవరు ఆందోళన చేశారో, ఎందుకు చేశారో తెలియడం లేదు" అని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. తొమ్మిది నెలలుగా, ప్రతిపక్ష నేత ఎక్కడికి పోయారు. ప్రజల సమస్యలపై కేసీఆర్ ఎందుకు బయటకు రావడం లేదు. ఆయనకు ప్రజలు ప్రతిపక్ష నేత హోదా ఇస్తే చేస్తున్నది ఏంటి. సీఎం రేవంత్‌రెడ్డి తమ్ముడు తిరుపతి రెడ్డి ఆయన ఇంటిని కూల్చమనే అధికారులకు చెప్పారు, కానీ కోర్టు డైరెక్షన్ వల్లే కూల్చలేదు. ప్రభుత్వానికి ఎవరైనా విరాళాలు ఇవ్వొచ్చు, అదాని ఇచ్చారు అంతే. ప్రతిపక్షాల రాద్ధాంతం చేయడంతో ప్రజలు ఆందోళనలో ఉన్నారు. అంతే తప్ప భవిష్యత్ తరాల కోసమే హైడ్రా, మూసీ ప్రక్షాళన. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఈ ప్రభావం ఉండదు. ఫిరాయింపులపై కోర్టుదే తుది నిర్ణయం. చేరికల విషయంలో జీవన్ రెడ్డికి వివరించిన తర్వాతే కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నాం. జీవన్ రెడ్డికి మేము, పార్టీ అండగా ఉంటుంది.పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని అనుకున్నప్పుడు స్థానికంగా కొన్ని ఇబ్బందులు తప్పవు, వాటిని సర్దుబాటు చేసుకొని ముందుకు వెళ్తాం. బీఆర్ఎస్‌లో ఏముందని చేరతారు" అని మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. కేసీఆర్ ప్రజలకు అసలు కనబడటం లేదు, ఎవరిని చూసి బీఆర్ఎస్‌లో చేరతారు. ఏ కేసును నీరుగార్చే ప్రయత్నం చేయడం లేదు. ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్, భూ ఆక్రమణలు ఇలా అన్ని కేసుల విచారణ ఉంటుంది, ఫోన్ ట్యాపింగ్ పెద్ద వ్యవహారం. కేంద్రాచట్టాలు వర్తిస్తాయి. పార్టీ మెన్ అనే నాకు అందరూ మద్దతుగా నిలుస్తున్నారు. పార్టీకి, ప్రభుత్వానికి అనుసంధానకర్తగా గాంధీ భవన్ ఉంటుంది. కేసీఆర్ చేసినట్లు మేము మోసం చేయమనే క్లారిటీతో ప్రజలున్నారు. 6 గ్యారెంటీలను తూచా తప్పకుండా అమలుచేస్తాం. డబ్బుల వెసులుబాటు లేకపోవడంతోనే కొంత ఆలస్యం జరుగుతుంది. పట్టురానిదే పథకాలు అమలు చేస్తున్నమా. మంత్రులకు స్వేచ్ఛ ఉంది" అని మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. చేరికలు ఆగలేదు. రాష్ట్ర ఆదాయం తగ్గలేదు. గతంలో ఉన్నట్లే ఇప్పుడు ఉంది. కొత్త పాత కలయికతో పార్టీలో కొత్త ఇబ్బందులు వచ్చాయి, వాటిని సర్దుబాటు చేస్తున్నాం. పార్టీలో ఉన్న నేతలను కాపాడుకునేందుకే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాతో టచ్‌లో ఉన్నారని చెప్పుకుంటున్నారు. త్వరలోనే మరిన్ని చేరికలు ఉంటాయి. కేటీఆర్‌తో సన్నిహితంగా ఇన్ అండ్ ఔట్ ఉన్నవాళ్లే కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. జీవన్ రెడ్డి అనుచరుడి హత్యపై విచారణ చేయాలని సీఎం కార్యాలయం నుంచి ఆదేశాలు ఇచ్చారు.
మంత్రివర్గ విస్తరణ అధిష్ఠానం, సీఎం చేతుల్లో ఉంది. టెక్నికల్ ఇష్యూస్ ఉన్నాయి, అందుకే చేరినట్లు అధికారికంగా ప్రకటించడం లేదు" అని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పొలిటికల్ బాంబ్‌లపై నేను ఎదురుచూస్తున్నా. కొండాసురేఖ వ్యక్తుల పేర్లు తీసుకోని మాట్లాడి ఉండకూడదు, సబబు కాదు. ఎప్పటిదో పాత ఆడియా క్లిప్ లీక్ చేశారు. ఆమెను ట్రోల్ చేసిన బాధలో, ఆక్రోశంలో ఆమె అలా మాట్లాడారు. 2029 ఎన్నికలు మాకు ఫైనల్. రాష్ట్రం, కేంద్రంలో అధికారంలోకి రావడమే లక్ష్యం. ప్రతి నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి ఉంటుంది. తీన్మార్ మల్లన్న బీసీల విషయంలో కొంత డివియేట్ అవుతున్నారు, నేను దీపాదాస్ మున్షి మాట్లాడాం. అన్ని సర్దుకుంటాయి. నెలలో కమిటీలు వేస్తాం. బీసీ కులగణనపై నవంబర్‌లో సమావేశాన్ని నిర్వహించాలని అనుకుంటున్నాం. ఆ సమావేశానికి ఏఐసీసీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ప్రత్యేక అతిథులుగా ఆహ్వానించాం. డిసెంబర్‌లో కొన్ని శుభవార్తలు వింటారు." అని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## అనంతపురం జిల్లా రోడ్డు ప్రమాదంపై

# సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధిఫ అనంతపురం జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంపై సీఎం చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శింగనమల మండలం, నాయనపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురంనకు చెందిన ఆరుగురు ఇస్కాన్ టెంపుల్ భక్తులు దుర్మరణం చెందడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబాలకు సీఎం ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## నందిగం సురేష్, బోరుగడ్డపై

# మరో హత్యాయత్నం కేసు

- బీజేపీ జాతీయ కార్యదర్శి, ప్రస్తుత మంత్రి సత్యకుమార్‌పై దాడి చేసిన సంఘటన
- బిత్తరపోతున్న వైసీపీ నాయకులు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కొందరు వైసీపీ నాయకులకు చుక్కలు కనపడుతున్నాయి. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులను అమ్మనా బూతులు తిట్టిన నాయకులు ఇప్పుడు కేసుల భయంతో హడలిపోతున్నారు. ఇంకా కొందరు వైసీపీ నాయకులు ఆ పార్టీ కార్యకర్తలను రెచ్చగొట్టి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల మీద దాడులు చేయించారు. తెలుగేదేశం పార్టీ ప్రధాన కార్యాలయంపై జరిగిన దాడి కేసులో ఇప్పటికే కొందరు నాయకులు అరెస్టు అయ్యారు. ఇంకా కొంత మంది వైసీపీ నాయకులు కోర్టును ఆశ్రయించి ముందస్తు బెయిల్ తీసుకుని పోలీసుల ముందు విచారణకు హాజరు అవుతున్నారు. **ఇవన్నీ టీడీపీ లెక్కలు:** టీడీపీతో పెట్టుకున్నందుకు మాజీ ఎంపీ నందిగం సురేష్, బోరుగడ్డ అనిల్ తో పాటు కొందరు వైసీపీ నాయకులు జైల్లో ఉన్నారు. ఇప్పుడు బీజేపీ నాయకుల వంతు వచ్చింది. బీజేపీ జాతీయ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ లో బీజేపీ తరపున ఉన్నఏకైక మంత్రి సత్యకుమార్ పై దాడి జరిగిన కేసులో వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేష్, బోరుగడ్డ అనిల్ పై హత్యాయత్నం కేసు నమోదు అయ్యింది.
**సత్యకుమార్‌పై దాడి :** ఇప్పటికే అరెస్టు అయిన నందిగం సురేష్, బోరుగడ్డ అనిల్ పై హత్యాయత్నం కేసులు నమోదు కావడంతో వైసీపీ నాయకులు బిత్తరపోయారు. 2023లో మూడు రాజధానుల శిబిరం దగ్గరకు వెళ్లిన బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ వారికి సాంఘీభావం తెలిపారు ఆ సందర్భంలో అప్పటి సీఎం జగన్ తో పాటు వైసీపీని విమర్శించిన సత్యకుమార్ రాజధాని రైతులకు ధైర్యం చెప్పి ఆ శిబిరం నుంచి బయలుదేరారు. ఆ సందర్భంలో వైసీపీ కార్యకర్తలు సత్యకుమార్ పై దాడులు చేశారు. ఈ దాడుల్లో కొందరు బీజేపీ కార్యకర్తలు గాయపడ్డారు. ఆ సందర్భంలోనే సత్యకుమార్ పై దాడి చేసిన 25 మంది మీద పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పట్లో ఆంధ్రప్రదేశ్ లో వైసీపీ అధికారంలో ఉండటం, వైసీపీ నాయకుల మీద ఫిర్యాదులు చెయ్యడంతో పోలీసులు ఆ కేసులో ఏమీ చెయ్యలేకపోయారని ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఉండటంతో పాత కేసులో విచారణ వేగవంతం అయ్యింది. బీజేపీ నాయకుడు, ప్రస్తుత మంత్రి సత్యకుమార్ పై దాడి జరిగిన కేసులో ఏ1 నిందితుడు నందిగం సురేష్, ఏ2 నిందితుడు బోరుగడ్డ అనిల్ అని ఇద్దరి మీద పోలీసులు హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. ఇద్దరు నాయకులు బెయిల్ మీద బయటకు వస్తే వారిని సత్యకుమార్ పై హత్యాయత్నం జరిగిన కేసులో అరెస్టు చేసే అవకాశం ఉందని తెలిసింది.

# ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్

## బంగారం, ద్విచక్ర వాహనం రికవరీ





సిద్దవటం, మేజర్ న్యూస్ : ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి బంగారు, నగదు రికవరీ చేసినట్లు సిద్ధవటం సబ్ ఇన్స్పెక్టర్ చిరంజీవి తెలిపారు. మండలకేంద్రమైన సిద్దవటం స్థానిక పోలీస్ స్టేషన్ లో శనివారం ఆయన మాట్లాడుతూ 25వ తేదీ, మధ్యాహ్నం సమాచారం రావడంతో సిద్ధవటం, భాకరాపేట రోడ్డు మార్గాన, వాహన తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. సాయంత్రం 4 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు మోటార్ సైకిల్ పై వస్తూ మమ్మల్ని చూసి వారు పారిపోవుటకు ప్రయత్నించగా వారిని చుట్టిముట్టి పట్టుకుని విచారణ చేశామన్నారు. వైఎస్ఆర్ జిల్లా ప్రస్తుతం బద్వేల్ టౌన్ కుమ్మరి కొట్టాలు, గుంతపల్లిలో నివాసం ఉంటున్న అట్లూరు మండలం, చలంగారిపల్లి గ్రామానికి చెందిన గుమ్మాల వెంకట సుబ్బయ్య, ప్రస్తుతం కడప నగరం తిలక్ నగర్, జగనన్న కాలనీ నివాసముంటున్న అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం అత్తిరాల గ్రామానికి చెందిన గొర్ల కుమార్ అలియాస్ అమర్ రాజ్ కుమార్ అని సిద్దవటం పోలీస్ స్టేషన్ పరిధిలో క్రైం నెంబర్ 63/2024 అండర్ సెక్షన్ 457-380 ఐపీసీ కేసులో మాధవరం గ్రామంలో జరిగిన రాత్రిపూట ఇంటి కన్నం నేరములో ముద్దాయిలుగా గుర్తించామన్నారు. అలాగే విచారణలో ఈ ఏడాది ఆగష్టు 19 వ తేదీన 1) సుండుపల్లె పోలీస్ స్టేషన్ పరిధిలో క్రైం నెంబర్ 82 /2024 అండర్ సెక్షన్ 331(4), 305 బిఎన్ఎస్ గా కేసు, ఆగష్టు 20 వ తేదీన 2) సుండుపల్లె పోలీస్ స్టేషన్ పరిధిలో క్రైం నెంబర్ 83 /2024 అండర్ సెక్షన్ 331(4), 305 బిఎన్ఎస్ గా కేసు, సెప్టెంబర్ 1 వ తేదీన 3) సుండుపల్లె పోలీస్ స్టేషన్ పరిధిలో క్రైం నెంబర్ 94 /2024 331(4), 305 బిఎన్ఎస్ గా కేసు, సెప్టెంబర్ 30 వ తేదీన 4) ఓ.డీ చేరవు పోలీస్ స్టేషన్ పరిధిలో క్రైం నెంబర్ 120 /2024 అండర్ సెక్షన్ 331(4), 305 బిఎన్ఎస్ గా కేసు, అక్టోబర్ 11వ తేదీన 5) కలువోయి పోలీస్ స్టేషన్ పరిధిలో క్రైం నెంబర్ 89 /2024 అండర్ సెక్షన్ 331(4), 305 బిఎన్ఎస్ గా కేసు, అక్టోబర్ 17 వ తేదీన 6) కలువోయి పోలీస్ స్టేషన్ పరిధిలో క్రైం నెంబర్ 88 /2024 331(4), 305 బిఎన్ఎస్‌గా కేసు.
అక్టోబర్ 18 వ తేదీన 7) పొదలకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో క్రైం నెంబర్ 109/2024 అండర్ సెక్షన్ 331(4), 305 రెడ్ విత్ 32 బిఎన్ఎస్ గా కేసులలో కూడా దొంగతనాలలో పాల్గొన్నట్టు వారు స్వతహాగా ఒప్పుకోవడం జరిగిందన్నారు. వారి నుంచి సిద్ధవటం, కలవాయి, ఓడిసి కేసులలో వారి వద్ద నుంచి 96 గ్రాముల బంగారు ఆభరణములు, ముక్కుపుడకలు స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటి విలువ సుమారు రూ.6 లక్షల 72 వేలు ఉంటుందన్నారు. మరియు ఏపీ 26 బీసీ 7988 నెంబర్ గల అపాచి మోటార్ సైకిల్ రికవరీ చేసుకుని తదుపరి కేసులలో రికవరీ నిమిత్తం సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్ లకు తెలపడం జరిగిందన్నారు. పట్టుబడిన ముద్దాయిలను సిద్ధపటం కోర్టులో హాజరచడం జరిగిందన్నారు. గతంలో కూడా వీరిద్దరు నేరస్తులపై కడప జిల్లా, అన్నమయ్య జిల్లా, తిరుపతి జిల్లా, నెల్లూరు జిల్లా, అనంతపురం జిల్లాలలో మొదలగు చోట్ల కేసులు ఉండి పోలీసులు అరెస్టు చేయడం జరిగిందన్నారు.
మొదటి ముద్దాయి వెంకటసుబ్బయ్య ఎర్రచదనం దొంగతనం కేసులలో అనేకసార్లు పట్టుబడి అతనిపై పీడీ యాక్ట్ కూడా మోపబడి జైలు శిక్ష వేయడం జరిగిందన్నారు. రెండవ ముద్దాయి గొర్ల కుమార్ అలియాస్ అమర్ రాజ్ కుమార్ నెల్లూరు, విజయవాడ, తూర్పు గోదావరి, తిరుపతి, ప్రకాశం, మైదుకూరు తదితర ప్రాంతాలలో సుమారు 25 దొంగతనం కేసులలో ముద్దాయిగా ఉన్నాడన్నారు. సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ కేసులో ఇతనికి శిక్ష పడినట్లు సిద్ధవటం ఎస్ఐ తెలిపారు.

# ఎస్వీ గోశాలను తనిఖీ చేసిన టీటీడీ ఈవో



తిరుపతి : తిరుపతిలోని వేంకటేశ్వర గోశాలను టీటీడీ ఈవో జె.శ్యామలరావు , జేఈవో గౌతమి శనివారం సాయంత్రం తనిఖీ చేశారు. నెయ్యి ప్లాంటు , సెంటర్ ఫర్ ఎక్సలెన్స్, దాణా మిక్సింగ్ యూనిట్, అగరబత్తిల యూనిట్ లో చేపట్టిన ప్రాజెక్టులను పరిశీలించి నాణ్యత మెరుగుపరిచేందుకు సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. అంతకుముందుఈవో ఛాంబర్‌లో గో సంరక్షణ శాల డైరెక్టర్ డాక్టర్ హరినాథ రెడ్డి గోశాల కార్యాకలాపాల పై వివరంగా పీపీటీ ఇచ్చారు. మొత్తం ఐదు గోశాలలోని పశువుల సంఖ్య, దాణా మిక్సింగ్ ప్లాంటు , అగరబత్తిల యూనిట్, నెయ్యి ట్యాంకర్లు, గుడికో గోమాత వంటి కార్యాకలాపాలను ఈవో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో సీఈ సత్య నారాయణ, ఎస్ఈలు జగదీశ్వర్ రెడ్డి, మనోహరం, వెంకటేశ్వరులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**ఎస్వీ మ్యూజియం అభివృద్ధి పనులు పరిశీలన...**

తిరుమల లోని ఎస్వీ మ్యూజియంలో జరుగుతున్న అభివృద్ధి పనులను టీటీడీ అడిషనల్ ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి శనివారం పరిశీలించారు. పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో ఆరా తీశారు. వేగవంతంగా పనులు పూర్తి చేసి మ్యూజియాన్ని భక్తుల సందర్శనకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

# రాజకీయాల నుంచి ఆర్కే ఔట్?

- వైసిపి నుంచి మళ్లీ దూరం దూరంగా..
- పార్టీకి రాజీనామా చేశారంటూ పుకార్లు

మంగళగిరి: ఆయన వైసీపీలో సంచలన విజయాన్ని నమోదు చేసుకోవడమే కాదు రాష్ట్ర రాజకీయాల్లో ఒక వెలుగు వెలిగారు. ఎన్నికల ముందు వైసీపీ నుంచి బయటికి వెళ్లిన ఆయన్ని జగన్ పిలిచి మరీ మళ్లీ పార్టీలో చేర్చుకున్నారు. మళ్లీ పార్టీలోకి రావటంతో ఆయన వర్గం అంతా తమ నేత ఇక దూకుడుగా వెళ్తారు అనుకున్నారు. కట్ చేస్తే ఆయన ఎక్కడున్నారో తెలియకుండా పోయిందిప్పుడు. ఆయన వెన్నంట నేతలకు సైతం ఆయన అడ్రస్ తెలియడం లేదంట. రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఆ లీడర్ సడన్‌గా పొలిటికల్ స్క్రీన్ మీద నుంచి మాయమవ్వడంపై పెద్ద చర్చే జరుగుతుందిప్పుడు. ఇంతకీ ఎవరా లీడర్ అంటారా? ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2019 ఎన్నికల్లో వైసీపీ ఒక్క అసెంబ్లీ సీటు తప్ప మిగిలిన అన్నీ కైవసం చేసుకుంది. అన్ని నియోజకవర్గాల్లో గెలుపేమో కానీ మంగళగిరి నియోజకవర్గంలో వైసీపీ గెలుపు పెద్ద సంచలనమే రేపింది. అక్కడ విజయంపై వైసీపీ శ్రేణులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నాయి. దానికి కారణం టీడీపీ అధినేత చంద్రబాబు తనయుడు నారా లోకేష్ టీడీపీ నుంచి బరిలో నిలవగా వైసీపీ నుంచి అల్లా రామకృష్ణారెడ్డి బరిలో నిలిచారు. లోకేష్ పై అల్లా రామకృష్ణారెడ్డి విజయం సాధించి అందరి దృష్టిని ఆకర్షించారు. ఆ తర్వాత మంగళగిరి ఎమ్మెల్యేగానే కాదు రాష్ట్రస్థాయిలో ముఖ్య నేతల్లో ఒకరిగా ఆళ్ల రామకృష్ణారెడ్డి వెలుగొందారు. అమరావతి ప్రాంతానికి చెందిన ఎమ్మెల్యే అయినప్పటికీ, అప్పటి ప్రభుత్వం మూడు రాజధానుల నినాదానికి అనుగుణంగా వాయిస్ వినిపించిన ఆర్కే. పలు అంశాలపై కోర్టుకెక్కుతూ నిత్యం వార్తల్లో నిలిచారు. ఒకరకంగా చెప్పాలంటే రాష్ట్ర రాజకీయాల్లోనే ఆళ్ల రామకృష్ణారెడ్డి అంటే అందరికీ తెలిసేలాగా ఆయన పార్టీలో దూకుడుగా ముందుకు వెళ్లారు. ఆ క్రమంలో నియోజవర్గం పరిస్థితి ఏమో గాని పార్టీలో మాత్రం కీలక నేతగా ఎదుగుతాడని అందరూ భావించారు.
అయితే ఎన్నికల ముందు బీసీ మంత్రం ఎత్తుకున్న వైసీపీ అధ్యక్షుడు జగన్ మంగళగిరి ఇన్చార్జ్‌గా చేనేత వర్గానికి చెందిన గంజి చిరంజీవిని ఇన్చార్జ్‌గా ప్రకటించారు. అప్పట్లో మంగళగిరి ప్రాంతంలో ఆర్కే తన బినామీ కాంట్రాక్టర్లలో పలు అభివృద్ధి పనులు చేయించారంటారు. ఆ పనులకు సంబంధించి ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదని.. కోట్ల రూపాయల్లో ఆ బిల్లులపై ఆర్కే బెంగ పెట్టుకున్నారని ప్రచారం జరిగింది. ఆ క్రమంలో అప్పటికి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఆర్కే(%కూశ్రీశ్రీఖ =ఖఖనేతీఅంప్తఖ =వ౦౦౮%) వైసీపీకి రిజైన్ చేసి కాంగ్రెస్‌లో చేరారు. కొన్ని రోజులు పీసీసీ అధ్యక్షురాలు షర్మిల వెంట తిరుగుతూ హడావుడి చేశారు. దాంతో ఆళ్ల రామకృష్ణారెడ్డి కాంగ్రెస్లో కూడా కీలక నేతగా ఉండి తప్పకుండా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీని ముందుకు నడిపించడంలో కీలకంగా వ్యవహరిస్తారని అందరూ ఊహించారు.
అయితే ఎన్నికలకు కొన్ని రోజుల ముందు మళ్ళీ కాంగ్రెస్ పార్టీలో నుండి వైసీపీలోకి వచ్చేశారు. జగన్ ఆయన ఆర్థిక లెక్కలు తేల్చి వెనక్కి పిలిపించుకున్నారని అప్పట్లో ప్రచారం జరిగింది. ఎన్నికల్లో తనకు టికెట్ లేకపోయినా వైసీపీ విజయానికి కృషి చేస్తానని ప్రకటించినప్పటికీ ప్రచారంలో కూడా ఆయన పెద్దగా కనిపించలేదు. ఇక వైసిపి ఘోరాపరాజయం తర్వాత ఆళ్ల రామకృష్ణారెడ్డి అసలు కనిపించడమే మానేశారు. అయన రాజకీయాలకు ఎంత దూరమయ్యారంటే మంగళగిరి వైసీపీ నేతలు కూడా రెండు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన ఆయన్ని గుర్తు చేసుకోవడం మానేశారు. అయితే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఒక వైసీపీకే కాదు రాజకీయాలకి కూడా దూరంగా ఉన్నారని క్లియర్‌గా కనిపిస్తుంది. మరి అది తాత్కాలికమా? లేకపోతే శాశ్వతమా? కాని ఆర్కే పొలిటికల్ రిటైర్‌మెంట్ తీసుకున్నట్లే కనిపిస్తుంది.

# పోలీసు, పొలిటికల్ వర్గాల్లో సంచలనంగా మారిన అజ్ఞాత వ్యక్తి లేఖ

తెలంగాణ బ్యూరో, ప్రతిని: వరంగల్‌లో ఓ బాలికపై సీఐ అత్యాచారానికి యత్నించిన ఘటన రాష్ట్రంలో పెనుదుమారాన్ని రేపింది. సీఐ తీరుపట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రక్షించాల్సిన పోలీసులే ఇలా కాటేస్తుంటే ఎలా అంటూ ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఓ వైపు సీఐ ఘటన పోలీసులకు కలంకాన్ని అంటగట్టగా.. తాజాగా ఖాకీలను ఉద్దేశిస్తూ ఓ అజ్ఞాత వక్తి రాసిన లేఖ పోలీసు వర్గాలతో పాటు పొలిటికల్ వర్గాల్లోనూ తీవ్ర గుబులును రేపుతోంది. వరంగల్‌లో సీఐ రవికుమార్‌పై ఫోక్సో కేసు నేపథ్యాన్ని ఉటంకిస్తూ రాసిన లేఖ ప్రస్తుతం వైరల్‌గా మారింది. లేఖలో పోలీసులకు సంబంధించి అనేక ముఖ్య విషయాలు బయటపెట్టాడు సదరు వ్యక్తి. 2004 బ్యాచ్‌కు చెందిన పోలీసు అధికారులు ముఠాగా ఏర్పడి అక్రమాలకు పాల్పడుతున్నారని... ఏకంగా ఓ నిధిని ఏర్పాటు చేసి ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా 2004 బ్యాచ్ వాళ్లే లా అండ్ ఆర్డర్ పోస్టింగుల్లో ఉండాలని నిర్ణయించుకున్నారని తెలిపారు. అందుకోసం తమ నిధి నుంచి ప్రజాప్రతినిధులకు ఎంతైనా చెల్లిస్తారని ఆరోపణలు గుప్పించారు. 10 నుంచి 50 కోట్ల ఆస్తులు కూడబెట్టారంటూ ఆకాశరామన్న ఉత్తరం రాశాడు. ఎనిమిదేళ్లుగా జరిగిన పోస్టింగుల వివరాలు సేకరిస్తే అంతా బయటపడుతుందంటూ అజ్ఞాత వ్యక్తి లేఖలో పేర్కొన్నాడు. ప్రస్తుతం ఈ లేఖ పోలీసు, పొలిటికల్ వర్గాల్లో సంచలనంగా మారింది.

**కూతురి స్నేహితురాలిపై కన్నేసి...**


కాగా.. వరంగల్‌లో ఇటీవల చోటు చేసుకున్న రెండు ఘటనలు సంచలనంగా మారాయి. మహిళలను, చిన్నారులను రక్షించాల్సిన పోలీసులే వారిపై అఘాయిత్యానికి పాల్పడ్డారు. వరంగల్‌లో మహిళలు, చిన్నారుల పట్ల పోలీసులు అసభ్యంగా ప్రవర్తించిన ఘటనలు సంచలనం రేపాయి. హన్మకొండ జిల్లా ఖాజీపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసం ఉండే సీఐ రవికుమార్.. ఓ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఆయన నివాసం ఉంటున్న అపార్ట్‌మెంట్‌లో కూతురి స్నేహితులిపై కన్నేసిన సీఐ.. బాలిక ఒంటరిగా ఉన్న సమయంలో లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. దీంతో సీఐ నుంచి తప్పించుకున్న బాలిక.. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేసింది. ఈ ఘటన ఈనెల 9న జరిగినప్పటికీ బాధితులు ఈనెల 22న ఖాజీపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ రవికుమార్‌పై ఫోక్సో కేసు నమోదు అయ్యింది.

**తల్లితో సన్నిహిత్యం..ఆపై కూతురిపై కూడా...**

అలాగే కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో గతంలో ఎస్సైగా పనిచేసి తర్వాత సీఐగా పదోన్నతి పొందిన సంపత్ కుమార్‌పై ఇటీవల ఫోక్సో చట్టం కింద కేసు నమోదు అయ్యింది. కేయూలో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న సమయంలో ఆయన తన స్టేషన్ పరిధిలో ఓ మహిళతో సన్నిహిత సంబంధాలు నడిపినట్లు సమాచారం. ఈ విషయంపై సదరు మహిళ భర్త వెళ్లి పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా.. సంపత్ కుమార్‌ను ఏఆర్‌కు అటాచ్ చేశారు. ఆపై సీఐగా పదోన్నతి పొంది ఖమ్మం జిల్లాకు అటు నుంచి భూపాలపల్లి జిల్లాకు బదిలీపై వెళ్లినా కూడా మహిళతో సన్నిహిత సంబంధం కొనసాగించినట్లు తెలుస్తోంది. ఇదే క్రమంలో సదరు మహిళ కన్న కూతురిపై కన్నేసిన పోలీసు అధికారి లైంగిక దాడికి యత్నించినట్లు కేయూ పీఎస్‌లో బాలిక తల్లి ఫిర్యాదు చేసింది. దీంతో సీఐ సంపత్ కుమార్‌పై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ రెండు ఘటనలు వరంగల్ వ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించాయి.

## ఉధృతమవుతున్న

# బీసీల రాజ్యాధికార ఉద్యమం



- బలమైన క్షేత్ర స్థాయి నాయకత్వంతోనే గ్రామస్వరాజ్యం
- కొనసాగుతున్న ఉత్తర తెలంగాణ వ్యాప్త కమిటీల నిర్మాణం
- త్వరలో ఉత్తర తెలంగాణ వ్యాప్త భారీ బీసీ బహిరంగసభ
- అతిథులుగా జాతీయస్థాయి నాయకులు
- బీసీల రాజకీయ చైతన్యాన్ని ఢిల్లీ కోటకు వినిపిస్తాం
- మాపై కొనసాగుతున్న వివక్షతను బహిరంగంగా వ్యక్తపరుస్తాం
- బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు అధ్యక్షులు దాసు సురేశ్

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: బ్రాహ్మణుల నుండి రాజ్యాధికారాన్ని రెడ్డిలు లాక్కున్నారని తమ తర్వాత బీసీలు రాజ్యాధికారాన్ని చేపట్టడం తథ్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమకు గతంలో చెప్పిన మాటలు బీసీల రాజ్యాధికార ఉద్యమానికి స్ఫూర్తిదాయకమని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేష్ తెలిపారు.. శనివారం హనుమకొండ జిల్లాలోని ఎర్రగట్టు గుట్ట వద్ద గల బిసి రాజ్యాధికార సమితి ప్రాంతీయ కార్యాలయంలో హనుమకొండ జిల్లా అధ్యక్షులు గాజు యుగంధర్ యాదవ్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన బీసీ నాయకత్వ శిక్షణ మరియు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్త కమిటీల నిర్మాణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేశ్ నూతనంగా నియామకం అయిన మండల , నియోజకవర్గ స్థాయి నాయకులకు నియామక పత్రాలు అందజేశారు.. త్వరలో నిర్వహించబోయే ఉత్తర తెలంగాణ వ్యాప్త భారీ బహిరంగ సభను విజయవంతంగా నిర్వహించడానికి అవసరమైన దిశా నిర్దేశం చేశారు.బీసీల రాజకీయ ఎదుగుదల ఆవశ్యకతను నాయకులకు వివరించారు. తదనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దాసు సురేష్ మాట్లాడుతూ గతంలో రేవంత్ రెడ్డి సూచించిన బీసీలకు రాజ్యాధికారం బలమైన క్షేత్రస్థాయి నాయకత్వం నిర్మాణంతోనే సాధ్యమవుతుందనీ అందువల్లనే తాము క్షేత్రస్థాయి నిర్మాణంపై దృష్టి పెట్టామన్నారు.. బీసీల నాయకత్వ నిర్మాణంలో భాగంగా బీసీల ఓటును, నోటును బయటకు పోనీయకుండా కట్టడి చేసే దిశగా భవిష్యత్తు కార్యాచరణ ఉంటుందని తెలిపారు.. త్వరలోనే ఉత్తర తెలంగాణ వ్యాప్తంగా భారీ బహిరంగ సభను నిర్వహించనున్నామని ఈ సమావేశానికి భారతదేశ ప్రముఖ బీసీ నాయకులను ఆహ్వానిస్తామన్నారు.. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, సమాజ్ వాదీ పార్టీ జాతీయ అధ్యక్షులు అఖిలేష్ యాదవ్, ఆర్జెడి ముఖ్యనేత తేజస్వి యాదవ్, బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ లను ఆహ్వానించే యోచనలో ఉన్నామని దాసు సురేష్ తెలిపారు.
ప్రస్తుత దేశ రాజకీయాలు బీసీల చుట్టే తిరుగుతున్నాయనీ, ప్రధాన రాజకీయ పార్టీలు అన్ని బీసీల ఓట్లపైనే ఆధారపడేలా తమ భవిష్యత్ ఉద్యమాన్ని నిర్మిస్తామన్నారు.. కాంగ్రెస్ పార్టీ చేపట్టనున్న తెలంగాణ వ్యాప్త కులగణనను తాము స్వాగతిస్తున్నామనీ, ఇదే తరుణంలో బీసీలు కేవలం 42 శాతం రిజర్వేషన్లకు పరిమితం కాకుండా బీసీల లెక్క మేరకు 54 శాతం రాజకీయ వాటాను సాధిస్తామన్నారు. తమిళనాడు తరహాలో బీసీల రిజర్వేషన్లను తెలంగాణ ప్రభుత్వం పెంచడంతోపాటు, పెంచిన కోటాను చట్టబద్ధం చేసే విధంగా అవసరమైన రాజ్యాంగ సవరణను కేంద్ర ప్రభుత్వంపై రాజకీయ ఒత్తిడి కలుగజేయడం ద్వారా షెడ్యూల్ 9 లో చేర్చి బీసీల పట్ల తమ నిబద్ధత నిరూపించుకోవాలన్నారు.. తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులకు బకాయి పడ్డ ?7850 కోట్ల రూపాయలను ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలన్నారు. పాఠశాలల దీనావస్థను దూరం చేయాలన్నారు.. గురుకులాలకు సొంత భవనాలను నిర్మించాలన్నారు.. రిటర్న్ ఆన్ ఇన్వెస్ట్మెంట్,బిజినెస్ వాల్యూ లేని మూసి ప్రక్షాళనను తాత్కాలికంగా నిలుపుదల చేసి పేరరుకుపోయిన విద్యార్థుల,నిరుద్యోగుల,ప్రభుత్వ ఉద్యోగుల,పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల వల్ల బిసి, ఎస్సీ ఎస్టీ విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని జనరల్ కోటలో (50 శాతం నందు) ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 10 శాతం ఇవ్వాల్సి ఉండగా మొత్తం 100% సీట్లలో 10 శాతాన్ని కేటాయించడం చట్ట విరుద్ధమని, ప్రభుత్వం తెలంగాణలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను రద్దు చేయడంతో పాటు దొడ్డి దారిన ప్రవేశపెట్టిన జీవో నెంబర్ 29ను రద్దు చేయాలని కోరారు..త్వరలోనే పూర్తిస్థాయి తెలంగాణ వ్యాప్త కమిటీలను నిర్మాణం చేసి దిక్కులు పేక్కటిల్లేలా గల్లి నుండి ఢిల్లీ వరకు తమ సింహగర్జనను వినిపిస్తామన్నారు.
ఈ కార్యక్రమంలో బిసి రాజ్యాధికార సమితి రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు ఏరుకొండ హైమావతి , సీనియర్ మహిళా నాయకురాలు కత్తుల కవిత , ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జ్ ముంజాల రాజేందర్ , గౌరవ అధ్యక్షులు జూలూరు రమేష్ గౌడ్ ,మహబూబాద్ జిల్లా అధ్యక్షులు గండి వీరేందర్ గౌడ్ , హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ప్రసాద్ , వర్కింగ్ ప్రెసిడెంట్ గుండా చందు, కార్యదర్శి కల్లెబోయిన సురేందర్ , యూత్ అధ్యక్షులు రావుల శ్రీకాంత్ , హనుమకొండ జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఆరేపల్లి రాజు , పంజాల రాకేష్ , జగన్ , రవి , మార్గరాజు , సంపత్ , హరీష్ , కొడాలి రాజు , సముద్రాల లింగమూర్తి , ఇప్ప కిరణ్ , కేయూ జేఏసీ నాయకులు వీరబోయిన తిరుపతి తదితరులు పాల్గొన్నారు.





## అధ్యక్ష స్థానం

# నీదా? నాదా?

**వాల్ స్ట్రీట్ జర్నల్ సర్వేలో పోటా పోటీ**
**ఎవరికి వారే తగ్గేది లేదంటున్న ట్రంప్ - కమలా హారీస్**


**అమెరికా అధ్యక్ష ఎన్నికలకు సమయం దగ్గర పడుతుంది. ఎన్నికల్లో గెలుపు ఎవరిది? అనే దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఇద్దరు అభ్యర్థులు విజయం కోసం ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఈ క్రమంలోనే ఒకరిపై మరొకరు తీవ్ర విమర్శలు చేసుకుంటూ సపోర్టు కూడగట్టుకుంటూ ముందుకు వెళ్తున్నారు. మరోవైపు, ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపుపై పలు సర్వేలు ఆసక్తి రేపుతున్నాయి. ఇక, అగ్ర రాజ్యం అమెరికాలో నవంబర్ 5న అధ్యక్ష ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ నేపథ్యంలో డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారీస్, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ మధ్య పోటీపై వాల్ స్ట్రీట్ జర్నల్ చేపట్టిన సర్వేలో కీలక విషయాలను తెలిపింది. వీరిద్దరి మధ్య స్వల్ప తేడాతో పోటీ నడుస్తుంది. తాజా సర్వే ప్రకారం.. డొనాల్డ్ ట్రంప్‌కు 47 శాతం, హారీస్‌కు 45 శాతం మంది ఆదరణ లభించినట్లు తెలిపింది. సర్వే మార్జిన్ ప్లస్ లేదా మైనస్ 2.5 శాతం ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. మరిన్ని వివరాలలోకి వెళితే...**



అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారం తుది దశకు చేరుకోవడం ఇద్దరు అభ్యర్థులు ఒకరిపై మరోకరు విరుచుకుపడుతున్నారు. డొనాల్డ్ ట్రంప్ అసమర్థుడని, అధ్యక్ష పదవికి కరెక్ట్ కాదు.. ఆయనో నియంత అని కమలా హారిస్ తీవ్ర ఆరోపణలు చేయగా.. మరోవైపు డొనాల్డ్ ట్రంప్ కౌంటరిచ్చారు. తాజాగా యూఎస్ ఉపాధ్యక్షురాలు, డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్‌పై రిపబ్లికన్ అభ్యర్థి, ట్రంప్ మరోసారి వ్యక్తిగత విమర్శలు చేశారు. ఆమె అధికారంలోకి వస్తే డ్రాగ^న్ కంట్రీ చైనా చెడుగుడు ఆడేస్తుందని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఒక వేళ కమలా హారీస్ గెలిస్తే.. అమెరికాలో చైనా చెడుగుడు ఆడుకుంటుం ది అన్నారు. ఆమెను చిన్న పిల్లను చేసి డ్రాగన్ కంట్రీ జిన్‌పింగ్ గేమ్ ఆడుకుంటారని ట్రంప్ సెటైర్లు వేశారు. ఓటర్లను ఆకట్టుకోవడం కోసం హామీలతో పాటు పరస్పర విమర్శలు చేస్తూ.. ప్రచారంలో దూసుకుపో తున్నారు. అమెరికా ఎన్నికలకు ముహూర్తం దగ్గర పడింది.నవంబరు 5న ఎన్నికలు జరగనుండటంతో.. రిపబ్లికన్ పార్టీ తరపున మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, డెమోక్రటిక్ పార్టీ తరపున ప్రస్తుత ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ హెూరాహెూరీగా పోటీ పడుతున్నారు. అయితే అమెరికా అధ్యక్ష ఎన్నికల వేళ.. ట్రంప్ అధ్యక్షుడైతే ఇండియాకు మంచిదా? భారతీయ మూలాలు ఉన్న హారిస్ అధ్యక్షురాలైతే భారత్‌కు మేలా? అనే ఆసక్తికర చర్చ భారతీయులతో పాటు ప్రవాస భారతీయుల్లో జరుగుతుంది.

## ఎవరు గెలిచినా సరే

డొనాల్డ్ ట్రంప్ గెలిచినా, కమలా హారిస్ గెలిచినా.. చైనాతో మాత్రం భారత్ కొంత దూకుడుగానే వ్యవహరించవచ్చు. భారత్‌లో సెమీకండక్టర్ ఫాబ్రికేషన్ కేంద్రం ఏర్పాటుకు, 6జీ మొబైల్ సాంకేతికత, ఏఐ, క్వాంటమ్ టెక్నాలజీ, అంతరిక్ష, సెమీకండక్టర్ వంటి అధునాతన సాంకేతికతలపై కలిసి పని చేయడానికి భారత్, అమెరికా ఇటీవలే ఒప్పందాలు కూడా కుదుర్చుకున్నాయి. సాంకేతిక రంగంలో చైనా ఆధిపత్యాన్ని తగ్గించడానికి ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు బైడెన్ ప్రయత్నించారు. ఈ ఎన్నికల్లో ఎవరు గెలిచినా కూడా బైడెన్ పాటించిన విధానాలను కొనసాగిస్తారు కాబట్టి ఇది పరోక్షంగా భారత్‌కు మేలు కలిగిస్తుంది.



## భారత్‌తో సంబంధాలకు బలమే

కాగా కొన్ని దశాబ్దాలుగా అమెరికా అధ్యక్షుడిగా ఎవరున్నా, అధ్యక్షుడు రిపబ్లికన్ అయినా, డెమోక్రట్ అయినా సరే భారతదేశంతో మాత్రం సంబంధాలు బలపడుతూనే ఉన్నాయి. ఇప్పుడు ఈ ఎన్నికల్లో ట్రంప్ గెలిచినా, కమల హారిస్ గెలిచినా ఇదే కొనసాగొచ్చు. అయితే, ట్రంప్‌తో ప్రధాని మోదీకి మంచి సంబంధాలు ఉన్నాయి. అలా చూసుకుంటే ఇటు కమలా హారిస్‌కు భారతీయ మూలాలు ఉండటం కూడా భారత దేశంతో సంబంధాలను బలోపేతం చేసే అవకాశాలు ఉన్నాయి.

## ఇండియాకు ట్రేడ్ సర్‌ప్లస్

వాణిజ్యపరంగా చూస్తూ భారత్‌కు అమెరికా చాలా కీలకం అన్న విషయం తెలిసిందే. భారతదేశ మొదటి 10 వాణిజ్య భాగస్వామ్య దేశాల్లో అమెరికాతోనే ఇండియాకు ట్రేడ్ సర్‌ప్లస్ ఉంది. అంటే అమెరికా నుంచి చేసుకుంటున్న దిగుమతుల కంటే కూడా అమెరికాకు భారత్ చేస్తున్న ఎగుమతులే ఎక్కువ.అందుకే భారత్‌తో వాణిజ్యం గురించి ట్రంప్ పదేపదే మాట్లాడుతూ వస్తున్నారు. దిగుమతులపై భారత్ ఎక్కువగా పన్నులు వేస్తుందని ఆరోపిస్తున్న ట్రంప్.. తాను గెలిస్తే ఈ పరిస్థితిని మార్చేస్తానని చెబుతున్నారు. ఇది భారత దేశానికి కొంత ఇబ్బందికరమే అని చెప్పొచ్చు. మరోవైపు కమలా హారిస్ కూడా అమెరికా ప్రయోజనాలకు అనుగుణంగా విధానాలను రూపొందించవచ్చనే భావన భారతీయుల్లో ఉంది. అయితే, ఇవి మరీ అసాధారణంగా ఉండకపోవచ్చు అనే అభిప్రాయాలు ఉన్నాయి.

## డొనాల్డ్ ట్రంప్ కొంత కఠినంగా

అయితే వలస విధానం విషయంలో డొనాల్డ్ ట్రంప్ ఆలోచనలు, విధానాలు మొదటి నుంచీ కూడా కొంత కఠినంగానే ఉంటాయి. ట్రంప్ వచ్చాక మొదట్లో బాగానే ఉన్నా కరోనా కాలంలో లెక్క మారింది. లాక్డౌన్ సమయంలో స్టిములస్ చెక్స్ ఇచ్చాడు. ప్రజలెవ్వరూ ఆర్థిక పరిస్థితి కారణంగా ఆత్మహత్యలు చేసుకోకుండా, డిప్రెషన్ కి లోను కాకుండా, క్రైం కి తెగపడకుండా ఉండేందుకు తీసుకున్న అతిపెద్ద చర్య ఇది. అయితే మార్కెట్లో బిలియన్ల డాలర్లు పంపింగ్ చేయడం వల్ల తర్వాత కాలంలో ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగిపొయింది. దానివల్ల అన్ని వస్తువుల రేట్లు ఉన్నపళంగా మూడింతలు, నాలుగింతలు అయిపోయాయి.ఈ ఎన్నికల్లో కూడా ట్రంప్ ఇమ్మిగ్రేషన్ విధానంపైనే ప్రధానంగా ప్రచారం చేస్తున్నారు. దీనికి తగ్గట్లు ట్రంప్ గెలిస్తే అక్రమ వలసదారులపై కఠినంగా వ్యవహరించొచ్చు. ఇటు భారతీయులకు కీలకమైన హెచ్1బీ వీసాలపైన కూడా డొనాల్డ్ ట్రంప్ పరిమితులు విధించవచ్చనే అభిప్రాయాలు బలంగా ఉన్నాయి. ఇమ్మిగ్రేషన్‌కు సంబంధించి కమలా హారిస్ విధానాలు మాత్రం కొంత వలసదారులకు అనుకూలంగా ఉండొచ్చనే అంచనాలున్నాయి.

## అన్ని దేశాల వ్యక్తులకూ పౌరసత్వం

ఇక్కడ అమెరికాకి మిగిలిన దేశాలకి చాలా తేడా ఉంది. అమెరికా వలసదారులవల్ల పెరిగిన, పెరుగుతున్న దేశం. ప్రపంచంలోని అన్ని దేశాల వాళ్లని ఆకర్షించడం, ఆహ్వానించడం, క్రమంగా పౌరసత్వమివ్వడం..ఇదీ ఈ దేశం ప్రత్యేకత. కనుక అన్ని దేశాల మూలాలున్న పౌరులు, జనాభా అమెరికాలో ఉంటారు. కనుక ఏ దేశంలో ఏ గొడవొచ్చినా కొద్దో గొప్పో అక్కడ ఆ దేశాల వాళ్లు ర్యాలీలు అవీ చేయడం సహజం.. మొన్నీమధ్య ఇజ్రాయెల్, పాలెస్తీనా వాళ్ళు చేసినట్టు.

## స్థిర పడిన భారతీయులు

ఇండియా విషయానికొస్తే సొంతింట్లోనో, ఇరుగో, పొరుగో అమెరికాలో స్థిరపడిన వ్యక్తులుంటున్నారు. కనీసం చదువుకోవడానికి వెళ్లిన వాళ్లైనా ఉంటారు. కనుక చాలా మంది ఇండియన్స్ కి తెలియకుండా అమెరికా ఎన్నికల మీద, అమెరికా వర్తమాన భవిష్యత్తుల మీద ఆసక్తి పెరుగుతోంది. ఇండియా తర్వాత వాళ్ల దృష్టి అమెరికా మీదే ఉంటోంది. కారణం వాళ్ల కుటుంబసభ్యులు, స్నేహితులు అక్కడ ఉండడం వల్ల. రూపాయి విలువ పడిందన్న బాధ పక్కనే, డాలర్ విలువ పెరిగిందన్న సంతోషాన్ని మనసులో పొందుతున్న మధ్య, ఎగువ మధ్యతరగతి వాళు ఉంటారు. దానికి కూడా కారణం తమ అన్నో, కొడుకో, కూతురో అమెరికాలో ఉండడం గమనార్హం. ఎకానమీని, ద్రవ్యోల్బణాన్ని జనరంజకంగా ఆయా స్థానాల్లో నిలబెట్టే విషయంలో బైడెన్ ప్రభుత్వం ఫెయిలయ్యింది. ఇప్పుడా అసంతృప్తి అంతా ఎన్నికలపై ప్రభావం చూపనుంది.

## కాస్త ట్రంప్ వైపే మొగ్గు

తాజాగా వెలువడుతున్న ఒపీనియన్ పోల్స్‌లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి ట్రంప్ వైపు అమెరికన్లు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. తాజాగా మెక్ డొనాల్డ్‌లో ట్రంప్ చేసిన హడావిడి ఆయనకు కలిసొచ్చిందని అంటున్నారు. ఈ వ్యవహారం అనంతరం డొనాల్డ్ ట్రంప్ విజయావకాశాలు మరింత పెరిగాయని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా అమెరికాలో ప్రసిద్ధి చెందిన పాలీ మార్కెట్ బెట్టింగ్ యాప్ లో ట్రంప్ విజయావకాశాలు ట్రెండ్ 2.5 శాతం పెరిగిందని చెబుతున్నారు. మొత్తంగా... కమల హారిస్ తో పోలిస్తే విజయావకాశాలు 24 శాతం పెరిగాయని అంటున్నారు. ఇది ఏ ఒక్క ప్రాంతానికో కాకుండా అన్ని రాష్ట్రాల్లోనూ ఇలానే ఉందని చెబుతున్నారు.

## ట్రంప్ వస్తే హిట్లర్ పాలనే

డెమోక్రటిక్ అభ్యర్థి కమలా హారీస్ మాట్లాడుతూ..'ఆరు మిలియన్ల మంది యూదులు, వందల వేల మంది అమెరికన్ల మరణాలకు కారణమైన వ్యక్తి హిట్లర్. అటువంటి వ్యక్తిని ట్రంప్ పొడుగుతున్నారు. హిట్లర్ కొన్ని మంచి పనులు చేశారని ట్రంప్ అంటున్నారు. అమెరికాకు మిలటరీ బదులుగా హిట్లర్ వంటి జనరల్స్ ఉండాలని ట్రంప్ భావిస్తున్నారు. హిట్లర్ వంటి వ్యక్తిని ప్రశంసించడం ఆందోళన కలిగిస్తుంది. ఇది చాలా ప్రమాదకరం. ట్రంప్ ఎలాంటి వారో ఆయన వ్యాఖ్యలే రుజువు చేస్తున్నాయి. అమెరికా ప్రజలు ట్రంప్ వ్యాఖ్యలను అర్థం చేసుకోవాలి' అని కోరారు. ఈనెల 29న కమలా హారీస్ ప్రచార ముగింపు సభ ఉండనుంది. 29న తన చివరి ఎన్నికల ప్రచార సభలో పాల్గొననున్నారు.

## ప్రభుత్వ వ్యతిరేకత

మీడియా మొత్తం ఏకకంఠంతో కమలా హారిస్ గెలుస్తుందని చెబుతున్నా బెట్టింగ్ యాప్ లు, జనం ట్రంప్ గెలుస్తాడంటున్నారు. దీనిని బట్టి ప్రభుత్వవ్యతిరేకత ఏ రేంజులో ఉందో అర్థమవుతుంది. న్యూయార్క్ టైమ్స్, సియెనా కాలేజ్ సంయుక్తంగా నిర్వహించిన ఒపీనియన్ పోల్ సర్వే శుక్రవారం(అక్టోబర్ 25) ఆసక్తికర విషయం వెల్లడించింది. అధ్యక్ష ఎన్నికల రేసులో రిపబ్లికన్ అభ్యర్థి ట్రంప్, డెమొక్రాట్ అభ్యర్థి హారిస్ పట్ల ప్రజలు సమానంగా మొగ్గు చూపుతున్నారని సర్వే తెలిపింది. ఇద్దరికీ సరిగ్గా చెరో 48 శాతం పాపులర్ ఓట్ రానుందని తేలినట్లు ప్రకటించింది. అక్టోబర్ మొదటి వారంలో హారిస్‌కు 49 పాపులర్ ఓట్ అనుకూలంగా ఉండగా ట్రంప్‌కు 46 శాతం మంది మదతిచ్చారు. అయితే క్రమంగా ట్రంప్ పుంజుకొని హారిస్ రేసులో సమాన స్థాయికి రావడం గమనార్హం. అది గాడిలో లేదు. బ్యాంకులు కుప్పకూలుతున్నాయి. దీనికి తోడు గన్ లాస్, డ్రగ్స్ విచ్చలివిడితనం పెరిగిపోయింది బైడెన్ పాలనలో. ఇవన్నీ చుట్టుకుని ఇప్పుడు డెమాక్రటిక్ పార్టీ దిగాలుగా కూర్చుంది. ఇక ట్రంప్ వస్తే బాగుంటుందని ఎక్కువమంది స్థానిక అమెరికన్లు అనుకుంటున్నట్టు సర్వేలు చెబుతున్నాయి. కానీ యూరోప్ మాత్రం ట్రంప్ గెలవ కూడదని అనుకుంటోంది. దానికి కారణం యూరోప్ రక్షణని చిన్నచూపు చూస్తాడని ట్రంప్‌పై ఒక అభిప్రాయం.

**విద్య వెంకట్ తెలంగాణ బ్యూరో, 9391618181**





## యెల్లో జెర్సీ వేసుకోవడమే రుతురాజ్ తప్పా? నెట్టింట కామెంట్స్ వైరల్

దక్షిణాఫ్రికాతో టీ20లు, ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్లకు భారత స్క్వాడ్లను బీసీసీఐ ప్రకటించింది. ఇందులో యువ పేసర్ మయాంక్ యాదవ్కు చోటు దక్కలేదు. షమీ, శివమ్ దూబెకి అవకాశం రాలేదు. వీరిని గాయాల వల్ల పక్కనపెట్టినట్లు బోర్డు ఓ ప్రకటనలో వెల్లడించింది. తెలుగు కుర్రాడు నితీశ్కుమార్ రెడ్డి పేస్ ఆల్రౌండర్ కోటాలో వచ్చేశాడు. అయితే, ఐపీఎల్లో చెన్నై సూపర్ కింగ్స్ను నడిపించే రుతురాజ్ గైక్వాడ్కు మాత్రం అవకాశం రాలేదు. దీంతో సోషల్ మీడియా వేదికగా బీసీసీఐ తీరు, సెలక్టర్లపై అభిమానులు తీవ్ర విమర్శలు గుప్పించారు. భారత జట్టును సోషల్ మీడియా నిర్ణయించదని ఇప్పటికే ప్రధాన కోచ్ గౌతమ్గంభీర్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. అయినా సరే జట్ల ఎంపికపై చర్చ మాత్రం ఆగడం లేదు. ఆస్ట్రేలియా- తో తలపడేందుకు ఇప్పటికే భారత్ - టీమ్ వెళ్లింది. ఆ జట్టుకు రుతురాజ్ నాయకత్వం వహిస్తాడు.
మరి అలాంటి క్రికెటర్ను ప్రధాన జట్టులో చోటు కల్పించకపోవడం మరింత దారుణమని వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. బ్యాకప్ ఓపెనర్గా అభిమన్యు ఈశ్వరన్ను తీసుకున్న మేనేజ్మెంట్కు రుతురాజ్ కనిపించలేదా? అని ఫ్యాన్స్ కామెంట్లు చేస్తున్నారు. రుతురాజ్ యెల్లో జెర్సీ (సీఎస్కే) వేసుకోవడం వల్లనే ఇదంతా అవుతున్నట్లుంది అని మరికొందరు ఘాటుగానే వ్యాఖ్యలు చేశారు. శుభ్మన్ గిల్ నుంచి మంచి ఇన్నింగ్స్ రాకపోయినా అతడికి అవకాశం ఇస్తున్నారని.. కెప్టెన్ రోహిత్, సీనియర్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కూడా పెద్దగా రాణించలేదని గుర్తు చేస్తున్నారు.
రుతురాజ్, ఇషాన్ కిషన్ అభిమానులకు బీసీసీఐ సెలక్షన్ నచ్చలేదు. వారెంత రాణించినా రాజకీయాలు మాత్రం వారిని వెనక్కినెడుతున్నాయి. బీసీసీఐ తీసుకున్న నిర్ణయం చాలా బాగుంది. తప్పకుండా భారత క్రికెట్ త్వరగానే పతనం కావడం ఖాయంగానే కనిపిస్తోంది.

# రెండో టెస్టులో భారత్ ఓటమి..
# చరిత్ర సృష్టించిన న్యూజిలాండ్






వుణె: టెస్టుల్లో సొంతగడ్డపై తిరుగులేని ఆధిపత్యం చెలాయిస్తున్నటీమ్ఇండియాకు న్యూజిలాండ్ షాక్ ఇచ్చింది. వుణె వేదికగా జరిగిన రెండో టెస్టులో భారత్పై కివీస్ 113 పరుగుల తేడాతో విజయం సాధించింది. 359 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టు.. 245 పరుగులకు ఆలౌటైంది. భారత బ్యాటర్లలో యశస్వి జైస్వాల్ (77) రాణించగా.. మిగతావారు భారీ స్కోర్లు చేయలేకపోయారు. తొలి ఇన్నింగ్స్లో ఏడు వికెట్లతో చెలరేగిన మిచెల్ శాంట్నర్.. సెకండ్ ఇన్నింగ్స్లో ఆరు వికెట్లతో అదరగొట్టాడు. ఈ మ్యాచ్లో గెలుపుతో మూడు టెస్టుల సిరీస్ను న్యూజిలాండ్ 2-0తో కైవసం చేసుకొని చరిత్ర సృష్టించింది. భారత గడ్డపై న్యూజిలాండ్ టెస్టు సిరీస్ గెలవడం ఇదే తొలిసారి. అంతేకాకుండా ప్రపంచ టెస్టు ఛాంపియన్షిప్ చరిత్రలో విదేశీ గడ్డపై కివీస్ టెస్టు సిరీస్ గెలవడం ఇదే మొదటిసారి. 2012 నుంచి స్వదేశంలో వరుసగా 18 టెస్టు సిరీస్లు సాధించిన టీమ్ఇండియా.. వుష్కరకాలం తర్వాత సిరీస్ను కోల్పోవడం గమనార్హం. మూడో టెస్టు నవంబర్ 1 నుంచి ముంబయి వేదికగా ప్రారంభంకానుంది.రెండో ఇన్నింగ్స్లో 198/5 స్కోరుతో మూడో రోజు ఆటను ప్రారంభించిన న్యూజిలాండ్ 255 పరుగులకు ఆలౌటైంది. ఈ క్రమంలో తొలి ఇన్నింగ్స్లో లభించిన 103 పరుగుల ఆధిక్యాన్ని కలువుకొని భారత్కు 359 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ను ఆరంభించిన టీమ్ఇండియా 34 పరుగుల వద్ద రోహిత్ శర్మ (8) రూపంలో తొలి వికెట్ కోల్పోయింది. శుభ్మన్ గిల్ (23)తో కలిసి జైస్వాల్ నిలకడగా ఆడటంతో భోజన విరామ సమయానికి భారత్ 81/1 స్కోరుతో మెరుగైన స్థితిలో కనిపించింది. కానీ, రెండో సెషన్లో ఆరు వికెట్లు కోల్పోవడంతో భారత్ ఓటమి అక్కడే ఖాయమైపోయింది. న్యూజిలాండ్ స్పిన్నర్ మిచెల్ శాంట్నర్.. యశస్వి జైస్వాల్, గిల్, విరాట్ కోహ్లీ (17), సర్ఫరాజ్ ఖాన్ (9)లను ఔట్ భారత్ను కోలుకోలేని దెబ్బతీశాడు. రిషభ్ పంత్ (0) అనవసరంగా రనౌటయ్యాడు. చివర్లో రవీంద్ర జడేజా (42) పోరాడినా ఫలితం లేకపోయింది. స్కోర్లు: న్యూజిలాండ్.. తొలి ఇన్నింగ్స్.. 259 ఆలౌట్ రెండో ఇన్నింగ్స్.. 255 ఆలౌట్భారత్.. ఫస్ట్ ఇన్నింగ్స్.. 156 ఆలౌట్ సెకండ్ ఇన్నింగ్స్.. 245 ఆలౌట్





## సీఎస్కే అభిమానులకు గుడ్న్యూస్..!

### రూమర్లకు చెక్ పెట్టిన ఎంఎస్ ధోనీ!



ఐపీఎల్ 2025 సీజన్కు ( 2025) ముందు మెగా వేలం జరగనుంది. ఆలోపు రిటెన్షన్, రైట్ టు మ్యాచ్తో ఆటగాళ్లను ఫ్రాంచైజీలు తమవద్దే అట్టిపెట్టుకోవాల్సి ఉంది. దీనికి గడువు అక్టోబర్ 31 వరకు మాత్రమే ఉంది. ఇప్పటివరకు ఏ ఫ్రాంచైజీ కూడా అధికారికంగా జాబితాలను విడుదల చేయలేదు. అయితే, ఒకేఒక్క ప్లేయర్ విషయంలోనే అభిమానుల్లో తీవ్ర స్థాయిలో ఉత్కంఠ నెలకొంది. అతడు ఈసారి ఐపీఎల్లో ఆడతాడా? లేదా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. కానీ, తాజాగా ఆ స్టార్ ప్లేయర్ ఎంఎస్ ధోనీ ఓ కార్యక్రమంలో మాట్లాడిన మాటలు ఐపీఎల్లో పాల్గొనడంపై వస్తోన్న రూమర్లకు చెక్ పెట్టినట్లైంది. మరికొన్నేళ్లు క్రికెట్ ఆడేందుకు తాను సిద్ధమవుతున్నట్లు ధోనీ వ్యాఖ్యానించాడు. అంతేకాకుండా మరో మూడేళ్ల వరకు అతడిని మైదానంలో చూసే అవకాశం ఉంది. రిటైన్ చేసుకొనే ఆటగాళ్లను కనీసం మూడేళ్లపాటు ఆడించేందుకు అవకాశం ఉంటుంది. క్రికెట్ను ఆస్వాదిస్తూ ఆడితే జట్టుకు, వ్యక్తిగతంగాను ప్రయోజనం ఎక్కువగా ఉంటుంది. ఇకపై నేను ఆడబోయే క్రికెట్ను మరింత ఆస్వాదించాలని అనుకుంటున్నా. ప్రొఫెషనల్ గేమ్ ఆడేవారు ఎల్లవేళలా ఎంజాయ్ చేయలేరు. కానీ, నేను మాత్రం అలా ఉండకూడదని భావిస్తున్నా. కానీ, ఇది చాలా కష్టమైందే. కమిట్మెంట్స్, భావోద్వేగాలు ఉంటాయి. వీటన్నింటినీ పక్కన పెట్టేసి రాబోయే కొన్నేళ్లు ఆటను ఆస్వాదిస్తా. అందుకోసం గత తొమ్మిది నెలలుగా ఫిట్నెస్పై దృష్టిసారించా. ఐపీఎల్లో కేవలం రెండున్నర నెలలు మాత్రమే ఆడతా. అందుకోసం పక్కాగా ప్లాన్ చేసుకోవాలి. అదే సమయంలో వ్యక్తిగతంగానూ జీవితాన్ని గడపాలి అని ధోనీ వెల్లడించాడు.

## వార్నర్పై కెప్టెన్సీ నిషేధం ఎత్తివేత



క్రికెట్ ఆస్ట్రేలియా డేవిడ్ వార్నర్పై జీవితకాల కెప్టెన్సీ నిషేధాన్ని ఎత్తేసింది. ఇటీవలే అంతర్జాతీయ క్రికెట్కు వీడ్కోలు పలికిన వార్నర్కు ప్రస్తుతం బిగ్బాష్ లీగ్లో సిడ్నీ థండర్ జట్టుకు సారథ్యం వహించేందుకు అవకాశం లభించింది. : 26 2024 02:13 సిడ్నీ: క్రికెట్ ఆస్ట్రేలియా డేవిడ్ వార్నర్పై జీవితకాల కెప్టెన్సీ నిషేధాన్ని ఎత్తేసింది. ఇటీవలే అంతర్జాతీయ క్రికెట్కు వీడ్కోలు పలికిన వార్నర్కు ప్రస్తుతం బిగ్బాష్ లీగ్లో సిడ్నీ థండర్ జట్టుకు సారథ్యం వహించేందుకు అవకాశం లభించింది. ఈ నెల ఆరంభంలో త్రిసభ్య ప్యానల్ ముందు వార్నర్ హాజరయ్యాడు. విచారణ అనంతరం నిషేధం ఎత్తి వేయడానికి వార్నర్ అర్హుడని ప్యానల్ తేల్చింది. 2018లో బాల్ టాంపరింగ్ కేసులో అప్పటి వైస్ కెప్టెన్ వార్నర్పై ఏడాది పాటు వేటు పడింది. అదే సమయంలో సారథ్య బాధ్యతలు చేపట్టకుండా సీఏ అతడిపై నిషేధం విధించింది. 2022లో కెప్టెన్సీ నిషేధంపై వార్నర్ అప్పీల్ చేసుకున్నా ప్యానల్ కొట్టేసింది.

### ఆసీస్ టెస్టు సిరీస్కు తెలుగు కుర్రాడు..
## కారణమిదే అనుకుంటా



భారత స్క్వాడ్పై క్రికెట్ దిగ్గజం అనిల్ కుంబ్లే విశ్లేషించాడు. అతడితోపాటు కివీస్ మాజీ క్రికెటర్ సైమన్ డౌల్ కూడా తన అభిప్రాయాన్ని వ్యక్తంచేశాడు. న్యూజిలాండ్తో రెండో టెస్టు సందర్భంగా వీరిద్దరూ కామెంటేటర్లుగా వ్యవహరి స్తున్నారు. నితీశ్ కుమార్ ఎంపిక ఆశ్చర్యం కలిగించింది. అతడు పెద్దగా ఫస్ట్క్లాస్ క్రికెట్ ఆడినట్లు కూడా లేదు. అతడి గణాంకాల గురించి మాట్లాడేందుకు ఏమీలేదు. అయితే, నితీశ్కు మంచి టాలెంట్ ఉంది. పేస్ను వేయగలడు. నాణ్యమైన బ్యాటర్. పరిమిత ఓవర్ల క్రికెట్లో తీవ్ర ఒత్తిడి ఉంటుంది. అలాంటి సమయంలో పరిణితితో ఆడాడు. అందుకేనేమో భారత సెలక్టర్లు నితీశ్ వైపు మొగ్గుచూపి ఉండొచ్చు అని కుంబ్లే వెల్లడించాడు.

బోర్డర్ - గావస్కర్ ట్రోఫీలో భాగంగా ఆసీస్తో ఐదు టెస్టుల సిరీస్ కోసం టీమ్ఇండియా స్క్వాడ్ను బీసీసీఐ ప్రకటించిన సంగతి తెలిసిందే. తెలుగు కుర్రాడు నితీశ్కుమార్ రెడ్డికి చోటు దక్కింది. పేస్ ఆల్రౌండర్గా కీలకపాత్ర పోషిస్తాడనే ఉద్దేశంతో సెలక్టర్లు అతడి వైపు మొగ్గు చూపారు. ఆసీస్ పిచ్లు పేస్కు అనుకూలంగా ఉంటాయి. ఫాస్ట్ బౌలర్లు ఉన్నప్పటికీ బ్యాటింగ్ కూడా అత్యంత కీలకమే. గత సిరీస్లో శార్దూల్ ఠాకూర్ ఈ పాత్రను పోషించాడు. ఈసారి హార్దిక్ వస్తాడనుకుంటే.. అతడు టెస్టులు ఆడేంత ఫిట్నెస్ సాధించలేదని తెలుస్తోంది. పాండ్య కూడా సుదీర్ఘ ఫార్మాట్ ఆడేందుకు పెద్దగా ఆసక్తి లేనట్లుంది. దీంతో మేనేజ్మెంట్ నితీశ్పై నమ్మకం ఉంచింది. ఈక్రమంలో

శార్దూల్ స్థానంలో..గత పర్యటనలో శార్దూల్ ఠాకూర్ మంచి ప్రదర్శన ఇచ్చాడు. ఇప్పుడు అతడి స్థానాన్ని నితీశ్కుమార్తో భర్తీ చేయనుంది. ఆసీస్లో కనీసం 15 ఓవర్లు బౌలింగ్ చేయడంతోపాటు 7 లేదా 8వ స్థానంలో విలువైన పరుగులు చేయాల్సి ఉంటుంది. అప్పుడే వచ్చిన అవకాశానికి న్యాయం చేసినట్లు అవుతుంది. భారత స్క్వాడ్ ఎంపిక బాగుంది అని సైమన్ డౌల్ తెలిపాడు. నితీశ్ ఇప్పటివరకు 21 ఫస్ట్క్లాస్ మ్యాచ్ లు ఆడి 708 పరుగులు చేశాడు. బౌలింగ్లోనూ 55 వికెట్లు పడగొట్టాడు. అంతర్జాతీయ టీ20ల్లోకి ఇటీవలే అడుగుపెట్టిన నితీశ్ 90 పరుగులు చేసి.. మూడు వికెట్లు తీశాడు.

### 92 ఏళ్ల చరిత్రలో.. తొలి భారత బ్యాటర్గా
## యశస్వి జైస్వాల్ రికార్డు



న్యూజిలాండ్తో జరిగిన రెండో టెస్టులో టీమ్ఇండియా 113 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. 359 పరుగుల లక్ష్యఛేదనలో యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్ (77; 65 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సులు) ఒక్కడే అర్ధ శతకం బాదాడు. మిగతా ఆటగాళ్లు రాణించలేదు. దీంతో భారత్ 245 పరుగులకు ఆలౌటైంది. ఈ ఇన్నింగ్స్లో మూడు సిక్సులు బాదడం ద్వారా జైస్వాల్ అద్భుతమైన రికార్డు సొంతం చేసుకున్నాడు. టెస్టుల్లో ఒక క్యాలెండర్ ఇయర్లో 30 కంటే ఎక్కువ సిక్సులు బాదిన తొలి భారత ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. ఓవరాల్గా ఈ ఫీట్ అందుకున్న రెండో బ్యాటర్గా నిలిచాడు. న్యూజిలాండ్ మాజీ ఆటగాడు బ్రెండన్ మెక్కల్లమ్ (33 సిక్సులు) అగ్రస్థానంలో ఉన్నాడు. అతడు 2014లో 33 సిక్సర్లు బాదాడు. ఈ ఏడాది ఇప్పటివరకు యశస్వి జైస్వాల్ 32 సిక్సులు కొట్టాడు. ఈ యువ బ్యాటర్ మరో రెండు సిక్సర్లు బాదితే మెక్కల్లమ్ రికార్డును బ్రేక్ చేస్తాడు. న్యూజిలాండ్తో మూడో టెస్టు, తర్వాత ఆస్ట్రేలియాతో బోర్డర్-గావస్కర్లో యశస్వి ఆడనున్నాడు. దీంతో అతడు మెక్కల్లమ్ రికార్డును సునాయంసగా బ్రేక్ చేయడం ఖాయం.ఈ ఏడాది టెస్టుల్లో అద్భుతమైన ఫామ్లో ఉన్న జైస్వాల్ 19 ఇన్నింగ్స్లో 1084 పరుగులు చేశాడు. ఈ క్రమంలో స్వదేశంలోనే వెయ్యికిపైగా పరుగులు చేసిన మూడో భారత ఆటగాడిగా నిలిచాడు. అతడికంటే ముందు గుండప్ప విశ్వనాథ్ (1979లో), సునీల్ గావస్కర్ (1979లో) మాత్రమే టీమ్ఇండియా బ్యాటర్లుగా స్వదేశంలో 1000+కి పైగా పరుగులు రాబట్టారు. భారత్, న్యూజిలాండ్ మధ్య మూడో టెస్టు నవంబర్ 1 నుంచి ముంబయి వేదికగా ప్రారంభంకానుంది. నవంబర్ 22 నుంచి బోర్డర్-గావస్కర్ సిరీస్ మొదలవనుంది. ఈ సిరీస్ కోసం ఇప్పటికే భారత జట్టును ప్రకటించారు.

## ఎస్ఎఫ్ఏ హ్యాండ్బాల్ విజేతలు



హైదరాబాద్ : ఎస్ఎఫ్ఏ ఛాంపియన్షిప్ 2024 ఎడిషన్ లో 11వ రోజు ఉత్కంఠభరితంగా కొనసాగింది. గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన బాలుర అండర్-10 హ్యాండ్బాల్ ఫైనల్లో విజ్ఞాన్స్ బో ట్రీ స్కూల్పై విజయం సాధించి జనప్రియ హైస్కూల్ ట్రోఫీ కైవసం చేసుకుంది. బోల్లారం ఆర్మీ పబ్లిక్ స్కూల్ జట్టు బాలికల అండర్-14 వాలీబాల్ ఫైనల్లో విజ్ఞాన్స్ బో ట్రీ స్కూల్ను ఓడించిస్వర్ణం గెలిచింది. ది క్రీక్ ప్లానెట్ స్కూల్ విద్యార్థులు స్విమ్మింగ్ లో అద్భుతమైన ప్రదర్శనను చూపెట్టారు. హర్షిత వర్మ భూపతిరాజు, తేజ రామ్ సామినేని వరుసగా అండర్-16 బాలికల, బాలుర 100 మీటర్ల బటర్ఫ్లై స్ట్రోక్లో విజేతలుగా నిలిచారు. బాస్కెట్బాల్ లో బాలికల అండర్-14, ఫుట్బాల్ లో బాలికల అండర్-10, హ్యాండ్బాల్ లో బాలుర అండర్-16, అండర్-18 సెమీఫైనల్ మ్యాచ్లు ఉత్కంఠగా సాగి తుది దశకు చేరుకున్నాయి. కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియంలో అండర్-17 బాలికల కబడ్డీ పోటీ సెమీఫైనల్కు చేరుకుంది. ప్రస్తుతం నిజాంపేటకు చెందిన విజ్ఞాన్స్ బో ట్రీ స్కూల్ తమ పతక పరంపర కొనసాగిస్తూ అగ్రస్థానాన్ని నిలువుకుంది. ఈ ఏడాది హైదరాబాద్ ఎడిషన్ ఎస్ఎఫ్ఏ ఛాంపియన్షిప్లో 920 పాఠశాలల నుంచి 23,000 మంది క్రీడాకారులు 22 క్రీడలలో పోటీపడుతున్నారు. ఈ నెల 28 వరకు పోటీలు కొనసాగుతాయి.

## 11,500 స్క్రీన్స్‌లో
# పుష్ప-2 రిలీజ్‌కు సన్నాహాలు



బిగ్గెస్ట్ రిలీజ్ ఇండియన్ సినిమాగా ఐకాన్స్టార్ పుష్ప-2 ది రూల్ సరికొత్త రికార్డు 11,500 స్క్రీన్స్లో పుష్ప-2 రిలీజ్కు సన్నాహాలు ఐకాన్స్టార్ అల్లు అర్జున్, బ్రిలియంట్ డైరెక్టర్ సుకుమార్ సన్సేషనల్ కాంబినేషన్లో రూపొందుతున్న ఇండియన్ ఫిలిం 'పుష్ప-2' ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రేమికులు ఎదురుచూస్తున్న ఈ చిత్రాన్ని భారతదేశ ప్రముఖ నిర్మాణ సంస్థలో ఒకటైన మైత్రీ మూవీ మేకర్స్పై అభిరుచి గల నిర్మాతలు నవీన్ ఎర్నేని, రవిశంకర్.వైలు సుకుమార్ రైటింగ్స్ అసోసియేషన్తో నిర్మిస్తున్నారు. రోజు రోజుకు పుష్ప-2 చిత్రంపై అంచనాలు పెరుగుతూ వస్తున్నాయి. ఇప్పటి వరకు ఈ చిత్రం నుంచి వచ్చిన అప్డేట్తో పాటు ప్రమోషనల్ కంటెంట్ కూడా ఇందుకు కారణంగా చెప్పుకోవచ్చు. విడుదలైన టీజర్, రెండు పాటలు ఎంతటి సన్సేషన్స్ సాధించాయో చెప్పాల్సిన అవసరం లేదు. డిసెంబరు 5న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నట్లు ఇటీవల జరిగిన నేషనల్ ప్రెస్మీట్లో తెలియజేశారు నిర్మాతలు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన మరో సన్సేషనల్ న్యూస్ను వెల్లడించారు మేకర్స్. పుష్ప-2 చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా ఆరు భాషల్లో కలిపి 11,500 స్క్రీన్స్లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లుగా తెలిపారు మేకర్స్. ఇండియాలో 6500 స్క్రీన్స్లో, ఓవర్సీస్లో 5000 స్క్రీన్స్లో గ్రాండ్ విడుదలకు ప్లాన్ చేస్తున్నామని తెలిపారు నిర్మాతలు. అయితే ఇది బిగ్గెస్ట్ రిలీజ్ ఇండియన్ సినిమాగా ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటి వరకు ఏ ఇండియన్ సినిమా కూడా ఇలాంటి ఘనత సాధించలేదని అంటున్నాయి ఇండియన్ ఫిల్మ్ సర్కిల్స్. ఇక పుష్ప-2 బాక్సాఫీస్ రూల్లో కలెక్షన్ల పరంగా బాక్సీఫీస్ వద్ద ఎన్నో సంచలనాలు కూడా సృష్టిస్తుందని అంటున్నాయి ట్రేడ్ విశ్లేషకులు.

## రిలీజ్‌కు రెడీ అవుతున్న ఓ అందాల రాక్షసి



స్ట్రాంగ్ కంటెంట్ తో త్వరలోనే గ్రాండ్ థియెట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతున్న న్యూ కాన్సెప్ట్ మూవీ ఓ అందాల రాక్షసి దర్శకుడిగా, హీరోగా, సంగీత దర్శకుడిగా, కథకుడిగా షెరాజ్ మెహదీ ఇటు తెలుగు, అటు తమిళ ఆడియెన్స్ను ఆకట్టుకుంటూ వస్తున్నారు. షెరాజ్ మెహదీ ప్రస్తుతం తెలుగు ఆడియెన్స్ ముందుకు ఓ అందాల రాక్షసి అనే చిత్రంతో హీరోగా, దర్శకుడిగా మరోసారి రాబోతున్నారు. ఈ చిత్రంలో షెరాజ్ మెహదీ హీరోగా.. విహాన్షి హెగ్డే, కృతి వర్మలు హీరోయిన్లుగా నటించారు. స్కై ఈజ్ ది లిమిట్ బ్యానర్ మీద సురీందర్ కౌర్ నిర్మాతగా.. తేజిందర్ కౌర్ సహ నిర్మాతగా షేర్ సమర్పణలో ఓ అందాల రాక్షసి చిత్రం రాబోతోంది. ఇంత వరకు షెరాజ్ మెహదీ హీరోగా, విలన్గా, దర్శకుడిగా, సంగీత దర్శకుడిగా తన సత్తాను చాటుకున్నారు. ప్రస్తుతం ఓ అందమైన ప్రేమ కథా చిత్రంతో షెరాజ్ అందరినీ ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇక ఈ మూవీ షూటింగ్ అంతా పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో

డైరెక్టర్, హీరో, మ్యూజిక్ డైరెక్టర్ షెరాజ్ మెహదీ మాట్లాడుతూ - అందరికీ నమస్కారం. ఓ అందాల రాక్షసి సినిమాకు భాష్యశ్రీ గారు కథ మాటలు, పాటలు రాశారు. అలాగే స్క్రీన్ ప్లేలో కూడా సపోర్ట్ చేశారు. ఆయన సహకారం వల్లే ఈ సినిమా ఇంత బాగా చేయగలిగాం. భాష్యశ్రీ గారికి థ్యాంక్స్ చెబుతున్నా. ఓ అందాల రాక్షసి సినిమా గ్లామర్ బేస్డ్ మూవీ కాదు. మంచి కంటెంట్ ఉన్న సినిమా. ఒకరకంగా ఇది వుమెన్ ఓరియెంటెడ్ మూవీ అనుకోవచ్చు. మహిళల గురించిన అంశాలు ఉంటాయి. అమాయక మహిళలు కొందరి చేతిలో ఎలా మోసపోతున్నారు అనేది సినిమాలో చూపిస్తున్నాం. అలాగే మోసం చేసేవారికి శిక్ష కూడా ఉంటుందని చెబుతున్నాం. సుమన్, తమ్మారెడ్డి భరద్వాజ గారు ఇంపార్టెంట్ రోల్స్ లో నటించారు. సినిమా చాలా బాగా వచ్చింది. త్వరలోనే థియేటర్స్ లో మిమ్మల్ని కలుస్తాం. అన్నారు.

రైటర్ భాష్య శ్రీ మాట్లాడుతూ - అందరికీ నమస్కారం. ఓ అందాల రాక్షసి సినిమాకు నేను కథ, మాటలు, పాటలు రాశాను. మా డైరెక్టర్, హీరో షెరాజ్ మెహదీకి థ్యాంక్స్ చెబుతున్నా. ఆయన ఒక వర్సటైల్ పర్సన్. డైరెక్షన్, మ్యూజిక్ డైరెక్షన్ చేస్తూ హీరోగానూ నటించారు. ఆయన వల్లే ఈ సినిమా ఇంత బాగా వచ్చింది. 45 రోజుల షూటింగ్ తో టాకీ, సాంగ్స్ కంప్లీట్ చేసుకున్నాం. హైదరాబాద్, గోవా, చెన్నై పరిసర ప్రాంతాల్లో షూటింగ్ చేశాం. సినిమా చాలా బాగా వచ్చింది. కంటెంట్ ఓరియెంటెడ్ మూవీ ఇది. గ్లామర్ కు ప్రాధాన్యత ఇవ్వకుండా స్ట్రాంగ్ స్క్రిప్ట్ మీద వెళ్లాం. త్వరలోనే మీ ముందుకు మా ఓ అందాల రాక్షసి సినిమాను తీసుకొస్తున్నాం. మీ అందరికీ తప్పకుండా మూవీ నచ్చుతుంది. అన్నారు.

హీరోయిన్ విహాన్షి హెగ్డే మాట్లాడుతూ - హాయ్..నాకు తెలుగు బాగా రాదు. డైరెక్టర్ షెరాజ్ గారు ఓ అందాల రాక్షసి కథ చెప్పినప్పుడు ఎంతో ఇంప్రెస్ అయ్యాను. ముఖ్యంగా నా క్యారెక్టర్ లో ఎన్నో షేడ్స్ ఉంటాయి. ఇలాంటి క్యారెక్టర్ లో అవకాశం ఇచ్చినందుకు షెరాజ్ గారికి థ్యాంక్స్ చెబుతున్నా. కథలో కమర్షియల్ అంశాలతో పాటు మెసేజ్ కూడా ఉంది. తెలుగు ప్రేక్షకులు ఓ అందాల రాక్షసి సినిమాను ఆదరిస్తారని కోరుకుంటున్నా. మీ అందరికీ నచ్చేలా సినిమా ఉంటుంది. అన్నారు.

హీరోయిన్ నేహా దేశ్పాండే మాట్లాడుతూ - ఓ అందాల రాక్షసి సినిమాలో నటించే అవకాశం రావడం హ్యాపీగా ఉంది. డైరెక్టర్ షెరాజ్ గారికి థ్యాంక్స్ చెబుతున్నా. ఆయన ఈ మూవీలో ఆల్ రౌండ్ పర్ ఫార్మెన్స్ చూపించారు. ఇందాక సార్ చెప్పినట్లు ఇది వుమెన్ కోసం చేసిన మూవీ. వుమెన్ ఓరియెంటెడ్ మూవీలా ఉంటుంది. భాష్యశ్రీ గారి స్క్రిప్ట్ ఆకట్టుకుంటుంది. ప్రేక్షకుల మనసులకు టచ్ అయ్యేలా మంచి కంటెంట్ తో ఓ అందాల రాక్షసి సినిమా రాబోతోంది. మీ సపోర్ట్ మా సినిమాకు అందిస్తారని కోరుకుంటున్నా. అన్నారు.

# నటుడుగా 50 ఏళ్ళు..



## అరుదైన మెమొరీ షేర్ చేసుకున్న చిరు

మన తెలుగు సినిమా గర్వించదగ్గ అతి కొద్ది మంది నటుల్లో మెగాస్టార్ చిరంజీవి కూడా ఒకరు మరి మెగాస్టార్ చిరంజీవి సినిమా ఎంట్రీ ఇచ్చి చాలా ఏళ్ళు అయ్యింది. కానీ వెండితెర కంటే ముందే చిరు నటుడుగా అలాగే నాట్యకారునిగా కూడా ఎన్నో ప్రదర్శనలు ఇచ్చారు.

అయితే తాను లేటెస్ట్ గా ఒక అరుదైన మెమొరీ షేర్ చేసుకోవడం వైరల్ గా మారింది.

తాను తన బికాం చదువుతున్న కాలేజీ రోజుల్లో వేసిన నాటకం కోసం ఇంట్రెస్టింగ్ పోస్ట్ పెట్టారు.

రాజీనామా వైఎన్ఎం కాలేజీ నర్సాపూర్ లో రంగస్థలం మీద తొలి నాటకం.. కోన గోవింద రావు గారి రచన; నటుడిగా తొలి గుర్తింపు..అది ఉత్తమ నటుడు కావటం.. ఎనలేని ప్రోత్సాహం..1974 నుంచి 2024 కి 50 సంవత్సరాలు తన నట ప్రస్థానంకి పూర్తయ్యింది అని దీని విషయంలో ఎనలేని ఆనందంగా ఉన్నట్టుగా చిరు పోస్ట్ చేశారు.

అలాగే ఇందులో తన యుక్త వయస్సులో ఉన్న పిక్ పేపర్ కట్ నుంచి షేర్ చేయడం విశేషం. మరి ఈ పోస్ట్ చూసి మెగా అభిమానులు అయితే ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### 'సారంగో సారంగా... అమ్మాయి అవునంది ఏకంగా' అంటూ ప్రణయ గీతాలాపన చేస్తున్న

## 'సారంగపాణి' ప్రియదర్శి !!



పాటంటే ఎలా ఉండాలి? ఆకాశంలో మబ్బులా కనపడాలి.చూస్తుంటే గుండె ఉప్పొంగి పోతుండాలి. ఇక్కడ ఆకాశం వేరు, మబ్బు వేరు కాదు. అలాగే కథ వేరు, పాట వేరు కాదు. కథలో పాట ఓ అంతర్భాగంలా ఉండాలి. పాత్రల తాలూకు , సన్నివేశం తాలూకు అంతరంగాన్ని పాట ఒడిసిపట్టగలగాలి. అలాంటిదే మా 'సారంగపాణి జాతకం' చిత్రంలోని 'సారంగో సారంగా' పాట అంటున్నారు సృజనాత్మక దర్శకులు మోహనకృష్ణ ఇంద్రగంటి. ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణప్రసాద్ నిర్మిస్తున్న చిత్రం 'సారంగపాణి జాతకం'. ప్రియదర్శి, రూపా కొడువాయుర్ ఇందులో జంటగా నటించారు. జెంటిల్మన్, సమ్మోహనం తరువాత శ్రీదేవి మూవీస్ - మోహనకృష్ణ ఇంద్రగంటి కాంబినేషన్ లో వస్తున్న మూడో చిత్రమిది. డిసెంబర్ 20న ఈ చిత్రం విడుదల కానుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ జరుగుతోంది. ఇందులో మొదటి పాట 'సారంగో సారంగా' ని నేడు ఆదిత్య మ్యూజిక్ ద్వారా సోషల్ మీడియాలో విడుదల చేశారు. విడుదలైన కాసేపట్లోనే వీక్షకులని, శ్రోతల్ని అమితంగా ఆకట్టుకోవడంతో నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ తన సంతోషాన్ని వ్యక్తపరిచారు.ఈ పాట గురించి దర్శకులు మోహనకృష్ణ ఇంద్రగంటి మాట్లాడుతూ ఈ సినిమాలో కథానాయకుడు ప్రియదర్శి పేరు సారంగపాణి. అతని ప్రేమకథ నేపథ్యంలో వచ్చే పాట ఇది. ఓ రకంగా ఆ ప్రేమ కథకి మూలాధారం ఈ పాటే. ఉల్లా ఉల్లా ఉల్లా ఉల్లాస కల్లోలం గల్లా గల్లా గంతులాడింది భూగోళం నీ సంబరం నీలాంబరం మేఘాల అంచుల్లో నించోబెట్టిందే మెళ్ళోన దండేసి ఛత్రం పట్టిందేసారంగో సారంగా అమ్మాయి ఔనంది ఏకంగా సారంగో సారంగా ఆనందాలందుకో అనేకంగా.. అంటూ సాగే ఈ పాట అర్మాన్ మాలిక్ గళంలో రామజోగయ్య శాస్త్రి పద చాతుర్యం కొత్త పుంతలు తొక్కినట్టుగా అనిపిస్తుంది. వివేక్ సాగర్ హాయైన స్వరాలతో ఈ పాటని తీర్చిదిద్దారు. ఇక సినిమాలో సరికొత్త ప్రియదర్శిని చూడబోతున్నారు అని తెలిపారు.ప్రియదర్శి పులికొండ, రూప కొడువాయూర్ , నరేష్ విజయకృష్ణ, తనికెళ్ళ భరణి, శ్రీనివాస్ అవసరాల, 'వెన్నెల' కిశోర్, 'వైవా' హర్ష, శివన్నారాయణ, అశోక్ కుమార్, రాజా చెంబోలు, వడ్లమాని శ్రీనివాస్, ప్రదీప్ రుద్ర, రమేష్ రెడ్డి, కల్పలత, రూప లక్ష్మి, హర్షిణి, కె.ఎల్.కె.మణి, 'ఐమ్యాక్స్' వెంకట్ తదితరులు ఈ చిత్రం ప్రధాన తారాగణం.ఈ చిత్రానికి మేకప్ చీఫ్: ఆర్.కె వ్యామజాల, కాస్ట్యూమ్ చీఫ్: ఎన్. మనోజ్ కుమార్, కాస్ట్యూమ్ డిజైనర్స్: రాజేష్ కామర్సు - అశ్విన్, మార్కెటింగ్: టాక్ స్కూప్, పీఆర్వో: పులగం చిన్నారాయణ, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్: కె. రామాంజనేయులు (అంజి బాబు) - పి రషీద్ అహ్మద్ ఖాన్, కో డైరెక్టర్: కోట సురేష్ కుమార్, పాటలు: రామ జోగయ్య శాస్త్రి, స్టంట్స్: వెంకట్ - వెంకటేష్, ప్రొడక్షన్ డిజైనర్: రవీందర్, ఎడిటర్: మార్తాండ్ కె. వెంకటేష్, డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ: పీజీ విందా, సంగీతం: వివేక్ సాగర్, లైన్ ప్రొడ్యూసర్: విద్య శివలెంక, సహ నిర్మాత: చింతా గోపాలకృష్ణా రెడ్డి, నిర్మాత: శివలెంక కృష్ణప్రసాద్, రచన - దర్శకత్వం: మోహనకృష్ణ ఇంద్రగంటి

## అశోక్ గల్లా, అర్జున్ జంధ్యాల, లలితాంబిక ప్రొడక్షన్స్ 'దేవకీ నందన వాసుదేవ'



అశోక్ గల్లా, అర్జున్ జంధ్యాల, లలితాంబిక ప్రొడక్షన్స్ 'దేవకీ నందన వాసుదేవ' వరల్డ్ వైడ్ థియేట్రికల్ రైట్స్ ని సొంతం చేసుకున్న శంకర్ పిక్చర్స్ సూపర్ స్టార్ కృష్ణ మనవడు, సూపర్ స్టార్ మహేష్ బాబు మేనల్లుడు అశోక్ గల్లా తన సెకండ్ మూవీ 'దేవకి నందన వాసుదేవ' లో మాస్, యాక్షన్-ప్యాక్డ్ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే మొదటి రెండు పాటలు సూపర్ హిట్ అయ్యాయి.గుణ 369తో ఫేమ్ అర్జున్ జంధ్యాల దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని నల్లపనేని యామిని సమర్పణలో లలితాంబిక ప్రొడక్షన్స్ బ్యానర్పై సోమినేని బాలకృష్ణ నిర్మించారు. శంకర్ పిక్చర్స్ ఈ మూవీ వరల్డ్ వైడ్ థియేట్రికల్ రైట్స్ను భారీ ధరకు దక్కించుకుని, బిగ్గర్ రిలీజ్ కి ప్లాన్ చేస్తున్నారు.డివైన్ ఎలిమెంట్స్ తో కూడిన ఈ యాక్షన్ ప్యాక్డ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్లో అశోక్ గల్లా సరసన వారణాసి మానస కథానాయికగా నటించింది. ఈ చిత్రానికి హను మాన్ ఫేమ్ క్రియేటివ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ కథ అందించారు. సాయి మాధవ్ బుర్రా డైలాగ్స్ రాశారు.ఈ చిత్రానికి సంగీతం భీమ్స్ సిసిరోలియో అందించగా, సినిమాటోగ్రఫీని ప్రసాద్ మూరెళ్ల, రసూల్ ఎల్లోర్ నిర్వహిస్తున్నారు. తమ్మిరాజు ఎడిటర్.దేవకి నందన వాసుదేవ మూవీ నవంబర్ 14న థియేటర్లలో గ్రాండ్ గా విడుదల కానుంది.

## రీమిక్స్ స్వరకర్తలపై రెహమాన్ ఆగ్రహం

స్వరమాంత్రికుడు, లెజెండ్ ఏ.ఆర్ రెహమాన్ కి తీవ్రమైన కోపం వచ్చింది. అనుమతి లేకుండా చేసే రీమిక్స్ లపై అతడు తీవ్ర స్వరం వినిపించారు. పాత పాటలను రీమిక్స్ చేస్తున్న స్వరకర్తల పనిని రెహమాన్ ఊహించలేమని అన్నారు. అనుమతి లేకుండా చేసే ఈ పనిని మళ్లీ ఊహించలేరు! అంటూ సీరియస్ అయ్యారు. భారతీయ సంగీత పరిశ్రమలో పాటల రీమిక్స్ను, రీఇమాజినేషన్లను సహించలేమని రెహమాన్ ఈ ధోరణికి వ్యతిరేకంగా గట్టిగా వాదించారు. సంగీతంలో కృత్రిమ మేధస్సు ()ని ఉపయోగించడం వల్ల కలిగే ప్రమాదాలపైనా ఆందోళనను వ్యక్తం చేసారు.

హిందీ సంగీతంలో 90ల చివరలో ఈ రీమిక్స్ కల్చర్ ప్రారంభమైంది. కానీ గత కొన్ని సంవత్సరాలుగా ఇది కొత్త రూపాన్ని సంతరించుకుంది. ఐదారు సంవత్సరాల వయస్సు సినిమాల నుంచి పాటలు కూడా రీమిక్స్ అయిపోతుంటే దానికి రెహమాన్ మనస్తాపానికి గురయ్యారట. ఒక సినిమాలోని పాటను తీసి ఆరేళ్ల తర్వాత మరో సినిమాలో ఉపయోగించడం సరికాదు. మీరు దానిని మళ్లీ రూపొందించడం సరికాదు అన్నారు. రీఇమేజిన్ చేసిన పాటను సోషల్ మీడియాలో ఉపయోగించవచ్చు కానీ వాణిజ్యపరంగా ఉపయోగించకూడదు. మీరు వ్యక్తుల(ఒరిజినల్ సృష్టికర్త) అనుమతి లేకుండా వారి పనిని మళ్లీ ఊహించలేరు. మీరు దీన్ని ఇన్స్టాగ్రామ్లో పోస్ట్ చేయవచ్చు. కానీ కచ్చితంగా దీన్ని ప్రధాన స్రవంతి సినిమాల్లో ఉపయోగించలేరు" అని రెహమాన్ అన్నారు.

రెహమాన్ ఇటీవలి కాలంలో తన పాటలను రీమిక్స్ చేయడాన్ని చూశానని అన్నారు. 1995 చిత్రం బొంబాయి నుండి హమ్మ హమ్మ పాటను 'ఓకే జాను' (2017)లో రీఇమాజిన్ చేసారని తెలిపారు. అయితే రెహమాన్ 'ఓకే జాను' కోసం సంగీతం కంపోజ్ చేశారు కానీ రీమిక్స్ చేయడంలో పాల్గొనలేదు. సంగీతంలో చాలా పెద్ద సమస్య ఉంది... వెరీ బ్యాడ్ అని కూడా రెహమాన్ అన్నారు. ఇంకా పెద్ద చెడు ఏమిటంటే ని దుర్వినియోగం చేయడం.. స్వరకర్తకు అతడి శైలిని అరువుగా తీసుకున్నప్పుడు అతడికి చెల్లించకపోవడం నైతిక సమస్యలకు దారి తీయవచ్చు.. అని అన్నారు.



# ఘనంగా అంతర్జాతీయ తెలుగు మహాసభలు



ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారిని సంఘటిత పరచి, వారిలో సోదరభావం, పరస్పర ప్రేమాభిమానాలు పెంపొందిస్తూ తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి, కళలు, సాంప్రదాయ - విలువలను, తెలుగు జాతి వారసత్వ సంపదను పరిపోషిస్తూ నేటితరం మరియు భావితరాలకు అందించడానికి తగిన సమావేశాలు, చర్చలు, సమాలోచనలు, కళా ప్రదర్శనలు నిర్వహిస్తున్నది ప్రపంచ తెలుగు సమాఖ్య. తెలుగువారిలో సృజనాత్మకత, పరస్పర సహకారభావం పెంపొందేలా ఒక విశ్వవేదికను కల్పిస్తూ విశ్వవ్యాప్తంగా తెలుగుజాతి వ్యాపారాభివృద్ధికి తద్వారా సామాజిక, ఆర్థికాభివృద్ధికి తనవంతు కృషి చేస్తూ, 'సంఘీభావమే బలం' అన్న నినాదంతో నిరంతరం తెలుగుజాతి పురోగతికి పాటుపడుతున్న విశ్వవ్యాప్త తెలుగుజాతి సమైక్య వేదిక 'ప్రపంచ తెలుగు సమాఖ్య'.

తెలుగుజాతికి ప్రాచీనమైన, విశిష్టమైన చరిత్ర ఉంది. ప్రశస్తమైన, విలక్షణమైన భాషా, సాహిత్య, సంస్కృతులు ఉన్నాయి. వాటిని పరిరక్షించుకోవడంతో పాటు పరివ్యాప్తం చేయవలసిన అవసరం కూడా ఉంది. ముఖ్యంగా ఈ తరానికి వాటి ఔన్నత్యాన్ని చాటి చెప్పవలసి ఉంది. వారిలో వాటి పట్ల ఆదరాభిమానాలు, గౌరవమర్యాదలు ఇనుమడింపజేయవలసి ఉంది. ఈనాటి ఆధునిక, సాంకేతిక యుగానికి తగినట్టుగా వాటిని మలచుకొని, యువతరం విద్య, వ్యాపార, వాణిజ్య, ఆర్థిక, సామాజిక, శాస్త్ర సాంకేతిక, కళారంగాలలో రాణిస్తూ, తెలుగుజాతి ఉనికిని కాపాడుకోవాలి. అందుకు స్ఫూర్తిని అందించడానికి 1993లో స్థాపించబడిన 'ప్రపంచ తెలుగు సమాఖ్య' దాదాపు ముప్పయి (30) సంవత్సరాలుగా కృషి చేస్తోంది. అందులో భాగంగా తెలుగునాట అనేక కార్యక్రమాలతో పాటు ప్రతి రెండు సంవత్సరాలకొకసారి 'అంతర్జాతీయ తెలుగు మహాసభలు' నిర్వహిస్తూ వస్తోంది. ఇంతవరకు వివిధ రాష్ట్రాలలో, విదేశాలలో పదకొండు ద్వైవార్షిక అంతర్జాతీయ మహాసభలు చెన్నై, హైదరాబాదు, ఢిల్లీ, విశాఖపట్నం, సింగపూరు, బెంగళూరు, దుబాయ్, విజయవాడ, మలేసియాలలో, మరల 2018లో చెన్నైలో జరిగాయి.ప్రస్తుతం ప్రపంచ తెలుగు సమాఖ్య 'పన్నెండవ ద్వైవార్షిక అంతర్జాతీయ మహాసభలను 2025 జనవరి 3, 4, 5 తేదీలలో హైదరాబాదులో హైటెక్ సిటీలోని నోవాటెల్ కన్వెన్షన్ సెంటర్ హెచ్ఐసిసి కాంప్లెక్స్లో నిర్వహించడానికి భారీ ఎత్తున సన్నాహాలు జరుపుతోంది. ప్రపంచ తెలుగు సమాఖ్య అధ్యక్షులు డాక్టర్ వి.ఎల్.ఇందిరాదత్ గారి అధ్యక్షతన ఘనంగా జరిగే ఈ సమావేశాలకు ముఖ్య అతిథులుగా రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గౌరవ అతిథులుగా ఉప ముఖ్యమంత్రులు, రాష్ట్ర మరియు కేంద్రమంత్రులు మరికొందరు వివిధ రంగాల తెలుగు ప్రముఖులు హాజరు అయ్యే అవకాశం ఉంది.ఈ మహాసభల్లో ప్రముఖ తెలుగు పారిశ్రామికవేత్తలను, ఇతర రంగాలకు చెందిన కొందరు తెలుగు ప్రముఖులను సత్కరించడం జరుగుతుంది. ఈ ద్వైవార్షిక అంతర్జాతీయ మహాసభల్లో ప్రపంచ తెలుగు సమాఖ్య అనుబంధ సంస్థల ప్రతినిధుల సమావేశం మరియు వాణిజ్య, పారిశ్రామిక వేత్తల సదస్సులు జరుగుతాయి. సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా జానపద కళారూపాల ప్రదర్శన, కూచిపూడి నృత్య రూపకాలు, సాహితీ రూపకములు, భాషా, సంస్కృతులపై ప్రముఖుల ప్రసంగాలు, సినీకళాకారుల ప్రదర్శనలు, సినీసంగీత విభావరి, తెలుగువారి చేనేత వస్త్ర అందాల ప్రదర్శనలతో పాటు మరికొన్ని ఆసక్తికర కార్యక్రమాలు ఉంటాయి.ఈ మూడు రోజుల అంతర్జాతీయ మహాసభలకు హాజరు కావాలనుకునే తెలుగు భాషాభిమానులు, కళాభిమానులు ముందుగా తమ తమ పేర్లను ప్రతినిధులుగా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రపంచ తెలుగు సమాఖ్య 'వెబ్సైట్'లో ఉంచబడిన ప్రతినిధుల నమోదీకరణ పత్రం (డెలిగేట్ రిజిస్ట్రేషన్ ఫారం) ద్వారా కూడా 'ఆన్లైన్లో' రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రపంచ తెలుగు సమాఖ్య అధ్యక్షులు డాక్టర్ వి.ఎల్.ఇందిరాదత్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారిని సంఘటిత పరచి, వారిలో సోదరభావం, పరస్పర ప్రేమాభిమానాలు పెంపొందిస్తూ తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి, కళలు, తెలుగు జాతి వారసత్వ సంపదను పరిపోషిస్తూ నేటితరం, భావితరాలకు అందించడానికి తగిన సమావేశాలు, చర్చలు, సమాలోచనలు, కళా ప్రదర్శనలు నిర్వహిస్తున్నది ప్రపంచ తెలుగు సమాఖ్య. ప్రస్తుతం ప్రపంచ తెలుగు సమాఖ్య 'పన్నెండవ ద్వైవార్షిక అంతర్జాతీయ మహాసభలను 2025 జనవరి 3, 4, 5 తేదీలలో హైదరాబాదులో హైటెక్ సిటీలోని నోవాటెల్ కన్వెన్షన్ సెంటర్ హెచ్ఐసిసి కాంప్లెక్స్లో నిర్వహించడానికి భారీ ఎత్తున సన్నాహాలు జరుపుతున్నాం.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044.